thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 127 కరీంనగర్ బుధవారం, 16 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇస్రో కోసం స్వదేశీ 32-బిట్ మైక్రోప్రాసెసర్లు

బెంగళూరు : ఇస్రోకు చెందిన విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, చండీగఢ్‌లోని సెమీకండక్టర్ లేబొరేటరీ (ఎస్‌సీఎల్) సంయుక్తంగా స్పేస్ అప్లికేషన్ల కోసం విక్రమ్ 3201, కల్పన 3201 అనే 32-బిట్ మైక్రోప్రాసెసర్లను అభివృద్ధి చేశాయి.

ఈ మేరకు తొలి ఉత్పత్తులను కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్.. ఇస్రో చైర్మన్ వి నారాయణన్‌కు అందజేశారు. విక్రమ్ 3201ను లాంచ్ వెహికిల్స్ కోసం స్వదేశీయంగా తయారు చేశారు. ఇది కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనైనా ఉపయోగించడానికి అర్హత సాధించిన మొట్టమొదటి భారతీయ తయారీ 32 బిట్ మైక్రోప్రాసెసర్.

# 'బనకచర్ల' మళ్లీ మొదటికి!

## చర్చకు తెలంగాణ ససేమిరా..!!

## అభ్యంతరం తెలుపుతూ కేంద్రానికి లేఖ




హైదరాబాద్ : ఏపీ సర్కార్‌కు తెలంగాణ సర్కార్ బిగ్ షాకిచ్చింది. ఈనెల 16వ తేదీన కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరిగే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ అవసరం లేదంటూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ పంపించింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల సమావేశాన్ని కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈనెల 16వ తేదీన ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు జలశక్తి శాఖ ఇరు రాష్ట్రాల సీఎంల కార్యాలయాలు, సీఎస్‌లకు సమాచారం పంపించింది. ఈ సమావేశం బుధవారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో ఢిల్లీలోని జలశక్తి శాఖ ప్రధాన కార్యాలయం శ్రమశక్తిభవన్‌లో జరగనుంది. అయితే, ఈ అంశంతోపాటు రాష్ట్రాల తరపున మాట్లాడాల్సిన ఇతర ఎజెండా పాయింట్లు ఏమైనా ఉంటే వెంటనే పంపాలని జలశక్తి శాఖ కోరింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఏపీ ప్రభుత్వం సింగిల్ అజెండా ఇచ్చింది. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. గోదావరి -బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల సీఎంలకు పిలుపు వచ్చిన నేపథ్యంలో.. కృష్ణాపై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించడం, తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీల నీటి కేటాయింపుతో పాటు ఏబీఐపీ సాయం, ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలతో ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఎజెండాను పంపించింది. అయితే, ఏపీ ప్రభుత్వం ఇచ్చిన బనకచర్ల ఎజెండాపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ మంగళవారం ఉదయం కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం మరో లేఖ రాసింది. ఈనెల 16న జరిగే సమావేశంలో బనకచర్లపై చర్చించాల్సిన అవసరం లేదని ఈ లేఖలో తెలంగాణ సర్కార్ స్పష్టం చేసింది. జీఆర్ఎంబీ, సిడబ్ల్యూసీ, ఈఏసీ బనకచర్లపై తీవ్ర అభ్యంతరాలు తెలిపాయి. ఇప్పటివరకు బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవంటూ పూర్తి వివరాలను ఈ లేఖలో ప్రస్తావించారు. అందుకే చట్టాలను, ట్రిబ్యునల్? తీర్పులన్నీ ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం లేఖలో పేర్కొంది. గోదావరి%-%బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించటం అనుచితమని, ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని కేంద్రానికి రాసిన లేఖలో తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది.




హైదరాబాద్, జులై 15: మల్కాజ్‌గిరి ఆషాఢ మాస బోనాల చెక్కుల పంపిణీలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అల్వాల్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అల్వాల్‌లో ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, మర్రి రాజశేఖర్ రెడ్డి వచ్చారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లకు సీటు కేటాయించకుండా కాంగ్రెస్ నేతలు కూర్చోవడంతో గొడవ మొదలైంది. ప్రోటోకాల్ పాటించకపోవడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆందోళనకు దిగారు. స్టేజ్‌పై బీఆర్ఎస్ కార్పొరేటర్లు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయకుండా మాజీ కార్పొరేటర్లకు ఏ విధంగా స్థానం ఇస్తారంటూ కాంగ్రెస్ నేతలు, అధికారులను మర్రి రాజశేఖర్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ కార్పొరేటర్లపై కాంగ్రెస్ నేతలు దాడి చేశారు. గౌతమ్ నగర్ కార్పొరేటర్ భర్త రాము యాదవ్‌పై కాంగ్రెస్ నేతలు దాడి చేయడంతో ఆయనకు గాయాలయ్యాయి. వెంటనే రామును ఆస్పత్రికి తరలించారు. విప్ బీర్ల ఐలయ్య నచ్చ చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఇరు వర్గాల నేతలు పట్టించుకోని పరిస్థితి. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీ చార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. ఇటీవల సికింద్రాబాద్‌లో కూడా ఆషాఢ మాస బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే.

## పంచాయతీ ఎన్నికల నిర్వాహణపై కలెక్టర్లకు ఈసీ కీలక ఆదేశాలు




హైదరాబాద్ : తెలంగాణలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందడి మొదలైంది. గత సంవత్సర కాలంగా గ్రామాల్లో సర్పంచులు లేకపోవడంతో, ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామాల పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. ఎన్నికల కోసం ఆశావాహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వం మొదట ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తోంది. ఈ మేరకు అధికారులకు అవసరమైన సూచనలు కూడా చేసింది. ఎంపీటీసీ ఎన్నికల తర్వాతే సర్పంచ్ ఎన్నికలు ఉంటాయని తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో బీసీ రిజర్వేషన్లు కీలక అంశంగా మారాయి. తెలంగాణ కేబినెట్ ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం అమలు కోసం పకడ్బందీగా ఒక ప్రత్యేక ఆర్డినెన్స్ (జీవో) రూపొందించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది, తద్వారా ఎటువంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా చూస్తోంది. కాగా, తెలంగాణ హైకోర్టు కూడా ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 నెలల్లోపు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను 30 రోజుల్లో పూర్తి చేసి, ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి సహకరించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ప్రభుత్వం సమ్మతి తెలిపిన తర్వాత 60 రోజుల్లోపు సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు పూర్తి చేసి, ఫలితాలు ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాల నేపథ్యంలో ఎన్నికల సంఘం తమ కసరత్తును ముమ్మరం చేసింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పోలింగ్ సిబ్బంది డేటాను సిద్ధం చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో నమోదైన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది వివరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ఈసీ సూచించింది. అలాగే, రాష్ట్రంలోని జిల్లా, రెవెన్యూ, డివిజన్, మండలం, పంచాయతీలతో పాటు వార్డుల సంఖ్య ఆధారంగా పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ తాజా ఆదేశాలతో త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# మోడీ తప్పుకుంటే..

## పోస్టుకు ఆ ఇద్దరే పోటీ..

## గడ్కరీ - రాజ్‌నాథ్ ఎవరికి ఆర్ఎస్ఎస్ మద్దతు!?



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి వచ్చే సెప్టెంబరు 17తో 75 సంవత్సరాల వయసు వస్తుంది. దీంతో ఆయ నను పదవి నుంచి తప్పిస్తారని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఇటీవల బీజేపీ మాతృ సంస్థ ఆర్ ఎస్ ఎస్‌లోనూ.. ఈ తరహా చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది. 75 ఏళ్ల వయసు వచ్చాక.. పదవులు పట్టుకుని ఇంకా వేలాడడం కరెక్టు కాదని ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. ఇక, ఇప్పటి వరకు మోడీ చేసిన పనులు, తీసుకున్న చర్యలను గమనించినా.. 75 ఏళ్ల ఎఫెక్ట్ ఆయనను కూడా చుట్టుముడుతోంది. బీజేపీ, ఆర్ ఎస్ ఎస్‌లలో కీలకంగా వ్యవహరించిన.. మురళీ మనోహర్ జోషి, ఎల్ కే ఆద్వాణీ, కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప వంటి కీలక నాయకులను మోడీ హయాంలోనే వయసు 75 చూపిస్తూ.. పక్కన పెట్టారు. ఇప్పుడు తన దాకా వచ్చింది. ఈ క్రమంలో ఆయనంత ఆయన వ్యక్తిగతంగా తప్పుకొంటారో.. లేక ఆర్ ఎస్ ఎస్ జోక్యం చేసుకుని తప్పిస్తుందా? అనేది చూడాలి.ఇదిలావుంటే.. ఆర్ ఎస్ ఎస్‌లో దీనికి సంబంధించిన కీలక పరిణామం ఒకటి చోటు చేసుకుంది. మోడీ కనుక ప్రధాన మంత్రి పోస్టు నుంచి తప్పుకొంటే.. తర్వాత ఆ పదవిని చేపట్టే సామర్థ్యం ఉన్నవారు ఎవరు? అనే విషయంపై అంతర్మథనం చేపట్టారు. ఈ ఏడాది అక్టోబరు 2తో ఆర్ ఎస్ ఎస్ కూడా 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతోంది. దీంతో ఈ సంస్థకు కూడా చీఫ్‌ను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ పరిణామాల క్రమంలో తాజాగా ఆర్ ఎస్ ఎస్ భేటీ అయి.. ఈ విషయంపై చర్చించినట్టు తెలిసింది. దీని ప్రకారం.. మోడీ పోస్టుకు ఇద్దరు కీలక నాయకుల పేర్లను ప్రతిపాదించారని తెలిసింది.

ఒకరు మహారాష్ట్రకు చెందిన ప్రస్తుత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ. మరొకరు ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, ప్ర స్తుత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. ఇద్దరూ కూడా.. ఆర్ ఎస్ ఎస్ నుంచి వచ్చిన వారే. పైగా.. ఇద్ద రూ కూడా సీనియర్ మోస్టు నాయకులు, గతంలో బీజేపీకి జాతీయ స్థాయి నాయకత్వం కూడా వహించారు. వీరిద్దరూ ప్రస్తుతం మోడీ తర్వాత.. ప్రధాని పోస్టుకు పరిశీలనలో ఉన్నట్టు ఆర్ ఎస్ ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. అధికారికంగా దీనిపై ఎలాంటి ప్రకటనా రాలేదు. కానీ.. మార్పు కనుక నిశ్చయం అయితే.. రాజ్‌నాథ్, గడ్కరీలలో ఒకరికి ఖచ్చితంగా పోస్టు దక్కే అవకాశం ఉంటుందన్న చర్చ అయితే.. ఆర్ ఎస్ ఎస్ తెరమీదికి తెచ్చింది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

చురకలు



# సీఎంల భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదు

హైదరాబాద్: గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల సీఎంలకు పిలుపు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై అభ్యంతరం తెలిపింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే రేపటి సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, దిండి ప్రాజెక్టులకు జాతీయహోదా, ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని, తుమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు కేటాయించాలని అజెండాగా పంపించింది. 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలు, ట్రైబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని లేఖలో ప్రస్తావించింది. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించడం అనుచితమని పేర్కొంది. ఇలాంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలపై నమ్మకం పోతుందని తెలిపింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ నెల 16న (బుధవారం) సమావేశం కానున్నారు. ఈ మేరకు జలశక్తిశాఖ ఇరు రాష్ట్రాల సీఎంల కార్యాలయాలు, సీఎస్‌లకు సమాచారం పంపించింది. దిల్లీలోని జలశక్తిశాఖ ప్రధాన కార్యాలయం శ్రమశక్తిభవన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగుతుంది. ఈ అంశంతోపాటు రాష్ట్రాల తరపున మాట్లాడాల్సిన ఇతర ఎజెండా పాయింట్లు ఏవైనాఉంటే వెంటనే పంపాలని జలశక్తిశాఖ కోరింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఏపీ ప్రభుత్వం సింగిల్ అజెండా ఇచ్చింది. వాస్తవానికి ఈ నెల 11న సమావేశం నిర్వహించాలని నిర్ణయించి ముఖ్యమంత్రుల సమయం కోరినా, సానుకూల స్పందన రాకపోవడంతో 16వ తేదీకి వాయిదా వేశారు. ఈ తేదీన హాజరుకావడానికి ఇద్దరు ముఖ్యమంత్రులు అంగీకరించినట్లు తెలిసింది. ఏపీ పునర్విభజన చట్టం మేరకు కొత్త ప్రాజెక్టులు, జల వివాదాలకు సంబంధించిన అంశాలను కేంద్ర జలశక్తి మంత్రి ఛైర్మన్‌గా, రెండు రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా గల ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించాల్సి ఉంది. గత పదేళ్లలో రెండు సమావేశాలు జరిగాయి. ఇటీవల ఏపీ ప్రభుత్వం గోదావరి వరద జలాలను వినియోగించుకొనేందుకు బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఇప్పటికే దిల్లీలో కేంద్రమంత్రిని కలిసి అభ్యంతరం వ్యక్తంచేశారు. పర్యావరణ అనుమతులు, కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు ఇవ్వొద్దంటూ లేఖలు రాశారు. గోదావరి-బనకచర్ల వల్ల తెలంగాణలోని ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ గట్టిగా వాదన వినిపిస్తున్న నేపథ్యంలో కేంద్రమంత్రితో జరిగే సమావేశం ప్రాధాన్యం సంతరించుకొంది.



# మలక్‌పేటలో కాల్పులు.. సీపీఐ నేత మృతి

హైదరాబాద్: మలక్‌పేటలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. శాలివాహన నగర్ పార్క్‌లో ఉదయపు నడకకు వెళ్లిన సీపీఐ రాష్ట్ర నాయకుడు చందు నాయక్(43)పై గుర్తు తెలియని దండుగులు కాల్పులు జరిపారు. కారులో వచ్చిన దుండగులు ఆరు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో చందునాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. చందు నాయక్.. తన భర్య, కుమార్తెతో కలిసి ఉదయపు నడకకు వచ్చిన సమయంలో అందరూ చూస్తుండగానే కాల్పుల ఘటన చోటు చేసుకుంది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మృతుడి స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం నర్సాయిపల్లి. భూ తగాదాల కారణంగానే హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకొని ఆధారాలు సేకరించింది. కొన్నేళ్ల క్రితం చందు నాయక్ సీపీఐ ఎంఎల్ నుంచి సీపీఐలో చేరారు. 2022లో ఎల్బీనగర్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఉన్నారు. మరో వైపు కాల్పులు జరిపిన రాజేశ్, సుధాకర్ మరో ఇద్దరు నిందితులు ఎస్‌వోటీ పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు సమాచారం. **10 ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు: సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్యకుమార్..** "ఉదయం 7.30 గంటలకు ఓ వ్యక్తిపై కాల్పులు జరిగాయని సమాచారం వచ్చింది. చందునాయక్ మార్నింగ్ వాక్ చేస్తుండగా స్విఫ్ట్ కారులో వచ్చిన నలుగురు దుండగులు అతనిపై కాల్పులు జరిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నాం. నిందితుల కోసం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నాం. స్పాట్‌లో 5 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నాం. క్లూస్ టీమ్ ద్వారా అన్ని ఆధారాలు సేకరించాం. ఘటనా స్థలిలో దొరికిన బుల్లెట్లను పరిశీలిస్తే.. వెపన్‌తో ఫైరింగ్ చేసినట్టుగా ఉంది. స్పాట్‌లో ఉన్న సీసీ కెమెరాతో పాటు ఆ ప్రాంతంలో ఉన్న అని కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నాం. పాతకక్షలు ఏమైనా ఉన్నాయా?అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం. నిందితులు ఉపయోగించిన కారును గుర్తించాం. త్వరలోనే వారిని అరెస్టు చేస్తాం" అని డీసీపీ చైతన్య కుమార్ తెలిపారు.




# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు తెలంగాణ భాజపా చీఫ్ లీగల్ నోటీసులు

హైదరాబాద్: తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు లీగల్ నోటీసులు పంపారు. రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై భట్టి చేసిన వ్యాఖ్యల విషయంలో తన న్యాయవాది విజయకాంత్‌తో నోటీసులు పంపించారు. మూడు రోజుల్లో భట్టి బేషరతుగా క్షమాపణ చెప్పాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు. లేదంటే రూ.25 కోట్ల పరువునష్టం దావా వేస్తామని.. క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని నోటీసుల్లో పేర్కొన్నారు.

# జీనోమ్ వ్యాలీ తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చింది: సీఎం రేవంత్





హైదరాబాద్: శామీర్‌పేట జీనోమ్‌వ్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. "జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచాన్ని కోవిడ్ భయపెడుతున్న సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేశాం. ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలిగాం" అని సీఎం అన్నారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జీనోమ్‌వ్యాలీ ఆసియా ఖండంలోనే ప్రత్యేకమైందిగా గుర్తింపు పొందిదన్నారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉందన్నారు.

# తెలంగాణకు కేంద్రం అన్యాయం చేయదు: బండి సంజయ్



కరీంనగర్: తెలంగాణకు కేంద్రప్రభుత్వం అన్యాయం చేయదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఉద్ఘాటించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో మన తెలంగాణ వాదాన్నిసీఎం రేవంత్‌రెడ్డి గట్టిగా వినిపించాలని కోరారు. కేంద్రానికి రెండు రాష్ట్రాలు సమానమేనని నొక్కిచెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వివరించాలని సూచించారు. ఇవాళ(మంగళవారం) కరీంనర్‌లో బండి సంజయ్ పర్యటించారు. పలు కార్యక్రమాల్లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు.

బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం చేసే అన్యాయాన్ని బీసీ సంఘాలు ఎందుకు ప్రశ్నించడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన సమగ్ర సర్వేలో బీసీలు 51 శాతం.. కాంగ్రెస్ సర్వేలో మాత్రం 46 శాతమా అని ప్రశ్నించారు. బీసీల్లో ముస్లింలను కలపడం ఏంటని నిలదీశారు. బీసీలకు మీరిచ్చేది కేవలం ఐదు శాతమేనని చెప్పుకొచ్చారు. బీసీ ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకించమని స్పష్టం చేశారు. బీసీల్లో ముస్లింలను కలిపితే ఆ ఆర్డినెన్స్‌ను మాత్రం అడ్డుకుంటామని హెచ్చరించారు. బీసీలను రేవంత్ ప్రభుత్వం మోసం చేస్తోందని.. ఈ మోసంపై బీసీ సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీసీల్లో ముస్లింలను కలిపితే.. కేంద్రప్రభుత్వం ఆమోదం తెలపదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.




హైదరాబాద్: నీటి పారుదల శాఖ విశ్రాంత ఇంజినీర్ ఇన్ ఛీఫ్ జూబ్లీహిల్స్‌లోని మురళీధర్‌రావును ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయన్ను విచారించనున్నారు. హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్‌తో పాటు మురళీధర్‌రావు బంధువులు, సన్నిహితుల ఇళ్లలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. ఈఎన్‌సీ జనరల్‌గా కీలకంగా వ్యవహరించిన ఆయన ఉమ్మడి రాష్ట్రంలోనే పదవీవిరమణ పొందారు. ఆ తర్వాత ములీధర్‌రావు పదవీ కాలాన్ని 13 ఏళ్ల పాటు పొడిగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొన్నాళ్లు పదవిలో ఉన్నారు. మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక తర్వాత మురళీధర్‌రావును ప్రభుత్వం తొలగించింది.

# భూకంపం తెప్పిస్తా.. రేవంత్‌కు తలసాని వార్నింగ్!



హైదరాబాద్, జూలై 15 : తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శల దాడికి దిగారు. ఇటీవల రాష్ట్రంలో రేవంత్ సర్కార్ చేపట్టిన కులగణన లెక్కల్లో అనేక తప్పులు ఉన్నాయని ఆరోపించారు. హడావుడిగా అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపారని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం కేంద్రంపై రేవంత్ ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావటం లేదని ధ్వజమెత్తారు. తెలంగాణలో బీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కాకుంటే భూకంపం సృష్టిస్తామని హెచ్చరించారు. **మేము యాచకులం కాదు.. సీఎం సాబ్!..** ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అమలు చేయమంటే ఇప్పుడు ఆర్డినెన్స్ అంటున్నారని... అలాంటప్పుడు బిల్లు ఎందుకు ప్రవేశ పెట్టారని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చి పార్లమెంటులో ఆమోదిస్తేనే చట్టబద్ధత వస్తుందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను అడుక్కోవడానికి తాము యాచకులం కాదని.. ఇది మా బీసీల హక్కు అని అన్నారు.

# పెద్దల పంచాయితీలో ఘర్షణ.. ఇద్దరు యువకుల దారుణ హత్య



సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లిలో ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. దంపతుల వ్యవహారంపై పెద్దమనుషుల పంచాయితీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వివాదం ముదిరి ఇరువర్గాలు పరస్పరం కత్తులతో దాడులకు దిగాయి.

ఘర్షణలో కత్తిపోట్లకు గురైన మల్లేశ్, గణేష్ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అమ్మాయి వర్గం సుపారీ ముఠాను తీసుకొచ్చిందని యువకుడి వర్గం ఆరోపిస్తోంది. దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.

మహాలక్ష్మి పథకంలో భాగంగా అర్హులైన మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అయితే పోస్టాఫీస్‌లో ఖాతా ఉంటే రూ.2500 జమ చేస్తారని ప్రచారం జరగడంతో మహిళలు తపాలా కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోయినా.. హనుమకొండ జిల్లాలోని మహిళలు గత వారం రోజుల నుంచి పోస్టాఫీస్‌లో ఖాతా తీసుకుంటున్నారు. బాలింతలు, వృద్ధులు గంటల తరబడి క్యూలో వేచి ఉంటూ ఖాతాలు తీసుకుంటున్నారు. దీనిపై తపాల కార్యాలయ అధికారిని వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి అధికారికంగా తమకు ఎలాంటి సమాచారం రాలేదని తెలిపారు. పోస్టాఫీస్ ఖాతా అందరికీ ప్రయోజనకరమని, అందుకే వచ్చినవారికి ఖాతా ఇస్తున్నామని తెలిపారు.






# రాహుల్ ప్రధాని అవుతారని మీకు తెలుసా?.. పిటిషనర్‌పై బాంబే హైకోర్టు ఆగ్రహం

తన పిటిషన్ కాపీని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చదివేలా ఆదేశాలివ్వాలంటూ కోరిన పిటిషనర్‌పై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. సావర్కర్‌కు వ్యతిరేకంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి న్యాయస్థానంలో దాఖలైన పిటిషన్‌పై పిటిషనర్‌కు చురకలంటించింది. వీర్ సావర్కర్‌కు వ్యతిరేకంగా రాహుల్ మాట్లాడుతున్నారని, ఆయన తన పిటిషన్‌ను చదివేలా ఆదేశించాలని ఓ వ్యక్తి బాంబే హైకోర్టును కోరాడు. మీ పిటిషన్‌ను చదవాలని ఆయనను ఎలా బలవంతం చేస్తామని న్యాయస్థానం అతడిని ప్రశ్నించింది. దీనిపై పిటిషనర్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్ గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. ఒకవేళ ఆయన ప్రధాని అయితే విధ్వంసం సృష్టిస్తారని పేర్కొన్నారు. 'ఆయన ప్రధాని అవుతారని మాకు తెలియదు.

మీకు తెలుసా?' అని హైకోర్టు పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తంచేసింది. అయితే, రాహుల్‌పై పరువునష్టం కేసు పెట్టేందుకు పిటిషనర్‌కు న్యాయపరమైన అవకాశం ఉందని పేర్కొంది. ఈ అంశంపై సావర్కర్ మనవడు పుణె కోర్టును ఆశ్రయించారని, అక్కడ దీనిపై విచారణ జరుగుతుందని ఈసందర్భంగా న్యాయస్థానం గుర్తుచేసింది. ఇక, దీనిపై సుప్రీంకోర్టులో కూడా విచారణ జరిగిందని, అక్కడ ఆ పిటిషన్‌ను కొట్టివేసారని వెల్లడించింది. మహారాష్ట్రలో 2022లో మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. వీర్ సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో సావర్కర్ మనవడు పుణె కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇంకా విచారణ కొనసాగుతుంది.

చురకలు



# పాముకాటు పట్ల అవగాహన అవసరం

## - జూలై 16... ప్రపంచ పాముల దినోత్సవం




పాములు క్రెటేషియస్ కాలం అనగా 150 మిలియన్ సంవత్సరాల పూర్వం బల్లుల నుండి పరిణామం చెందినట్లు భావిస్తారు. సర్పాలకు సంబంధించిన విజ్ఞానాన్ని 'సర్పెంటాలజీ' లేదా 'ఒఫియాలజీ' అంటారు. ప్రతి సంవత్సరం జూలై 16న ప్రపంచ పాముల దినోత్సవం జరుపుకుంటారు. భారత దేశంలో, హిందువులు పాముల్ని నాగ దేవతలుగా పుజిస్తారు. పాములు లేదా సర్పాలు పొడవుగా, పొలుసులు కలిగి, కాళ్లులేని, భూచరాలైన సరీసృపాలు. ఇంతవరకు పాములలో 2,900 జాతులను గుర్తించారు. ఇవి అంటార్కిటికాలో మినహా ప్రపంచ మంతటా విస్తరించి ఉన్నాయి. ఇందులో చాలా వరకు విషపూరితం కావు. మొత్తం ఇరవై కుటుంబాలలో మూడింటికి చెందినవి మాత్రమే హానికరమైనవి. పాములకు చెవులు ఉండవు. భారతదేశంలో అనేక రకాల పాములు ఉన్నా వాటిలో విషపూరిత మయినవి కొన్ని మాత్రమే. ముఖ్యంగా నాగుపాము, రక్త పింజరి, కట్లపాము, రాచనాగులలో విషం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా 'ప్రతి సంవత్సరం 50 లక్షల మంది పాము కాటుకు గురవుతున్నారు. భారత దేశంలో ప్రతి సంవత్సరం రెండు లక్షల మంది పాటుకాటుకు గురవుతున్నారు. 50వేల మంది మనుషులు పాము కాటు మూలంగా చనిపోతున్నారని అంచనా. ప్రపంచంలో ఒక్క ఐర్లాండ్ దేశంలో మాత్రమే పాములు లేవు. మిగిలిన అన్ని ప్రాంతాల్లో 3 వేల జాతుల పాములున్నాయి. మన దేశంలో ఉన్న 250 జాతులలో 52 విష సర్పాలు. అమెరికా, ఆస్టేలియా, ఇంగ్లండ్ వంటి దేశాల్లో పాము కాటు మరణాలు పదుల సంఖ్యల్లో ఉంటున్నాయి. అతి పొడవైన పాము...అనకొండ, దక్షిణ అమెరికాలోని అనకొండ పొడవు రమారమి 5.5 మీటర్లు. (18 అడుగులు). అతి చిన్న పాము త్రెడ్ పాము...పొడవు 11 సె.మీ. (4.4 అంగుళాలు). వెస్ట్ ఇండీస్ లో కనబడుతుంది. అతి పొడుగాటి కోరలు గల పాము గబూన్ వైపర్... వీటి కోరలు 5 సె.మీ. (2 అంగుళాలు) కంటే ఎక్కువ. అత్యధిక వేగంతో ప్రాకే పాము... ఇది గంటకు 19 కి.మీ. (12 మైళ్ళు) వేగంతో ప్రయాణిస్తుంది. పాములు పూర్తిగా మాంసాహారులు. ఈ పరభక్షకాలు ఎక్కువగా బల్లులు, చిన్న పాములు, జంతువులు, పక్షులు, గుడ్లు, చేపలు, కీటకాలు భుజిస్తాయి. కొన్ని దేశాలలో పాముల్ని ఆహారంగా తింటారు. పాము కాటు వేయటం ద్వారా తన కోరలతో ఏర్పరచిన గాయాన్ని పాముకాటు అంటారు. పాముకాటు విషపూరిత మైనది. అయితే పాము జాతుల యొక్క అధిక భాగం విషపూరితం కానివి ఉన్నాయి. సాధారణంగా ఇవి విషంతో కంటే అదుముట ద్వారా వేటాడిన ఆహారాన్ని చంపుతాయి, విష పూరిత పాములు అంటార్కిటికా మినహా ప్రతి ఖండంలోను కనబడతాయి. పాములు తరచుగా వేట పద్ధతిగా వాటి ఆహారాన్ని కరుస్తాయి, కానీ ఇతర ప్రాణుల నుంచి రక్షించుకునేందుకు తమను వేటాడే వాటిని కూడా కరుస్తాయి. అన్ని పాముకాట్ల యొక్క అత్యంత సాధారణ లక్షణాలు అధిక భయం, కలవరం, మానసిక అస్థిరత్వం, ఈ లక్షణాలు వికారం, వాంతులు, అతిసారం, తల తిరుగుట, మూర్ఛ, గుండె వేగంగా కొట్టుకోవడం, చల్లని, తడి గల చర్మం వంటి వాటికి కారణం కావచ్చు. పాము కాటుకు గురైన రోగికి ముందు ధైర్యం చెప్పాలి. విషసర్పం కాటుకు గురైనప్పుడు నోటివెంట నురుగు, చూపు రెండు దృశ్యాలు కనిపించడం, తలనొప్పి, తల తిరుగుడు వం టి లక్షణాలు కనిపిస్తాయి. వీటిని ప్రి పెరాల్టిక్, పెరాల్టిక్ లక్షణాలుగా విభజిస్తారు. ఈ లక్షణాలు కనిపిస్తే రోగికి యాంటీ వెనమ్ డోసు ఇవ్వాలి. చాలా ప్రాంతాల్లో పాము కాటు విషానికి సరైన విరుగుడు చికిత్స అందుబాటులో లేకే బాధితులు పెరుగుతున్నారు. వ్యక్తిని ప్రశాంతంగా ఉంచాలి. తీవ్రమైన ఒత్తిడి చర్యల వలన రక్త ప్రవాహం పెరుగుతుంది, వ్యక్తి దెబ్బతినే ప్రమాదం ఉంది. గాయపడిన వ్యక్తి భయాందోళనలకు, కలవర పాటుకు గురి కాకుండా సానుకూలంగా ధైర్యం చెప్పాలి. రవాణా ఏర్పాట్ల కోసం, సమీపం లోని ఆసుపత్రి అత్యవసర గది కోసం "కాల్ ఫర్ హెల్ప్"కు ఫోన్ చేయాలి. సాధారణంగా అన్ని ప్రాంతాల ఆసుపత్రులలో తరచుగా పాము విషానికి విరుగుడు మందు ఉంటుంది. గుండె, శరీరం యొక్క ఇతర అవయవాలకు పాముకాటుకు గురైన అంగం నుండి రక్త సరఫరాను తగ్గించేందుకు పాముకాటుకు గురైన అవయవము గుండె స్థాయికి క్రింద ప్రయోజనాత్మక స్థానంలో ఉంచేందుకు కచ్చితంగా ప్రయత్నించాలి. అమెరికన్ మెడికల్ అసోసియేషన్, అమెరికన్ రెడ్ క్రాస్ సహా అనేక సంస్థలు పాముకాటును సబ్బు, నీటితో శుభ్రం చేయ వచ్చునని సిఫార్సు చేశాయి. పాముకాటుకు గురైన వ్యక్తికి తినేందుకు లేదా తాగేందుకు ఏమీ ఇవ్వకూడదు. ముఖ్యంగా వినిమయ మద్యం ముఖ్యమైనది. ఇది ఉద్రేకాన్ని పెంచి విషాన్ని రక్తనాళాలలో వేగంగా కలిసేలా చేస్తుంది. ప్రత్యేకంగా వైద్యుని ఆధ్వర్యంలో మినహా ఉత్ప్రేరకాలు లేదా నొప్పి మందులు ఇవ్వకూడదు. కాటుకు గురైన అవయవమును బిగుతుగా చేసి వాపుకు గురి చేయగల వస్తువులను లేదా దుస్తులను తొలగించాలి (వలయాలు, కంకణాలు, గడియారాలు, పాదరక్షలు, మొదలైనవి). సాధ్యమైనంత వరకు వ్యక్తిని మాట్లాడకుండా నిశ్శబ్దంగా ప్రశాంతంగా ఉంచండి. కరచిన చోట కోయ కూడదు. పాము కరచిన చోట ఉన్న గాయంపై ఒక సిరంజిని ఉంచి వాక్యూం పద్ధతి ద్వారా ఆ గాయం నుంచి రక్తాన్ని పీల్చేలా చేసి విషాన్ని తొలగించు కోవాలి.. పాము కరచిన వెంటనే సిరంజి ద్వారా విషాన్ని తొలగించి నట్లయితే గండం గట్టెక్కినట్లే.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# మధుర గాత్రానికి ప్రతిరూపం వి. రామకృష్ణ

## జూలై 16... మధుర గాయకుడు వి. రామకృష్ణ

తెలుగు సినీ సంగీతానికి ఒక నిత్యపుష్పంగా వికసించిన గాయకుడు విస్తంరాజు రామకృష్ణ దాసు, తెలుగు ప్రేక్షకులకు "వి. రామకృష్ణ"గా సుపరిచితుడు. మధురమైన స్వరానికి, సున్నితమైన భావాలకు నూరిత గాత్రానికి ఆయన మారు పేరయ్యారు. మూడు దశాబ్దాలకు పైగా శ్రోతలను తీయటి పాటలతో అలరించి, వేలాది గాన మణులను తెలుగు సంగీత ఖజానాకు అందించారు. ఆయన గాత్రం చల్లని వానలో తడిచిన తొలి చినుకుల లా ఉండేది. ప్రతి పాటా ఓ ఆత్మీయ అనుభూతి, ఒక స్వర యాత్ర. 1947 ఆగస్టు 20న విజయ నగరం జిల్లాలో జన్మించిన రామకృష్ణ చిన్నతనం నుంచే సంగీతంపై అపారమైన మక్కువను పెంచుకున్నారు. శాస్త్రీయ సంగీతంలో శిక్షణ తీసుకొని, ఆ శిక్షణను అనుభూతిగా మార్చిన అరుదైన గాయకుల్లో ఆయన ఒకరు. సంగీతాన్ని ఆత్మగా భావించిన ఆయన, కేవలం కళా ప్రదర్శనకే కాకుండా, భావ ప్రకటనకు సాధనంగా గానం చేశారు. 1960ల చివరలో సినీ రంగ ప్రవేశం చేసి, తక్కువ కాలంలోనే తన మృదువైన గాత్రంతో సంగీత దర్శకుల మన్ననలు పొందారు. కె.వి.మహదేవన్, రాజన్ నాగేంద్ర, చక్రవర్తి, కోటి వంటి దిగ్గజాలచే అవకాశం పొందిన రామకృష్ణ, అనేక హిట్ చిత్రాల్లో పాడి తెలుగు పాటల పటాన్ని ఆహ్లాదభరితంగా మలచారు రామకృష్ణ గానం సౌందర్యాన్ని మాత్రమే కాదు, సాహిత్యపు సారాన్ని కూడా ప్రతిబింబించేది. ఆయన పాడిన "చూపులేచి చినుకై తగిలే వేళ" అనే పాటలో ప్రేమలోని సంశయాలను, అమాయకపు ఆకర్షణను ఎంతో మృదువుగా మలిచారు. "ఓ ఊర్వశి కావ్యమూర్తి" అనే పాటలో శృంగార రసానికి కవిత్వపు వర్ణనను గాత్రంలో ప్రతిబింబిస్తూ, శ్రోతలను మైమర పించారు. "కలలే పలుకుతుంటే" అనే పాటలో కలలలోనూ ఊహలలోనూ మాట్లాడే అనురాగాన్ని ఆయన గొంతు స్పష్టంగా పలికించింది. "ఈ కాలమే ఈ పాత నవల" పాటలో కాలప్రవాహాన్ని, భావ వికాసాన్ని, జీవిత పరిమళాన్ని గానరూపంలో ఆవిష్కరించారు. "నిన్ను చూసాక నాకేమైనా అయ్యింది" అనే పాటలో ప్రేమ అనేది ఎప్పుడూ ఊహలకే పరిమితమవుతుందో అనే మనోభావాన్ని, ఎంతో అంతర్ముఖతతో వెలికితీశారు. ఆయన ఆలపించిన పాటల్లో భావం, భాష, బంధం అన్నీ సమపాళ్లలో మిళితమై ఉండేవి. ఘంటసాల ప్రభావం ఉన్నా, ఆ ప్రభావాన్ని అధిగమించి, తనదైన గానశైలితో రామకృష్ణ వినూత్న ప్రతిభను చూపించారు. ఆయన గొంతులో ఉన్న మృదుత్వం, మధ్య శ్రుతిలోని మెలకువ, తక్కువ గమకాలతో ఎక్కువ భావాన్ని పలికించే శక్తి ఆయన గానానికి ప్రత్యేకతను కలిగించింది. "చిత్రమైన భావాలు" వంటి తక్కువగా ప్రసిద్ధి చెందిన పాటలు కూడా ఆయన గాత్రంలోని లోతును, తేజస్సును వెల్లడించాయి. భక్తి గీతాలలోనూ ఆయనకున్న పట్టు అసాధారణం. "హర హర శంకర", "శివ శివ శివ భోజనానంద" వంటి గీతాలు ఆధ్యాత్మికతను శ్రోత గుండెల్లో నాటే స్వరంగా మారాయి. రామకృష్ణ గాత్రంలో భక్తిరసం ఓ వేదగానంలా ప్రతిధ్వనించింది. గంభీరత, శాంతి, నిబద్ధతతో కూడిన స్వరం ఆలయ గర్భగుడిలో వినిపించే శాంతస్వరంలా ఉండేది. తాతామనవడు, భక్తతుకారాం, శారద,



కృష్ణవేణి, అల్లూరి సీతారామరాజు, ముత్యాల ముగ్గు, అందాల రాముడు, భక్త కన్నప్ప, దాన వీర శూర కర్ణ, మహాకవి క్షేత్రయ్య, అమర దీపం, శ్రీమద్ విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర, శ్రీషిర్డీ సాయిబాబా మహత్యం, బలిపీఠం, గుణవంతుడు, కరుణా మయుడు లాంటి చిత్రాల్లో ఆయన పాడిన పాటలు నిత్య జ్ఞాపకాలే. ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్ బాబు, కృష్ణ, మురళీమోహన్ లాంటి అగ్రతారల చిత్రాల్లో ఆయన గొంతు తమ పాత్రలకు జీవం పోసింది. ముఖ్యంగా శోభన్ బాబు పాత్రల పట్ల ఆయన గానం ఎంతో అనురాగాన్ని కలిగించేది. ఆ పాత్రల్లోని భావోద్వేగాలను ఆయన స్వరం ఆకర్షణీయంగా వెలికితీసింది. "దేవుడే ఇచ్చాడు వీధి", "ఎంతటి రసికుడివో", "వసంత సమీర" వంటి పాటలు ఆ పాత్రల ఆత్మను మనకు వినిపించినట్లు అనిపిస్తాయి. అతని పాటలు మాత్రమే కాదు, జీవిత ప్రవర్తన కూడా గంభీరంగా ఉండేది. మితభాషి, వినయ వంతుడు అయిన రామకృష్ణ తన గాన సాధనను విలాసంగా కాక, భక్తిగా కొనసాగించారు. అనేక పురస్కారాలు, సన్మానాలు అందుకున్నా, ఎప్పటికీ వినమ్రంగా ఉండటం ఆయన వ్యక్తిత్వ విశేషం. 2015 జూలై 16న అనారోగ్యంతో ఈ గాన మధుర స్వరం మూగబోయింది. కానీ ఆయన ఆలపించిన పాటలు తెలుగు సంగీత చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోయాయి. గళపరంగా ఆయన మన మధ్య లేకపోయినా, గాత్రంగా మాత్రం ప్రతీ మనసులో ఒక తీయని ఆలాపనగా వినిపిస్తూనే ఉంటారు. వి. రామకృష్ణ ఒక గాయకుడు మాత్రమే కాదు %-% ఒక స్వరం. ఆ స్వరం మౌనంగా పలికిన భావాలకు శబ్దం ఇచ్చింది. ఆ గాత్రం తీయని అనుభూతికి రూపం ఇచ్చింది. తెలుగు గాన పరంపరలో ఆయన స్థానం శాశ్వతం. ఆయన పాటలు పల్లకిలో కూర్చుని, భావాల పయనంలో తీసుకెళ్లే లాంటి ప్రయాణం. ఆయన్ని మరచి పోవడం సాధ్యం కాదు %-% ఎందుకంటే ఆయన గానం మనల్ని తడిపించిన వర్షం, మన హృదయాన్ని తాకిన తంతి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# లోరా మిస్సైల్ తో భారత వైమానిక దళానికి కొత్త శక్తి




భారత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. మారుతున్న ప్రపంచ పరిస్థితులు, సరిహద్దుల వద్ద పెరుగుతున్న ముప్పు, మరియు సైనిక సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించిన రక్షణ శాఖ, అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఒక ముఖ్యమైన నిర్ణయం వెలుగులోకి వచ్చింది. భారత వైమానిక దళం వినియోగిస్తున్న సుఖోయ్-30 MKI యుద్ధవిమానాల్లో ఇజ్రాయెల్ అభివృద్ధి చేసిన లోరా మిస్సైళ్లను అనుసంధానించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. లోరా అనేది లాంగ్ రేంజ్ ఆర్టిలరీ వెపన్ సిస్టమ్ కు సంక్షిప్త రూపం. ఇది అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించే జీపీఎస్ ఆధారిత, బహుళ ప్రయోజనాల తేలికపాటి బాలిస్టిక్ మిస్సైల్. ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ ఈ మిస్సైల్‌ను అభివృద్ధి చేసింది. దీనిని భూమిపై నుంచి, సముద్రం నుంచి, గగనతలం నుంచి కూడా ప్రయోగించవచ్చు. లోరా మిస్సైల్ తక్కువ సమయంలో అధిక కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించగల సామర్థ్యం కలిగి ఉంది.

**- లోరా లక్షణాలు:** 90 కిలోమీటర్ల నుండి 400 కిలోమీటర్ల వరకు దీని రేంజ్ ఉంటంది.. సబ్‌సోనిక్ శబ్ద వేగం కంటే తక్కువగా ప్రయాణిస్తుంది.. జామింగ్‌కు లొంగని GPS/INS వ్యవస్థను కలిగి ఉంది. ఇది లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించడానికి సహాయపడుతుంది. 10 మీటర్లలోపు CEP అంటే లక్ష్యం నుండి కేవలం 10 మీటర్ల లోపల పడుతుందని అర్థం, ఇది అత్యంత కచ్చితత్వాన్ని సూచిస్తుంది. సుఖోయ్-30 MKI వంటి మల్టీరోల్ ఫైటర్ జెట్ల నుండి ప్రయోగించవచ్చు.

**- భారత ప్రయోజనం ఏమిటి?...** భారత వైమానిక దళం ఇప్పటికే వివిధ రకాల గగనతలం నుంచి గగనతలానికి .. గగనతలం నుంచి భూమికి ప్రయోగించే మిస్సైళ్లను ఉ పయోగిస్తోంది. అయితే, లోరా మిస్సైల్‌ను సుఖోయ్ విమానాల్లో అనుసంధానం చేయడం వల్ల భారత వైమానిక దళానికి అదనపు శక్తి లభిస్తుంది . దీర్ఘదూర భూస్థాయి లక్ష్యాలను ఛేదించే శక్తి లభిస్తుంది. సురక్షితమైన దూరం నుండే శత్రు స్థావరాలు.. కీలక లక్ష్యాలపై దాడి చేయగల సామర్థ్యం లభిస్తుంది. అకస్మిక దాడుల సామర్థ్యం పెరుగుతుంది. శత్రు దేశ శిబిరాలపై సురక్షిత దూరం నుంచి ఆకస్మిక , కచ్చితమైన దాడులు నిర్వహించగల సామర్థ్యం పెరుగుతుంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన లక్ష్యాలను గగనతలం నుంచే నాశనం చేసే అవకాశం కలుగుతుంది.

**- రక్షణ స్వయం సమృద్ధికి 'ఫోర్స్ మల్టిప్లయర్'...** లోరా మిస్సైల్ సమీకరణ భారత సైనిక వ్యూహాలలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది. ఇది కేవలం ఒక మిస్సైల్ మాత్రమే కాదు. దేశ రక్షణ వ్యూహంలో ఇది ఒక ఫోర్స్ మల్టిప్లయర్ గా మారుతుంది. ఇటువంటి ఆధునిక సాంకేతికతను స్వీకరించడం ద్వారా భారత వైమానిక దళం తన సామర్థ్యాన్ని మరింతగా విస్తరిస్తోంది. భవిష్యత్తులో స్వదేశీ మిస్సైళ్లను కూడా అంతే సామర్థ్యంతో అభివృద్ధి చేయడం కోసం DRDO ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. అయితే తక్షణ అవసరాల దృష్ట్యా లోరా వంటి నిరూపితమైన సాంకేతికతను సమీకరించడం ద్వారా, భారత్ వ్యూహాత్మకంగా ముందంజ వేసినట్టే అవుతుంది.. లోరా మిస్సైల్ అనుసంధానం భారత వైమానిక దళానికి ఒక కొత్త మార్గదర్శకం. ఇది శత్రుదేశాలను మానసికంగా ప్రభావితం చేసే, భారత శక్తిని స్పష్టంగా చాటే ఒక ముప్పు ఆయుధంగా మారనుంది.

# భార్యల చేతిలో భర్తల హత్యలు

## ఐదేళ్లలో 785 మంది బలి!

దేశవ్యాప్తంగా ఇటీవల భార్యల చేతిలో భర్తల హత్యలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. గత ఐదేళ్లలో ఐదు రాష్ట్రాల్లో ఏకంగా 785 మంది భర్తలు హత్యకు గురయ్యారని వెల్లడైంది. ఈ గణాంకాలు సమాజంలో పెరిగిపోతున్న వివాహేతర సంబంధాలు, వాటి వల్ల తలెత్తుతున్న దారుణ పరిణామాలను కళ్ళకు కడుతున్నాయి. ఒకప్పుడు మహిళల భద్రతపై చర్చ జరిగే చోట, ఇప్పుడు పురుషులు, ముఖ్యంగా భర్తల భద్రత ప్రశ్నార్థకంగా మారడం గమనార్హం.

**-ఐదు రాష్ట్రాల్లో ఆందోళనకర పరిస్థితి...** ఈ హత్యలు కేవలం ఒక రాష్ట్రానికి పరిమితం కాకుండా ఉత్తర ప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల్లోనూ ఎక్కువగా నమోదవుతున్నాయి. పోలీసులు విడుదల చేసిన గణాంకాలు ఈ పరిణామం యొక్క తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఉత్తర ప్రదేశ్ లో ఈ ఐదేళ్లలో అత్యధికంగా 274 మంది భర్తలు హత్యకు గురయ్యారు. 2020లో 45, 2021లో 52, 2022లో 60, 2023లో 55, 2024లో 62 మంది బలయ్యారు. బీహార్ లో 186 మంది భర్తలు హత్యకు గురయ్యారు. 2020లో 30, 2021లో 35, 2022లో 40, 2023లో 39, 2024లో 42 మంది హత్యకు గురయ్యారు. రాజస్థాన్ లో 138 మంది భర్తలు హత్యకు గురయ్యారు. 2020లో 20, 2021లో 25, 2022లో 28, 2023లో 30, 2024లో 35 మంది హతమయ్యారు. మహారాష్ట్ర లో 100 మంది భర్తలు హత్యకు గురయ్యారు 2020లో 15, 2021లో 18, 2022లో 20, 2023లో 22, 2024లో 25 మంది అసువులు బాసారు. మధ్యప్రదేశ్ లో 87 మంది భర్తలు హత్యకు గురయ్యారు 2020లో 12, 2021లో 15, 2022లో 18, 2023లో 20, 2024లో 22 మంది మర్డర్ అయ్యారు.

**- వివాహేతర సంబంధాలే ప్రధాన కారణం...** పోలీసుల విచారణలో ఈ హత్యలకు ప్రధాన కారణం వివాహేతర సంబంధాలే అని తేలింది. కొందరు భర్తలు ఇతర మహిళలతో సంబంధాలు పెట్టుకోగా మరికొందరు భార్యలు తమ ప్రియులతో కలిసి భర్తలను అడ్డు తొలగించుకోవాలని చూశారు. ఈ క్రమంలో తలెత్తిన ఘర్షణలు చివరకు దారుణ హత్యలకు దారి తీశాయి. ఈ కేసుల దర్యాప్తులో మొబైల్ కాల్ డేటా కీలక పాత్ర పోషించిందని పోలీసులు తెలిపారు. ఫోన్ లొకేషన్లు, సందేశాలు, కాల్ రికార్డుల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేయగలిగారు. ఇప్పటికే చాలామంది నిందితులు జైలు పాలయ్యారు.

**- పెళ్లిపై పెరుగుతున్న భయం...** ఈ తరహా ఘటనలు యువతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. "పెళ్లి" అనే బంధం పట్ల యువతలో భయం, అపనమ్మకం పెరుగుతోంది. హనీమూన్‌కు వెళ్లిన భర్తలను సైతం భార్యలు మోసపూరితంగా హత్య చేసిన కొన్ని ఉదాహరణలు సమాజంలో మరింత కలకలం రేపుతున్నాయి.

**- సమాజానికి అవగాహన అత్యవసరం...** ఈ సంఘటనలు మహిళలందరినీ తప్పుబట్టడానికి ఉద్దేశించినవి కావు, కానీ సమాజంలో చోటు చేసుకుంటున్న ఈ విపరీత ధోరణులను విశ్లేషించి, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. పురుషుల భద్రతను కూడా సమాజం సీరియస్‌గా పరిగణించాలి. సంబంధాలు నమ్మకం, ప్రేమ, గౌరవం మీద ఆధారపడి ఉండాలి తప్ప, పగ, ప్రతీకారాలకు వేదిక కారాదని నిపుణులు సూచిస్తున్నారు. సంసారంలో సమస్యలు ఎదురైనప్పుడు, వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి కానీ, ప్రాణాలను బలి తీసుకోవడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని సమాజం గుర్తించాలి. ఈ దారుణ ఘటనల నేపథ్యంలో, పెళ్లి పట్ల యువతలో నమ్మకాన్ని తిరిగి పెంపొందించడానికి సామాజిక అవగాహన కార్యక్రమాలు, కౌన్సిలింగ్‌లు అవసరమని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్‌లో

## ఎటుచూసినా గ్రాండ్ 'ఇండియా'నే..!

టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్ టోర్నీలు నాలుగు.. ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్. వీటిలో మిగతా అన్నిటికంటే వింబుల్డన్ క్రేజే వేరు..! పచ్చటి కోర్టు.. చుట్టూ హుందాగా అభిమానులు.. సర్రున దూసుకొచ్చే బంతులు.. టెన్నిస్ అంటే వింబుల్డన్‌లోనే చూడాలి అనేంతగా ఉంటుంది ఈ గ్రాండ్‌స్లామ్. ఆదివారం పురుషుల ఫైనల్స్‌తో ఈ ఏడాది వింబుల్డన్ ముగిసింది. శనివారం మహిళల సింగిల్స్ ఫైనల్లో స్వైటెక్ విజయం సాధించగా, ఆదివారం పురుషున ఫైనల్లో టాప్‌సీడ్ యానిక్ సినర్ గెలుపొందారు. ఈ ఏడాది వింబుల్డన్ ప్రత్యేకత ఏమంటే.. స్వియాటెక్ కొత్త చాంపియన్ కాగా.. వింబుల్డన్ గెలవడమూ సినర్‌కు ఇదే తొలిసారి. అంటే.. మహిళల, పురుషుల విభాగాల్లో కొత్త చాంపియన్‌లను చూశాం




అన్నమాట. ఇక టెన్నిస్ అభిమానులు ఈ ఏడాది చివరిదైన గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్ కోసం నిరీక్షించాల్సి ఉంటుంది. అమెరికాలో సెప్టెంబరులో ఈ టోర్నీ జరుగుతుంది.

**ఈ తరానికి ఎవరో రారాజు..?...** మొన్నటివరకు పురుషుల టెన్నిస్‌లో రారాజు అల్కరాజ్ అని భావించారు. 22 ఏళ్ల ఈ స్పెయిన్ యువకుడు తన ఆటతో టెన్నిస్ ప్రపంచాన్ని అంతగా ముగ్ధుడిని చేశాడు. 22 ఏళ్లకే ఐదు టైటిల్స్ కొట్టాడు. అయితే, అల్కరాజ్‌కు తానేమీ తక్కువ తినలేదని చాటుతున్నాడు సినర్. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్కరాజ్ చేతిలో ఓటమికి ఆదివారం వింబుల్డన్‌లో ప్రతీకారం తీర్చుకున్నాడు ఈ ఇటలీ కుర్రాడు. దీంతో సినర్ ఖాతాలో నాలుగో గ్రాండ్‌స్లామ్ చేరింది. పీట్ సంప్రాస్-ఆంద్రీ అగస్సీ, రోజర్ ఫెడరర్-రఫెల్ నాదల్ తరహాలో వీరిద్దరూ వచ్చే పదేళ్ల పాటు టెన్నిస్ ప్రపంచంలో హోరాహోరీగా పోటీ పడడం ఖాయం అని తెలుస్తోంది. గ్రాండ్‌స్లామ్ టెన్నిస్‌లో భారత్ ఉనికి హైదరాబాదీ సానియా మీర్జాతోనే కనుమరుగైందా? అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జా ఒక దశలో అద్భుత విజయాల తో ప్రపంచ టెన్నిస్‌లో భారత పతాకాన్ని ఎగురవేశారు. ఇప్పుడు ఆ స్థాయిలో ఎదిగే ఆటగాళ్లు కనిపించడం లేదు. కానీ, మరో విధంగా గ్రాండ్‌స్లామ్‌లో మేకిన్ ఇండియా ఉనికి కనిపిస్తోంది. అదెలాగంటే.. తువాళ్ల ద్వారా (టవల్స్). మన దేశంలో తయారైన ఈ టవళ్లను వింబుల్డన్‌లో వినియోగించారు. టెన్నిస్‌లో టవళ్ల పాత్ర చాలా కీలకం అనే సంగతి తెలిసిందే. ఆటగాళ్లతో సమానంగా ఈ టవళ్లు కనిపిస్తుంటాయి. ఇలా వింబుల్డన్‌లో వాడిన టవళ్లను ఆటగాళ్లు కూడా చాలా ఇష్టపడ్డారట. ప్రముఖ క్రీడాకారులందరూ ఎంతో ఇష్టంగా వీటిని ఇంటికి తీసుకెళ్లారట. మ్యాచ్‌లో చెమటను తుడుచుకునేందుకు వాడే టవళ్లు ఆటగాళ్లకు చాలా సౌకర్యంగా ఉన్నాయట. ప్రస్తుతం ఇంగ్లండ్‌లో వేసవి కావడంతో చెమట పడుతుంది. దానిని తుడుచుకు నేందుకు మేకిన్ ఇండియా టవళ్లు బాగా పనికొచ్చాయని టాక్.

చురకలు

## సంపాదకీయం

# ఎఫ్ -35 ఫైటర్ జెట్.. ఇంకా ఎన్నిరోజులు?


కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో నెల రోజులుగా నిలిచిపోయిన బ్రిటన్ నౌకాదళానికి చెందిన అత్యాధునిక యుద్ధ విమానం ఎఫ్-35 ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హైడ్రాలిక్ వ్యవస్థలో తలెత్తిన సమస్యతో జూన్ 14న అత్యవసరంగా ల్యాండింగ్ చేసిన ఈ ఫైటర్ జెట్, అప్పటి నుండి అక్కడే నిలిచివుంది.

**-రహస్య మరమ్మతులు...** మొదటి దశలో సుమారు మూడు వారాల పాటు విమానం విమానాశ్రయంలో బహిరంగంగానే నిలిపివేయబడింది. ఆ తర్వాత, జూలై 6న దీనిని ఒక ప్రత్యేక హ్యాంగర్‌కు తరలించి మరమ్మతుల ప్రక్రియను ప్రారంభించారు. అయితే ఇది సాధారణ మరమ్మతు కాదు. ఈ ప్రక్రియ అత్యంత రహస్యంగా, అత్యధిక భద్రత మధ్య సాగుతోంది. ఈ మరమ్మతుల కోసం బ్రిటన్ నుండి 24 మంది నిపుణుల బృందం వచ్చింది. వీరిలో 14 మంది సాంకేతిక నిపుణులు కాగా, మిగిలిన 10 మంది విమాన క్రూ సభ్యులు. ఈ బృందం ఎఫ్-35లో తలెత్తిన హైడ్రాలిక్ లోపాన్ని పరిష్కరించేందుకు నిత్యం కృషి చేస్తోంది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి సంతృప్తికరమైన ఫలితం రాలేదు.

**-ఆస్ట్రేలియాకు బయలుదేరి...** ఈ ఫైటర్ జెట్ అసలు గమ్యం ఆస్ట్రేలియాగా తెలుస్తోంది. మార్గ మధ్యలో ఇంధన సమస్యలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితులు ఎదురుకావడంతో పైలట్ అత్యవసరంగా సమీప విమానాశ్రయమైన తిరువనంతపురంలో ల్యాండ్ చేశారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఈ యుద్ధవిమానం తిరిగి గాల్లోకి లేచిన దాఖలాలు లేవు. ప్రస్తుతం విమానం చుట్టూ బ్రిటిష్ భద్రతా సిబ్బంది ముమ్మర నిఘా పెట్టారు. భారతీయ సిబ్బంది విమానం నుండి దూరంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ రహస్యతే ఈ విమానానికి మరింత ఆసక్తిని కలిగిస్తోంది.

**- విడిభాగాలుగా తరలిస్తారా?...** సాంకేతిక మరమ్మతులు ఫలించకపోతే, ఎఫ్-35ని విడిభాగాలుగా విభజించి, భారీ ట్రాన్స్‌పోర్ట్ విమానం సీ-17 గ్లోబ్ మాస్టర్ ద్వారా తిరిగి బ్రిటన్‌కు తరలించే అవకాశముంది. దీన్ని అమలు చేయగలిగేది కేవలం లాక్‌హీడ్ మార్టిన్ సంస్థకు చెందిన ప్రత్యేక ఇంజినీర్లే. ఈ పరిణామాలతో భారత విమానాశ్రయ చరిత్రలోనే ఒక అరుదైన ఘటనగా ఎఫ్-35 నిలిచిపోయింది. రాబోయే రోజుల్లో దీని మరమ్మతులు పూర్తవుతాయా? లేక దీన్ని విదేశాలకు తరలించాల్సి వస్తుందా? అన్నదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిస్థితి ఎలా ముగుస్తుందో వేచి చూడాలి.

# సైన్య ఆధునీకరణలో కృష్ణారావుది చెరగని ముద్ర - జూలై 16... జనరల్ కె. వి. కృష్ణారావు జయంతి




జనరల్ కృష్ణారావు భారత ప్రసిద్ధ సైనిక అధికారులలో ఒకరు. ఆయన దూరదృష్టి గలవారు. 1971లో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో పాల్గొని అపూర్వ దైర్యసాహసాలు ప్రదర్శించారు. బంగ్లాదేశ్ విముక్తి సమయంలో ఆయన చేసిన సేవలు అసమానాలు. 1980 దశక ప్రారంభంలో భారత సైన్యాన్ని ఆధునీకరించడం ప్రారంభించారు. ఒక తరం సైనికులను ప్రేరేపించారు. జనరల్ కె.వి. కృష్ణారావుగా ఖ్యాతి నందిన కొటికల పూడి వెంకట కృష్ణారావు, జూలై 16 1923న విజయవాడలో కె.ఎస్. నారాయణ రావు, లక్ష్మీరావు దంపతులకు జన్మించారు. ఆయన ఆగష్టు 9, 1942 న ఇండియన్ ఆర్మీలో చేరారు. 1947 లో విభజన వరకు, యువ అధికారిగా ఉన్నపుడే రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్, బెలూచిస్తాన్ లలో ఆయన పని చేశారు. దేశ విభజన సమయంలో తూర్పు, పశ్చిమ పంజాబ్‌లలో విధులు నిర్వర్తించారు. భారత సైనిక దళాల మాజీ ఛీఫ్ ఆయ్యాక, జమ్మూ కాశ్మీర్, నాగాలాండ్, మణిపూర్, త్రిపుర రాష్ట్రాలకు గవర్నరుగా పని చేసారు. ఆయన జమ్మూ కాశ్మీరు గవర్నరుగా మొదటిసారి 1989 జూలై 11 నుండి 1990 జనవరి 19, రెండవసారి 1993 మార్చి 13 నుండి 1998 మే 2 వరకు పనిచేసి చెరగని ముద్ర వేశారు. 1947 లో విభజన వరకు విస్తృతమైన పంజాబ్ అవాంతరాల సమయంలో, తూర్పు మరియు పశ్చిమ పంజాబ్ లలో పనిచేశారు. 1947 - 48లో జరిగిన భారత్-పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపక శిక్షకులలో కృష్ణారావు ఒకరు. 1949 - 51 మధ్య ఆయన డిఫెన్స్ అకాడమీలో పని చేశారు. 1965 - 66లో లడఖ్‌లో ఒక దళానికి, 1969 - 70లో జమ్మూ ప్రాంతంలో ఇన్‌ఫాంట్రీ విభాగానికి కమాండర్‌గా వ్యవహరించారు. 1970 - 72 మధ్య నాగాలాండ్, మణిపూర్‌లలో తిరుగుబాట్ల అణచివేత దళాలకు నేతృత్వం వహించారు. 1971 యుద్ధంలో రావు అందించిన సహకారం, దేశం యొక్క ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం కోసం చేసిన కృషి ఎల్లప్పుడూ గుర్తుండిపోతుంది. ఆ కాలంలో, ఆయన విభాగం 1971లో భారత - పాకిస్తాన్ యుద్ధంలో కూడా పాల్గొంది. సిల్హెట్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడంలో, ఈశాన్య బంగ్లాదేశ్ విముక్తికి కీలక పాత్ర పోషించారు. ఆ యుద్ధంలో కృష్ణారావు చూపిన ధైర్యం, సాహసోపేత నిర్ణయాలు, నాయకత్వ ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం పరమ విశిష్ట సేవా పతకంతో సత్కరించింది. 1975 - 76 మధ్యకాలంలో, దేశ భవిష్యత్ రక్షణ కోసం పునర్వ్యవస్థీకరణ, ఆధునీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. ఆయన 1978-79 మధ్య ఆర్మీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ గా పని చేశారు. తదనంతరం, పదోన్నతి పొందారు. 1979-81 మధ్య కాలంలో వెస్ట్రన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్- ఇన్ - చీఫ్ గా పని చేశారు. కృష్ణా రావు జూన్ 1, 1981 న ఆర్మీ స్టాఫ్ చీఫ్ గా నియమితులై, జూలై 1983 వరకు సమర్థ వంతంగా పని చేశారు. మార్చి 1982 నుండి జూలై 1983 వరకు సర్వీసులలో అత్యున్నత నియామకం అయిన చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్మన్ కూడా అయ్యారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బర్మా, బెలూచిస్తాన్ లలో పని చేశారు. దేశ విభజన సమయంలో తూర్పు, పశ్చిమ పంజాబ్‌ల్లో విధులు నిర్వర్తించారు. ఆయన ఆర్మీ ఛీఫ్ గా 1983 లో పదవీ విరమణ చేసారు. కృష్ణారావు సేవలను గుర్తించిన కేంద్రం ఆర్మీ చీఫ్‌గా రిటైరైన అనంతరం ఆయనకు గవర్నర్‌గా అవకాశం కల్పించింది. 1984-89 మధ్య నాగాలాండ్, మణిపూర్, త్రిపుర గవర్నర్‌గా ఆయన పని చేశారు. మధ్యలో 1988లో కొంతకాలం పాటు మిజోరం గవర్నర్‌గా అదనపు బాధ్యతలను నిర్వర్తించారు. 1989 - 90 మధ్య, తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో ప్రాక్సీ యుద్ధం గరిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు, 1993 - 1998 మధ్య జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా తిరిగి పని చేశారు. ఉగ్రవాదం, తిరుగుబాట్లతో అట్టుడికిన కశ్మీర్‌లో తిరిగి శాంతి నెలకొనేందుకు కృషి చేశారు. ఆయన జనవరి 30 2016 న న్యూఢిల్లీలో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# రాజకీయాల్లో చెరగని ముద్ర తేళ్ల లక్ష్మీకాంతమ్మ - జూలై 16....తేళ్ల లక్ష్మీకాంతమ్మ జయంతి



తేళ్ల లక్ష్మీకాంతమ్మ... ఈ పేరు ఈ తరం తెలుగు వారికి అంతగా తెలియక పోవచ్చు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఆరున్నర దశాబ్దాల క్రితం లోకసభకు ఎన్నికై...నెహ్రూ, శాస్త్రి లాంటి నాటి కాంగ్రెస్ అగ్ర నాయకుల అభిమా నాన్ని చూరగొని, తర్వాత ఇందిరా గాంధీ, పి.వి. నరసింహా రావు లాంటి ప్రధానులకు చేరువై, మహిళా పక్షపాతిగా పేరెన్నికగన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ డిపాజిట్ రాని, ఒకనాటి కమ్యూనిస్టు కంచుకోట అయిన ఖమ్మం నుండి లోక సభకు పోటీ చేసి తొలి విజయం నమోదు చేసి, అదే ఊపులో మరో రెండు సార్లు విజయ దుందుభి మోగించి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించిన రికార్డు ఆమెదే. ఆమె రాజకీయ ఆరంగేట్రం ఎలా జరిగింది అంటే...1957లో తనకు ఎమ్మెల్యే టిక్కెట్ కావాలని కాంగ్రెస్ పార్టీని అడిగిన సందర్భంలో ఆమె భర్త ఒక ప్రభుత్వ అధికారి అయిన కారణం తో, ఆమెకు టికెట్ నిరాకరించారు. తాను ముందుగా భారత పౌరురాలినని, తర్వాతే అధికారి భార్యనని వాదించి, లాల్ బహదూర్ శాస్త్రిని మెప్పించి ఒప్పించి ఖమ్మం లోకసభ స్థాన టికెట్ పొందారు. అసలు కాంగ్రెస్‌కు అంతకుముందు డిపాజిట్లు కూడా దక్కని సీటులో ఆమె పోటీ చేయడం, గెలవడం ఏమిటని చర్చల నేపథ్యంలో అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తి, ఔరా అనిపించి ఆ సీటులో గెలిచి చూపించారు తేళ్ల లక్ష్మీకాంతమ్మ. 1957, 1962, ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లోనూ లక్ష్మీకాంతమ్మ వరుసగా మూడుసార్లు ఖమ్మం ఎంపీగా గెలిచారు. నెహ్రూ ప్రభు త్వంలో పార్లమెంటు కమిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా పని చేశారు. అలాగే ఆమె తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించి, అప్పటిదాకా సివిల్స్ లో మహిళలకు ప్రవేశం లేని స్థితిలో, ఇందిరా గాంధీని ఒప్పించి సివిల్స్ లో మహిళ లకు అవకాశం లభించేలా చేశారు. మహిళలకు సమాన ఆస్తి హక్కు కోసం పార్లమెంటులో అనేక సార్లు మాట్లాడారు. 1972లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యురాలిగా మహిళలు, యువకులకు ఎక్కువ టిక్కెట్లు వచ్చేలా కృషి చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన తేళ్ల లక్ష్మీకాంతమ్మ 1924, జూలై 16న జోగులాంబ గద్వాల జిల్లా, ఆలంపూర్ లోని కమ్మ భూస్వా ముల కుటుంబానికి చెందిన వెంకట్ రెడ్డి - మంగమ్మ దంప తులకు జన్మించారు. 5వ తరగతి వరకు కర్నూలులో చదివి, గుడివాడలో ఎస్ఎస్ఎల్సీ, ఇంటర్మీడియట్ మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో, మచిలీ పట్నంలో బిఏ, బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం నుండి 1971లో ఆర్థిక శాస్త్రంలో ఎం.ఏ పట్టా పొందారు. ఆమె 1944, నవంబరు 1న అనంతపురం జిల్లా అటవీ అధికారి టి.వి.సుబ్బారావును వివాహం చేసుకున్నారు. లక్ష్మీకాంతమ్మ ఖమ్మం నియోజక వర్గం నుండి 1957లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికై, ఆ తర్వాత 1962లో, ఆ తర్వాత ఖమ్మం లోకసభ నియోజకవర్గం నుండి వరుసగా మూడుసార్లు ఎన్నికై 1977వరకు లోక్‌సభలో ఖమ్మంకు ప్రాతినిధ్యం వహించారు. 1967లో పార్లమెంటు బృందంలో సభ్యురాలిగా ఆస్ట్రేలియా పర్యటించారు. 1978లో జనతా పార్టీ తరఫున హైదరాబాదు నగరంలోని హిమాయత్ నగర్ శాసనసభా నియోజకవర్గం నుండి గెలుపొందారు. ఆమె తెలుగులో ప్రగతి పథంలో మహిళలు అనే పుస్తకాన్ని, ఆంగ్లంలో కో-ఆపరేషన్ టుడే అండ్ టుమారో అనే పుస్తకాల్ని ప్రచురించారు. బాద్షా ఖాన్ జీవితచరిత్రను తెలుగులోకి అనువదించారు. తాను రాష్ట్రపతిగా ఎన్నిక కావడంలో తేళ్ల లక్ష్మీకాంతమ్మ పాత్ర కీలకమని తన జీవిత చరిత్రలో చెప్పుకున్నారు దివంగత రాష్ట్రపతి వి.వి.గిరి. ఇందిరాగాంధీకి ఆమెతో ఉండిన సాన్నిహిత్యం దృష్ట్యా, ఎన్నిసార్లు అడిగినా కేంద్ర మంత్రి పదవి స్వీకరించ లేదని, ఒక దశలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఇందిరా గాంధీ ప్రతిపాదించినా, ఆమె అంగీక రించక, మేధావి, అనుభవజ్ఞుడు అయిన పీవీ అయితేనే బాగుం టుందని చెప్పారని, పీవీ నరసింహా రావు ముఖ్యమంత్రి కావడానికి లక్ష్మీ కాంతమ్మ ఒక విధంగా కారణమని ఆ రోజుల్లో చెప్పుకునే వారు. ఇందిరాగాంధీకి అంత సన్నిహి తురాలు అయినా, ఇందిర విధించిన ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించి, లక్ష్మీకాంతమ్మ కాంగ్రెస్ ను వీడి, జనతాపార్టీలో చేరి, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. హైదరాబాద్ లో హిమా యత్ నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. హైదరాబాద్ లో బీహెచ్ఈఎల్, కొత్తగూడెం థర్మల్ ప్రాజెక్ట్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ రావడంలో ఆమెది కీలక పాత్ర అని చెబుతుంటారు. 2007 డిసెంబర్ 13న 83 ఏళ్ల వయసులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# స్వాతంత్ర్యోద్యమ గ్రాండ్ ఓల్డ్ లేడీ అరుణా అసఫ్ అలీ - జూలై 16...అరుణా అసఫ్ అలీ జయంతి



భారత స్వాతంత్ర్య ఉద్యమంకు సంబంధించి 'గ్రాండ్ ఓల్డ్ లేడీ' గా వన్నె కెక్కిన అరుణా అసఫ్ అలీ (జూలై 16, 1909 - జూలై 29, 1996) ప్రసిద్ధ భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర మరవని గొప్ప నాయకురాలు. 1942లో గాంధీజీ జైలుకెళ్ళినపుడు క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించిన మహిళ. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో బొంబాయిలోని గవాలియా టాంకు మైదానంలో భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసిన మహిళగా చిరస్మరణీయురాలు. ఢిల్లీ నగరానికి మెట్టమొదటి మేయర్. ఆమెకు మరణానంతరం భారతరత్న అవార్డు లభించింది. అరుణా గంగూలీ, హర్యానాలోని కాల్కాలో ఒక బెంగాలీ బ్రహ్మసమాజ కుటుంబంలో జన్మించింది. ఈమె విద్యాభ్యాసం లాహోరు, నైనీతాల్ లలో జరిగింది. చదువు పూర్తయిన తర్వాత ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. దేశములోని అప్పటి పరిస్థితుల్లో అది ఒక మహిళకు గొప్ప ఘనతే. ఆమె కలకత్తాలోని గోఖలే స్మారక పాఠశాలలో బోధించింది. అరుణకు భారత జాతీయ కాంగ్రెస్ నాయకుడైన అసఫ్ అలీతో అలహాబాదులో పరిచయ మేర్పడింది. ఆ పరిచయం పెళ్ళికి దారి తీసింది. అరుణ తల్లితండ్రులు మతాలు వేరు (తల్లి హిందూ, తండ్రి ముస్లిం), వయోభేదము (ఇద్దరికీ వయసులో 20 ఏళ్ళకి పైగా తేడా) ఎక్కువన్న భావనతో ఆ పెళ్ళిని వ్యతిరేకించినా 1928లో అరుణ, అసఫ్ అలీని వివాహమాడింది. అరుణ తండ్రి ఉపేంద్రనాథ్ గంగూలీ తూర్పు బెంగాల్లోని బరిసాల్ జిల్లాకు చెందినవాడు. సంయుక్త రాష్ట్రాల్లో (యునైటెడ్ ప్రావిన్స్)లో స్థిరపడ్డాడు. ఆయన ఒక రెస్టారెంటు యజమాని, సాహసికుడు. ఆమె తల్లి అంబాలికా దేవి, అనేక హృద్యమైన బ్రహ్మసమాజ ప్రార్థనాగీతాలు రచించిన ప్రముఖ బ్రహ్మజ నాయకుడు త్రైలోక్యనాథ్ సన్యాల్ కూతురు. ఉపేంద్రనాథ్ గంగూలీ యొక్క చిన్న తమ్ముడు ధీరేంద్రనాథ్ గంగూలీ తొలితరం భారతీయ సినిమా దర్శకుడు. మరో సోదరుడు నాగేంద్రనాథ్, ఒక మృత్తికా జీవశాస్త్రజ్ఞుడు, రవీంద్రనాథ్ టాగూర్ ఏకైక కుమార్తె మీరా దేవిని పెళ్ళి చేసుకున్నాడు. కానీ, కొన్నాళ్ళ తర్వాత వాళ్ళు విడిపోయారు. అరుణ సోదరి, పూర్ణిమా బెనర్జీ భారత రాజ్యాంగ సభలో సభ్యురాలు. వివాహము తర్వాత అరుణ భారత జాతీయ కాంగ్రెస్ లో క్రియాశీలక సభ్యురాలై ఉప్పు సత్యాగ్రహములో నిర్వహించిన బహిరంగ ప్రదర్శనలలో పాల్గొన్నది. ఆమెను దేశదిమ్మరి అనే అభియోగము మోపి అరెస్టు చేశారు. రాజకీయ ఖైదీలందరి విడుదలకు తోడ్పడిన గాంధీ - ఇర్విoగ్ ఒప్పందముతో 1931లో ఆమెను విడుదల చేయలేదు. అరుణతో పాటు ఖైదులో ఉన్న ఇతర మహిళా ఖైదీలు అరుణను విడుదల చేసేవరకు జైలును వదిలి వెళ్ళేది లేదని పట్టుబట్టారు. మహాత్మా గాంధీ కలుగ జేసుకోవటంతో కానీ వీరు తమ పట్టును సడలించలేదు. ఆ తరువాత ప్రజా ఆందోళన వలన ఈమెను విడుదల చేశారు. 1932లో తీహార్ జైల్లో రాజకీయ ఖైదీగా ఉండగా అరుణ జైల్లో రాజకీయ ఖైదీల పట్ల చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా నిరాహారదీక్ష నిర్వహించింది. ఆమె ప్రయత్నం ఫలితంగా తీహార్ జైల్లో రాజకీయ ఖైదీల పరిస్థితి మెరుగైంది. కానీ ఆమెను అంబాలా జైలుకు తరలించి ఒంటరి ఖైదులో ఉంచారు. జైలునుండి విడుదలైన తర్వాత ఆమె రాజకీయాలలో పాల్గొనలేదు. ? ఆమె 1996, జూలై 29న 87వ ఏట తనువు చాలించారు. 1987లో ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం, 1996లో భారతరత్న (మరణానంతరం) ఆమెను వరించాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# చర్మరోగ నివారిణి 'నఖ రంజని'



గోళ్ళకు రంగును కలిగించే గోరింటాకు "నఖరంజని" అని పేరు. ఆషాడంలో గోరింటాకు పెట్టుకునే ఆచారం అనాదిగా ప్రబలంగా ఉంది. ఆయుర్వేద శాస్త్ర ప్రకారం గోరింట మంచి మూలిక. దాని ఆకులే కాదు... పూవులు, వేళ్ళు, బెరడు, విత్తనాలు, గింజలు, ఓషధ గుణాలు కలిగి ఉంటాయి. హన్నొటాన్నిక్ ఆసిడ్తో కూడి ఒకరకమైన చిరువిషం ఉంటుంది. గింజలో చమురుంటుంది. పూలతో అత్తరు, వాసన నూనె తయారు చేస్తారు. ఆకు నూరి ముద్దలో నిమ్మరసం కలిపి అరికాళ్ళకు పెట్టుకుంటే అరికాళ్ళ మంటలు, నొప్పులు తగ్గుతాయి. నూరిన ముద్దతో తెల్ల గుగ్గిలము కలిపి నుది టికి పట్టిస్తే తలనొప్పి తగ్గగలదు. ఈ మందును మశూచి బాధితుల పాదాలకు పట్టిస్తే, రోగుల కళ్ళలో అమ్మవారు పోయే దని చెపుతారు. ముద్దతో కీళ్ళనొప్పులు మటుమాయం అవుతాయి. ఆకుల నుండి తయారు చేసిన మలామా గాయాలను, కురుపులను మాన్పుతుంది. బెణుకులు, వాపులు, కషాయంతో కాపడం వల్ల తగ్గు తాయి. దీనిని పుక్కిట పెడితే నోటిలో పుండ్లు తగ్గుతాయి. గోరింట పువ్వులతో. నింపిన గుడ్డ సంచిని తలగడగా పెట్టుకుంటే మంచి నిద్ర కలిగిస్తుంది. గోరింటాకు ముద్దను గోళ్ళకు పెట్టుకోవడం వలన చక్కని రంగు కలిగిం చడమే కాక, వ్యాధుల బారి నుండి కాపాడుతుంది. గోరింటకు శరీరం లోని వేడిని తగ్గించే శక్తి ఉంది. గోరింట పొడిని మందుగా తీసుకోవడం, గోరింటతో కాచిన నూనెను వాడడం చిట్కా వైద్యంలో ఉన్నదే. కేవలం ఆషాఢం లోనే కాదు. శుభకార్యాల సందర్భాలలోనూ గోరింటాకు పెట్టుకోవాలని పెద్దలు సూచిస్తారు. గోరింటాకు ధారణ తెలుగు పడుచులలో విధివిధాయక కృత్యమైన్నది. అరికాళ్ళలో నూరిన ముద్ద చుక్క పెట్టుకుని, అది బాగా పట్టినట్లయితే అయిదవతన వృద్ధియని, బాగా పండితే భర్త ప్రేమ అధికమవుతుందని విశ్వాసం. ఆషాఢంలో మెట్టింటి నుండి పుట్టింటికి చేరుకునే కొత్త పెళ్ళి కూతుళ్ళు, పుట్టింట ఉన్న మనసు మెట్టినింటి ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ, గోరింటాకు పెట్టుకోవడం అనాదిగా ఆచరణలో ఉంది. జ్యేష్ట మాసంలో మొదలైన వర్షాలు ఆషాఢం వరకు ఊపందుకుంటాయి. అలా ఆడపడుచులు ఎక్కువగా వర్షాలలో తడవడం కద్దు. ఇక పొలం పనులు చేసుకునే వారు నిత్యం కాళ్ళు, చేతులు తడపకుండా ఉండలేరు. అలా చర్మ వ్యాధులు రావడం, గోళ్ళు దెబ్బ తినడం సహజం. అందుకే ఈ ఉపద్రవ నివారణకు గోరింటాకు కన్నెల నుండి వృద్ధుల వరకు ధారణ నిత్యకృత్యంగా మారింది. గోరింట ఆకును కాచు, చింత పండు, నిమ్మరసంతో మెత్తగా నూరి, మగపి ల్లలు, ఆడపిల్లలు, స్త్రీలు చేతి వేళ్ళకు, పారా ణిగా పాదాలకు పెట్టు కుంటారు. తద్వారా చర్మం, గోళ్ళు చిక్కని ఎర్రని రంగుతో శోభాయమానం అవుతాయి. కృత్రిమమైన రసాయనిక పదార్థాలతో తయారైన గోళ్ళరంగు కంటె గోరింటతో చేసుకున్న ముద్దతో పాత పద్ధతిని విడనాడకుండా ఉండాల్సిన అవస రాన్ని ప్రస్తుత తరుణంలో గుర్తెరగాలి. ఆషా ఢంలో గోరింటాకు పెట్టుకొమ్మన్నారని, ఎక్కడ పడితే అక్కడ దొరికే కోన్లమీద ఆధార పడడం మంచిది కాదు. అది శరీరానికి తాకినప్పుడు అందులో ఉండే లాసోన్ అనే సహజమైన రసాయనం వల్ల ఎరుపురంగు ఏర్పడుతుంది. కానీ చాలా రకాల కోన్లలో, కృత్రి మంగా ఎరుపు రంగును కలిగించే రసాయనాలు ఉపయోగించడం వల్ల ఎలర్జీ కలిగే అవకాశాలున్నాయి. కనుక సహజ సిద్దమైన గోరింటనే వాడడం మంచిది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



## మిల్లర్ల మాయ.. అక్రమాల తోవ

సుల్తానాబాద్ : సుల్తానాబాద్‌లోని ఓ బాయిల్డ్ మిల్లు రెండు సీజన్‌లకు సంబంధించి రూ.11 కోట్ల ధాన్యం బకాయి పడింది. కానీ గత యాసంగిలో రాజకీయ ఒత్తిళ్లతో సదరు మిల్లులకు వంద లారీల ధాన్యం ఇచ్చారనే ఆరోపణలున్నాయి. మంథనిలో ఒక మిల్లులో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు జరిగి రూ.5 కోట్ల విలువైన ధాన్యం లేదని గుర్తించారు. అయినా గత యాసంగిలో ధాన్యం కేటాయింపులు జరిగాయి. సకాలంలో లెవీ బియ్యం ఇవ్వడానికి తంటాలు పడే మిల్లర్లు పౌరసరఫరాలశాఖ ఇచ్చిన ధాన్యం నిల్వలను మాత్రం పక్కదారి పట్టిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లాలో పాత బకాయిలు పూర్తి చేయకుండానే ప్రతి సీజన్‌లో ధాన్యం కోటా దక్కించుకోవడంలో మిల్లర్లు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

**చర్యలు లేకపోవడంతో..**

ప్రతి సీజన్‌లో మిల్లులకు కేటాయించే ధాన్యం నిల్వలపై పౌరసరఫరాల అధికారుల నిఘా లేకపోవడం, లెవీ సేకరణలో తరచూ కాలయాపన జరుగుతుండటం, మిల్లులకే కేటాయించే ధాన్యం నిల్వ సామర్థ్యానికి మించిపోవడం వెరసి మిల్లర్లు ధాన్యం నిల్వలను బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవడం కొన్నేళ్లుగా సాగుతోంది.

**లోపభూయిష్టమైన విధానాలు**



జిల్లాలో ధాన్యం దిగుబడి, ఇతర జిల్లాల నుంచి ఏ మేరకు వచ్చే అవకాశం ఉంటుందనే అంశాలపై అవగాహన ఉన్నప్పటికీ వివిధ మిల్లుకు జరిగే ధాన్యం కేటాయింపులకు ఉద్దేశించిన ఆర్వో(రిలీజింగ్ ఆర్డర్) లోపభూయిష్టంగా తయారు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గడిచిన యాసంగిలో జిల్లాలో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనాలు వేయగా పౌరసరఫరాల అధికారులు మాత్రం 6.08 లక్షల మెట్రిక్ టన్నులకు ఆర్వో తయారు చేశారు. అధికారులు తయారు చేసిన ఆర్వోకి వాస్తవ ఉత్పత్తికి దాదాపు రెట్టింపు వ్యత్యాసం ఉంది. ఎవరికీ నూరు శాతం కోటా ఇవ్వలేదని చెప్పేందుకు ఈ ఆర్వో చక్కగా ఉపయోగపడుతుంది. నచ్చినవారికి 60 శాతం, నచ్చని వారికి 20 శాతం వరకు ఇచ్చినా ఇబ్బంది ఉండదనే భరోసాతో ఈ విధంగా ఆర్వోల తయారీ జరుగుతుందనే ప్రచారం ఉంది.

**నిరంతర తనిఖీలు** మిల్లులో జరుగుతున్న అక్రమాల నియంత్రణకు నిరంతరం తనిఖీలు చేసేందుకు ప్రయత్నిస్తాం. తేడాలున్న మిల్లర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.శ్రీనాథ్, డీఎస్‌వో

## పేరులో ప్రగతి.. అభివృద్ధి అధోగతి

గోదావరిఖని : నగరపాలిక 23వ డివిజన్‌లో ఆరు కాలనీలు ఉండగా ఒకటి రెండు మినహా మిగతా కాలనీల్లో రహదారులు, భూగర్భ, ఉపరితల మురుగు కాలువల సమస్య తీవ్రంగా ఉంది. 24వ డివిజన్‌లో రామగుండం ఎన్టీపీసీకి చెందిన పర్మినెంట్, టెంపరరీ టౌన్‌షిప్‌లు ఉన్నాయి. నిర్వహణ బాధ్యతలను ఎన్టీపీసీ యాజమాన్యం చేపట్టడంతో డివిజన్‌లో అంతగా సమస్యలు ఉండకపోగా 23వ డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నగరపాలక అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. డివిజన్‌లో అత్యంత పేదలు నివసించే ప్రగతినగర్ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులతో సుమారు 8 సంవత్సరాల కిందట దాదాపు రూ.కోటి వ్యయంతో వార్డుల్లో సీసీరహదారులు నిర్మించారు. భూగర్భ, ఉపరితల మురుగు కాలువలు నిర్మించకపోవడంతో సౌకర్యాలు దుర్గంధంతో సహవాసం చేయాల్సి వస్తోంది. డివిజన్ల పునర్విభజన అనంతరం ఏర్పడ్డ రామగుండం నగరపాలిక 23వ డివిజన్‌లో గౌతమినగర్, ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ, ప్రగతినగర్, మాతంగి కాలనీ, శాంతినగర్, కాజీపల్లి ఉండగా 24వ డివిజన్‌లో కేవలం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లు మాత్రమే ఉన్నాయి. ఎఫ్.సి.ఐ. ఉద్యోగుల గృహనిర్మాణ సహకార సంస్థ ఆధ్వర్యంలో గౌతమినగర్ కాలనీ, మాజీ సైనికుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ ఏర్పడ్డాయి. నగరపాలక ప్రాంతంలో గౌతమినగర్ లేఔట్ అనుమతి పొందిన మొట్టమొదటి కాలనీ. ప్రగతినగర్ కాలనీ దుర్గంధమయంగా ఉంది. కాలనీలో అంతర్గత రహదారుల నిర్మాణం చేసినప్పటికీ ఉపరితల, భూగర్భ మురుగు కాలువలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. వ్యర్థజలాలు రోడ్డుపైనుంచే ప్రవహించాల్సి రావడంతో కాలనీలో గొడవలు జరుగుతున్నాయి. కాలనీలో వ్యర్థజలాలన్నీ ఓ కూడలిలో నిలుస్తుండడంతో జలాశయంగా మారింది. తాగునీరు సన్నగా, కొద్దిసేపు మాత్రమే



వస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు.

శాంతినగర్‌లో రహదారులు, భూగర్భ, అంతర్గత మురుగు కాలువల సమస్య ఉంది. కాలనీ శివారు అత్యంత వేగవంతంగా విస్తరిస్తుండగా ఆయా ప్రాంతాల్లోకి వెళ్లేందుకు బురద రోడ్లతో ఇబ్బంది పడుతున్నారు. మూడేళ్ల కిందట వర్షాకాలంలో సమీపంలోని రామగుండం ఎరువుల కర్మాగారం బూడిద చెరువు కట్టతెగిపోవడంతో కాలనీ జలమయమైంది. తాగునీటి సదుపాయాన్ని మెరుగు పరచాల్సి ఉంది. హనుమాన్‌నగర్‌లోని ప్రధాన రహదారిలో భూగర్భ మురుగు కాలువ నిర్మించినా దానిపైన రోడ్డు వేయాల్సి ఉంది.ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో ఆక్రమణలు పెరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్రమవుతున్నాయి. గతంలో వేసిన రోడ్లు చెడిపోవడంతో కొత్తగా రహదారుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కాలనీలో పట్టణ క్రీడా మైదానా న్ని వినియోగంలోకి తెచ్చేలా నగరపాలిక చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## అంగన్వాడీ కేంద్రం.. ఆరోగ్య మంత్రం



వికారాబాద్ : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు శత శాతం ఆరోగ్య పరీక్షలు నిర్వహించి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. బాలల ఆరోగ్య పరీక్షల కోసం ప్రత్యేకంగా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమాన్ని(ఆర్‌బీఎస్‌కే) ప్రభుత్వం అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులు పోషకాహార లోపంతో ఇబ్బంది పడుతుంటారు. అంతర్గతంగా దాగి ఉన్న వ్యాధులను గుర్తించి ప్రాథమిక స్థాయిలోనే నివారిస్తారు. మానసిక వికాసం, భావోద్వేగాలు, శారీరక, సామాజిక ఎదుగుదల లోపం తదితర ఇబ్బందులుంటే గుర్తించి చికిత్స అందిస్తున్నారు.

**ఏప్రిల్ నుంచి జూన్ 30 వరకు..**

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ 30 వరకు పరీక్షలు చేశారు. మే నెలలో కేంద్రాలకు సెలవులున్నా కేంద్రాల్లో టీచర్లు, సహాయకులు ఉండి పరీక్షలకు సహకరించారు. కేంద్రంలో నమోదైన చిన్నారులందర్నీ తీసుకొచ్చి పరీక్షలు చేశారు. జిల్లాలో శతశాతం పూర్తి చేసినట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందించామని ప్రోగాం అధికారి డా.బుచ్చిబాబు తెలిపారు. వయసు ఆధారంగా ప్రభుత్వం పంపిన ప్రశ్నావళిని తల్లిదండ్రులు, పిల్లలతో మాట్లాడి నమోదు చేశారు. సమస్యలుంటే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేశారు.

**10 వాహనాలు.. పది వైద్య బృందాలు..**

ఆర్‌బీఎస్‌కే పథకం ద్వారా ఏటా రెండు సార్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. పుట్టుకతో అనారోగ్యంగా, ఎదుగుదల లోపమున్న వారిని గుర్తించి అవసరమైన మందులు ఇస్తున్నారు. జిల్లాలో వికారాబాద్, పరిగి, తాండూరు, మర్పల్లి, కొడంగల్ డివిజన్లు ఉన్నాయి. ప్రతి డివిజన్‌కు రెండు వాహనాల చొప్పున కేటాయించారు. ప్రతి బృందంలో ఇద్దరు వైద్యులు, ఏఎన్‌ఎం, ఫార్మసిస్టు ఉన్నారు. ఈ బృందం కేంద్రాలను సందర్శించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది.

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు: 1,129
చిన్నారులు: 58,876
శారీరక వైకల్యమున్న వారు: 140
కంటి వ్యాధులు: 37

**స్వచ్ఛంద సంస్థల సహకారంతో..**

జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు పూర్తయ్యాయి. కార్యక్రమంలో నిర్వాహకులు, ప్రోగాం అధికారులు, వైద్యులు బాగా శ్రమించారు. శారీరక లోపాలున్న 140 మంది చిన్నారులను గుర్తించాం. ఆకార్, ఆశా స్వచ్ఛంద సంస్థల ద్వారా శస్త్ర చికిత్సలు చేయించి చిన్నారుల్లోని లోపాలను సరిదిద్దుతాం. డా.లలితాదేవి, జిల్లా వైద్యాధికారిణి, వికారాబాద్.

## అడగలేవని.. అలుసా..!



కొండమల్లేపల్లి : ఆరు నెలలుగా పశు వైద్యశాలలకు ప్రభుత్వం నుంచి మందులు సరఫరా కాకపోవడంతో మూగజీవాల చికిత్సలకు పాడిరైతులు ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితిలో ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నెలల తరబడి మందుల సరఫరా నిలిచిపోవడం, వైద్యం సకాలంలో అందక పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకుని గతంలో మాదిరిగానే ప్రభుత్వం మందులు సరఫరా చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలోని 62 పశు వైద్యశాలల్లో మందుల కొరత తీవ్రంగా ఉందని పేరు చెప్పటానికి ఇష్టపడని ఓ పశువైద్యాధికారి తెలిపారు.

**ఏడాదిలో ఒక్కసారే మందుల సరఫరా..**

గతంలో పశు వైద్యశాలలకు ప్రతి మూడు నెలలకోసారి ఏడాదిలో నాలుగు సార్లు మందులు సరఫరా అయ్యేవి. కానీ ప్రభుత్వం గతేడాదిలో(ఏప్రిల్ 24 నుంచి మార్చి 25 వరకు) జిల్లాలోని అన్ని పశు వైద్యశాలలకు కేవలం ఒక్కసారి మాత్రమే సరఫరా చేయడంతో తీవ్ర కొరత నెలకొంది. దీంతో రైతులు అప్పులు చేసి ప్రైవేటుగా మందులు కొనుగోలు చేస్తున్నారు.

**20 రోజుల నుంచి తిరుగుతున్నా : వస్కుల ఆంజనేయులు, పెండ్లిపాకల**

నాకు 60 గొర్లున్నాయి. వాటికి మూతులు వాయడంతో బ్లూటంగ్(నీలి నాలుక మందు) టీకా వేయించడం కోసం 20 రోజుల నుంచి నాలుగైదుసార్లు వచ్చాను. కానీ ఆ టీకా అందుబాటులో లేకపోవడంతో ఖాళీగా తిరిగి వెళ్తున్నా. పశు వైద్యశాలలో మందులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

**కొరత ఉన్న మాట వాస్తవమే: డా.నాగయ్య, పశువైద్యాధికారి, కొండమల్లేపల్లి**

పశు వైద్యశాలలో మందుల కొరత ఉన్న మాట వాస్తవమే. మందుల కొరత ఉందని ఉన్నతాధికారులకు తెలిపాం. సాధ్యమైనంత వరకు పశువైద్యశాలకు వచ్చే మూగజీవాలకు సరైన వైద్య చికిత్సలు చేసి అందుబాటులో ఉన్న మందులను ఇస్తున్నాం. ప్రభుత్వం గతంలో మాదిరిగానే ప్రతి మూడు నెలలకోసారి సరఫరా చేస్తే బాగుంటుంది.

## రైతుల అవసరం.. వ్యాపారుల అక్రమం



గంగాధర: అసలే వర్షాలు లేక జిల్లాలో వరినాట్లు ఆలస్యం అవుతుండగా పుండుమీద కారం చల్లినట్లుగా కొందరు ప్రైవేటు వ్యాపారులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. వరి పంటకు చాలా మంది రైతులు డీఏపీ, యూరియా వినియోగిస్తున్నారు. మార్కెట్‌లో డీఏపీ బస్తా ధర రూ.1350 ఉండగా యూరియా రూ.266 ఉంది. కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తూ బస్తాకు రూ.50 నుంచి రూ.150 వరకు పెంచి, అక్రమంగా అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. జింక్ లేదా ఇతర అనవసర ఎరువులు కొనుగోలు చేయాలని లింక్ పెడుతున్నారని వాపోతున్నారు.

**జిల్లాలో పరిస్థితి ఇలా..**

ఈ ఏడాది వానాకాలం పంటకు జిల్లాలో 6945 మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరముండగా, అందుబాటులో ఉన్న 4718 మె.టల్లో ఇప్పటివరకు 3113 మె.ట విక్రయించారు. 1605 మె.ట నిల్వ ఉంది. మరో 2207 మె.ట రావాల్సి ఉండగా మార్క్‌ఫెడ్‌లో అందుబాటులో లేదు. నెలాఖరు నుంచి వరినాట్లు ముమ్మరం కానుండగా డీఏపీ వినియోగం పెరగనుంది. ఇతర కాంప్లెక్స్ ఎరువులు మాత్రం 29,415 మె.ట నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటి బస్తా ధర రూ.1750కు పైగా ఉండటంతో రైతులు డీఏపీ వైపు మొగ్గు చూపుతున్నారు. 42,354 మె.ట యూరియా అవసరమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలు పంపగా ఇప్పటివరకు 24,493 మె.ట మాత్రమే వచ్చింది. దీంట్లో 5,682 మె.ట విక్రయించారు. పంటకాలంలో రెండు, మూడు సార్లు యూరియా వినియోగించాల్సి వస్తుంది. ఇంకా జిల్లాకు 18 వేల మె.ట కావాల్సి ఉంది. లేదంటే రానున్న రెండు నెలల్లో యూరియా తిప్పలు తప్పవు.

**అధిక వసూలు చేస్తే చర్యలు**

డీఏపీ, యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలి. వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. నానో ఎరువుల వినియోగంతో పెట్టుబడి భారం, శ్రమ తప్పుతుంది. మార్క్‌ఫెడ్‌లో ప్రస్తుతం డీఏపీ నిల్వ లేదు. యూరియా నిల్వ మాత్రం ఉంది. కాంప్లెక్స్ ఎరువులు సరిపడా ఉన్నాయి. ఎరువులతో అవసరం లేకపోతే నిల్వ చేయొద్దు.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

## రాయితీ దూరం.. గ్యాస్ భారం

గోదావరిఖని : వంట గ్యాస్ వినియోగదారులకు మూడు నెలలుగా రాయితీ డబ్బులు జమ కావడం లేదు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి మహాలక్ష్మి పథకం కింద వంటగ్యాస్‌ను రూ.500కే సరఫరా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏప్రిల్ నుంచి రాయితీ డబ్బులు జమ చేయడం లేదు. దీంతో అర్హులైన గృహ వినియోగదారులు వంటగ్యాస్ కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11,18,982 గృహ వంట గ్యాస్ వినియోగదారులున్నారు. 2,62,675 వాణిజ్య పరంగా వినియోగించుకునే గ్యాస్ కనెక్షన్లున్నాయి.

**పేదలపై ఆర్థిక భారం**వంట గ్యాస్ వినియోగించే పేదలు పూర్తిస్థాయి ధర చెల్లించడంతో ఆర్థిక భారం పడుతోంది. తెల్లరేషన్ కార్డు దారులకు ప్రభుత్వం అందించే రాయితీతో సగం డబ్బులతోనే వంట గ్యాస్ ఇంటికి చేరే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఉజ్వల, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన దీపం పథకం కింద వంటగ్యాస్ పొందిన లబ్ధిదారులపై కూడా ఆర్థిక భారం పడుతోంది. పేదల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వంటగ్యాస్ వినియోగదారులకు రాయితీ డబ్బులు జమ చేయాల్సి ఉండగా వాటిని నిలిపివేయడంతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 7.5 లక్షల మంది రాయితీ పథకానికి అర్హులున్నారు.

**ఫిర్యాదులు రాలేదు**

రాయితీ డబ్బులు జమ కావడం లేదని ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఇంధన సంస్థల నుంచి సమాచారం తెలుసుకుంటాం. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు సక్రమంగా లేకపోతే సమస్యలు వస్తాయి. గ్యాస్ ఏజెన్సీల నుంచి ఏదైనా సమస్య ఉంటే రాయితీ డబ్బులు జమ కావు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి,పెద్దపల్లి

## పది లక్షల మొక్కల లక్ష్యం!

గొల్లపల్లి : పల్లెలు పచ్చదనాన్ని సంతరించుకునేందుకు ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఎప్పటిలాగే జిల్లాలో ఈ సంవత్సరం కూడా మొక్కల లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించారు. ఇందులో వివిధ శాఖలను భాగస్వామ్యం చేస్తూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

**88,798 పనిదినాల కల్పన**

జిల్లాలో ఈ ఏడాది 10,38,500 మొక్కలను నాటనున్నారు. ఈ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఒక్క డీఆర్డీవో ద్వారా కూలీలకు 88,798 పనిదినాలను కల్పించనున్నారు. మొక్కల సంరక్షణ కోసం మరో 299 మంది కూలీలకు చేతినిండా పని దొరుకుతుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న వన మహోత్సవం ద్వారా కూలీలకు ఉపాధి చూపడంతోపాటు గ్రామాలు పచ్చదనంతో కళకళలాడేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడనుంది.

**డీఆర్డీవో తరపున 6,77,400 మొక్కలు**

జిల్లాలో 98,052 జాబ్ కార్డులకు గాను 1,99,692 మంది కూలీలున్నారు. 35,422 మంది కుటుంబాల్లోని 47,305 మంది



కూలీలు పనికి హాజరవుతున్నారు. వన మహోత్సవంలో డీఆర్డీవో కీలకపాత్ర పోషిస్తోంది. ఈ సంవత్సరం 10 లక్షలకు పైగా మొక్కలు నాటే లక్ష్యంలో డీఆర్డీవో తరపున ఏకంగా 6,77,400 మొక్కలను నాటనున్నారు. నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేశారు. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాలు, అటవీ ప్రాంతాలు, ప్రభుత్వ సంస్థలు, కుల సంఘాల భవనాల పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాలు, ఇళ్ల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటనున్నారు. రోడ్లకు ఇరువైపులా బహునియా, గొల్మోహర్, సీమతంగేడు, వేప, రెయిన్‌ట్రీ, చైనాబాదం మొక్కలు.. అలాగే ప్రభుత్వ, అటవీ భూముల్లో కానుగ, అల్లనేరేడు, వెలగ, సీతాఫలం మొక్కలను ప్రధానంగా నాటుతారు. ప్రభుత్వ సంస్థల ఖాళీ ప్రాంతాల్లో గన్నేరు, గోరింట, మందార, మల్లె, జామ, టెకోమా, తంగేడు మొక్కలు, కుల సంఘ భవనాల పరిసరాల్లో ఈత మొక్కలు, ఇళ్ల ఆవరణలో గులాబీ, మల్లె, మందార, నిమ్మ, జామ, తంగేడు, గన్నేరు తదితర రకాల మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**నర్సరీల్లో మొక్కలు సిద్ధం**

కొమురయ్య, ఈజీఎస్ ఏపీవో, ఎల్లారెడ్డిపేట

ఈ సంవత్సరం వన మహోత్సవానికి నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఈ సంవత్సరం నిర్దేశిత లక్ష్యం మేరకు అన్ని గ్రామాల్లో గుంతలు తీసే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొక్కలు నాటే లక్ష్యాన్ని చేరుకుంటాం. ఈ వన మహోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై, విజయవంతం చేయాలి. కూలీలు కూడా క్రమం తప్పకుండా పనులకు హాజరై, ఉపాధి పొందే అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలి.

## అడుగు బయట పెట్టాలంటే దడ


మెట్‌పల్లి : వీధిలో శునకాల గుంపు కనిపిస్తే చాలు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాలినడకన వెళ్తున్న వారిపైనే కాకుండా సైకిళ్లు, ద్విచక్రవాహనాల వెంట పడి తరుముతున్నాయి. మెట్‌పల్లి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద పెరిగింది. పిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఒకే రోజు పట్టణంలో పది మందిని కుక్కలు కరిచాయి. స్థానిక సామాజిక ఆసుపత్రి, పట్టణ ఆరోగ్య కేంద్రం, జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం పదుల సంఖ్యలో బాధితులు వస్తుండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

**ఆసుపత్రులకు బాధితుల తాకిడి**

మెట్‌పల్లిలో కుక్క కాటు కేసుల నమోదు ఎక్కువగా ఉంది. మే నెలలో సీహెచ్‌సీలో 179 మంది, జగ్గాసాగర్ పీహెచ్‌సీలో ఏడుగురు, అర్బన్ పీహెచ్‌సీలో ముగ్గురు బాధితులు చికిత్స తీసుకున్నారు. జూన్‌లో సీహెచ్‌సీలో 155 మంది, జగ్గాసాగర్‌లో 18 మంది, అర్బన్ పీహెచ్‌సీలో ఒకరు వైద్యం పొందారు. జులైలో ఇప్పటివరకు సీహెచ్‌సీకి 70 కేసులు రాగా, జగ్గాసాగర్‌లో ఇద్దరు చికిత్స పొందారు. ఇందులో 39 మంది పిల్లలున్నారు.

**13 ప్రాంతాల్లో సమస్య తీవ్రం**

పట్టణంలోని 26 వార్డుల్లో కుక్కలు, శునకాలతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. బోయవాడ, దుబ్బవాడ, కూరగాయల మార్కెట్, చైతన్యనగర్, మఠంవాడ, శివాజీనగర్, దీనదయాళ్‌నగర్,



వెల్లుల్ల రోడ్డు, హన్‌మాన్‌నగర్, కళానగర్, ఆదర్శనగర్, సుల్తాన్‌పుర, సాయిరాంకాలనీ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రాత్రి వేళ వీధుల్లో గుంపులుగా తిరుగుతూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. మరోవైపు కోతులు ఇళ్లలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయి. వంట గదుల్లోని తినుబండారాలను, పప్పు దినుసుల డబ్బాలను ఎత్తుకెళ్లి బయట పడేస్తున్నాయి. మున్సిపాలిటీ, తహసీల్దార్, ఆర్డీవో, పోలీస్‌స్టేషన్ తదితర కార్యాలయాలకు వచ్చే ప్రజల ద్విచక్రవాహనాల కవర్లను చించి సామగ్రిని ఎత్తుకెళ్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**ఏబీసీ కేంద్రం ఏర్పాటు**

మెట్‌పల్లిలో ఎనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కేంద్రం ఏర్పాటు చేశాం. ఇప్పటికే ఓ ఏజెన్సీతో ఒప్పందం కుదిరింది. కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేశాం. పట్టణంలో శునకాల నియంత్రణపై దృష్టి సారించాం. మోహన్, మున్సిపల్ కమిషనర్

**అందుబాటులో టీకాలు**ఆసుపత్రిలో యాంటీ రేబిస్ టీకాతో పాటు ఇమ్యూనోగ్లోబిన్స్ అందుబాటులో ఉన్నాయి. కుక్కకాటు బాధితులకు వెంటనే చికిత్స అందిస్తున్నాం. కుక్క కరిచిన వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించుకోవాలిసాజిద్‌అహ్మద్, మెట్‌పల్లి సీహెచ్‌సీ పర్యవేక్షకుడు

# జలచరాల జీవం.. ప్రశ్నార్థకం

హైదరాబాద్ : చెరువులను వ్యర్థాలు పారబోసే కేంద్రాలుగా మార్చడంతో కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. మురుగునీటి పైప్‌లైన్లు నేరుగా అనుసంధానించడం, రసాయన వ్యర్థాలు వేయడంతో నీటిలో కరిగిన ఆక్సిజన్(డిజాల్వ్‌డ్ ఆక్సిజన్-డీవో) పరిమాణం తగ్గుతోంది. గ్రేటర్ పరిధిలో 185 చెరువులు ఉండగా.. సుమారు 40 తటాకాల్లో ఆశించిన స్థాయిలో డీవో లేదని కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) తాజా నివేదిక వెల్లడించింది. లీటర్ నీటిలో డీవో 4 మి.గ్రా కంటే ఎక్కువ ఉండాలి. అనేక చెరువుల్లో 0.3 మి.గ్రా ఉందని పేర్కొంది. కూకట్‌పల్లిలోని చెరువుల్లో గుర్రపుడెక్క పెరిగింది. శేరిలింగంపల్లి పరిధిలోని కాలనీలు, బస్తీలు, వాణిజ్య సముదాయాల నుంచి వ్యర్థజలాలు తటాకాల్లో కలుస్తున్నాయి. ఇటీవల మేడ్చల్‌లోని సుతారిగూడలోని ఓ చెరువులో రసాయన వ్యర్థాలు పారబోస్తుండగా



ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. దుర్గం చెరువు వద్ద సేకరించిన శాంపిళ్లలో డ్రగ్స్ ఇతర అవశేషాలు ఉన్నాయని గతంలో ఓ నివేదిక స్పష్టం చేసింది. దీంతో తరచూ చేపలు చనిపోతున్న ఘటనలు పునరావృతం అవుతున్నాయి. చెరువులు కబ్జాలకు గురవ్వడం, ఎఫ్‌టీఎల్ పరిధిలో గృహ, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాల నిర్మాణంతో మురుగు పొంగుతోంది. గ్రేటర్ వ్యాప్తంగా వెలువడుతున్న 1600 మిలియన్ లీటర్ల వ్యర్థజలాల్లో సగం మాత్రమే శుద్ధి చేసి వదులుతున్నారు.

**డీవో తగ్గితే ఇబ్బందులివే..**

చెరువుల్లో జీవించే జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఆక్సిజన్ పరిమాణం తగ్గడంతో నీటి నాణ్యత తగ్గుతుంది. దుర్వాసన, రంగు మార్పు వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. అనిరోబిక్ బ్యాక్టీరియా పెరిగి హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి విషవాయువులు విడుదలవుతాయి. ఇవి పర్యావరణానికి హానికరం. స్థానిక పక్షులు, ఇతర జీవులు కూడా ప్రభావితం అవుతాయి.

**తీసుకోవాల్సిన చర్యలివీ..** జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు చెరువుల ప్రక్షాళన, పరిరక్షణ చర్యలు తీసుకోవాలని సేవ్ అర్బన్ లేక్స్ సంస్థ పలు సూచన లు చేసింది. చెరువుల్లోని ఘన, ప్లాస్టిక్, గుర్రపు డెక్క తొలగించాలి. ఆక్సిజన్ మోతాదు పెంచేందుకు ఏరియేషన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. మురుగు చేరకుండా దారి మళ్లించాలి. పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలి.

# నాలా ఆక్రమణలు నేలమట్టం

హైదరాబాద్ : నగరంలో వరదనీటి నాలాల ఆక్రమణల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ప్రజల నుంచి అందుతోన్న ఫిర్యాదులపై హైడ్రా వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఫిర్యాదు అందిన రెండు వారాల్లోనే విచారణ పూర్తి చేసి ఆక్రమణలను కూల్చేస్తోంది. శుక్రవారం కూకట్‌పల్లి, ఖైరతాబాద్ పరిసరాల్లోని నాలాల ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు.

బుల్కాపూర్‌లో తొలగింపు: తుమ్మలబస్తీ పరిసరాల్లో బుల్కాపూర్ నాలా ఆక్రమణలను హైడ్రా నేలమట్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి ఈ నాలా మొదలవుతుంది. నార్సింగి వద్ద హైదరాబాద్‌లోకి ప్రవేశించి షేక్‌పేట, ఫిల్మ్‌నగర్, మెహిదీపట్నం, చింతలబస్తీ, తుమ్మలబస్తీ మీదుగా ప్రవహిస్తూ హుస్సేన్‌సాగర్‌లో కలుస్తుంది. తుమ్మలబస్తీ - ఆనందనగర్ మధ్య 8 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా.. 5 మీటర్లకే పరిమితమైంది. స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో నాలాలో కట్టిన శ్రీధర్ ఫంక్షన్‌హాల్ ప్రహరీని తొలగించారు.

**ఐడీఎల్‌లో కూడా.. :** కూకట్‌పల్లి రంగధాముని (ఐడీఎల్) చెరువు అలుగు నుంచి ట్రావెల్స్ రోడ్డు, హబీబ్‌నగర్ మీదుగా మూసాపేట వరకు 2 కి.మీ పొడవునా ఉండే నాలా 4 నుంచి 6 అడుగులకు కుంచించుకుపోయింది. రెండు ఫంక్షన్‌హాళ్ల ప్రహరీలను 200 అడుగుల పొడవునా కూల్చివేశారు.

# అభ్యసనంలో ఫర్వాలేదు

కరీంనగర్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు ప్రభుత్వం, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఫలిస్తోంది. అభ్యసన సామర్థ్యాల విషయంలో ప్రగతి బాటలో పయనిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు తేటతెల్లమయ్యాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి సగటుతో పోలిస్తే ఉమ్మడి జిల్లాలోని సర్కారు బడుల విద్యార్థులు ఫర్వాలేదు అనిపించుకుంటున్నారు.

**విడుదలైన సర్వే ఫలితాలు**గతేడాది డిసెంబరులో జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 సర్వే పరీక్షను నిర్వహించింది. మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు మొత్తం 9 పరీక్షలు నిర్వహించారు. 3వ తరగతిలో తెలుగు, గణితం, 6వ తరగతిలో తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతిలో తెలుగు, గణితం, విజ్ఞాన, సాంఘిక శాస్త్రాల్లో పరీక్షలు నిర్వహించారు. వీటి ఫలితాలను ఇటీవల ఎన్‌సీఈఆర్టీ వారు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల అభ్యసన సామర్థ్యాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. మూడో తరగతిలో గ్రామీణ ప్రాంత బడుల విద్యార్థులు ముందంజలో నిలవగా 6, 9వ తరగతుల్లో పట్టణ ప్రాంతాల విద్యార్థులు ముందు వరుసలో నిలిచారు.

**ఇంకా మెరుగవ్వాలంటే..**

వినూత్న బోధన వ్యూహాలతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలి.

ఆహ్లాదకర వాతావరణం, మెరుగైన పనితీరుకు పాఠశాలల్లో సమాజ భాగస్వామ్యం అవసరం.

విద్యార్థులు డిజిటల్ భవిష్యత్తుకు సిద్ధమయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత వినియోగించాలి.

వినూత్న బోధనలు చేయడానికి నిరంతరం ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా మెరుగుపర్చుకోవాలి.

# ఫైకస్‌జాతి మొక్కలపై ఫోకస్



హైదరాబాద్: భారీ విస్తీర్ణంలో ఉద్యానవనాల అభివృద్ధికి బల్దియా ప్రణాళిక సిద్ధం చేసింది. జూబ్లీహిల్స్ పరిధిలో సుమారు 50 ఎకరాల ఖాళీ స్థలాలను ఎంపిక చేసింది. వాటిని కమిషనర్ ఆర్వీ.కర్ణన్ తనిఖీ చేశారు. పనులు చేపట్టాలని జడ్సీ అనురాగ్ జయంత్‌ను ఆదేశించారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 51లో దుర్గంచెరువు ఒడ్డున ఉన్న గుట్టపై సుమారు 20-25 ఎకరాలు, జూబ్లీహిల్స్ రోడ్డు 45 నుంచి రోడ్డు 26 వరకు హైటెన్షన్ లైన్ల కింద సుమారు 25 ఎకరాల ఖాళీ స్థలాలు ఉన్నాయి. భారీ బండరాళ్లు, కొండలు, గుట్టలు, లోయలతో ఉన్న భూములవి. అందువల్ల.. రాళ్లపైనా పెరిగే ఫైకస్ జాతి మొక్కలతో పార్కులను అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. రోడ్డు 51లోని ఖాళీ స్థలంలో గతంలోనే ఫైకస్ గార్డెన్ పేరుతో కొన్ని మర్రి మొక్కలను నాటారు. కొన్నేళ్లుగా పార్కు నిర్వహణ గాడి తప్పింది. ప్రహరీ కూడా లేదు. ఖరీదైన భూమిని నిర్లక్ష్యంగా వదిలేయడంతో పార్కు ఆక్రమణకు గురవుతోందనే ఫిర్యాదులూ ఉన్నాయి. దీంతో రూ.8 కోట్లతో పనులు చేపట్టేందుకు జడ్సీ చర్యలు ప్రారంభించారు. బండరాళ్లపై కుర్చీలు, గొడుగుల్లాంటి నిర్మాణాలు, కాలిబాటలతోపాటు ఖాళీ స్థలాల్లో మర్రి, మేడి, రావి, జువ్వి వంటి పలురకాల మొక్కలను నాటనున్నారు. సాహస క్రీడలకు స్థానం కల్పించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రణాళికనూ పరిశీలిస్తున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు 45 నుంచి రోడ్డు 36 వరకు మరో 30 ఎకరాల ఖాళీ స్థలాలున్నాయని, వాటిలోనూ ఇదే మాదిరి పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తామంటున్నారు. ఖాళీ స్థలాలను బ్లాకులుగా విడదీసి ఆకర్షణీయ పార్కులుగా అభివృద్ధి చేయబోతున్నామని కమిషనర్ ఆర్వీ.కర్ణన్ తెలిపారు. వీటితోపాటు జోన్‌కు 5 చొప్పున పార్కుల కోసం స్థలాలను గుర్తిస్తున్నామన్నారు. నగరంలోని పార్కులు.. 1,049

వాటి విస్తీర్ణం.. 640.35 ఎకరాలు

# అమ్మో.. ఈ దోమ ఎంత చెడ్డదో!



హైదరాబాద్: వానలతో నగరంలో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు 315 వరకు కేసులు నమోదైనట్లు జిల్లా ఆరోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. డెంగీని వ్యాప్తి జేసే ఈడీస్ ఈజిప్టై ఆడ దోమ అత్యంత ప్రమాదకరమైనదని నిపుణులు చెబుతున్నారు. ఆ దోమ తన జీవన కాలంలో 3 సార్లు గుడ్లు పెడుతుంది. ఒకసారికి 500-600 గుడ్లు పెట్టే సామర్థ్యం దీని సొంతం. పైగా ఈ గుడ్లు అత్యంత కఠినవాతావరణ పరిస్థితులను తట్టుకొని ఉంటాయి. తేమ లేకపోయినా కొన్నిరోజుల వరకు ఇవి మనగలవు. తర్వాత 5-6 మిల్లీలీటర్ల నీళ్లు ఉన్నా చాలు.. మళ్లీ ప్రాణం పోసుకుంటాయి. ముఖ్యంగా డెంగీ వైరస్ ఉన్న దోమ తను పెట్టే గుడ్ల లోపలకు కూడా ఆ వైరస్‌ను పంపించగలదు. దీనినే ట్రాన్స్ ఓవేరిన్ పాసేజ్‌గా వ్యవహరిస్తారు. ఫలితంగా గుడ్డు నుంచి లార్వా, ప్యూపాల నుంచి దోమగా మారిన వెంటనే వైరస్‌ను మోసుకెళుతుంది. ఒకేసారి 7-8 వేర్వేరు వ్యక్తులను కుట్టి రక్తాన్ని పీల్చుకుంటుంది. ఒక ఇంట్లో డెంగీ సోకిన వ్యక్తి ఉంటే అతనికి కుట్టిన తర్వాత ఆ వైరస్‌ను ఇతరులను కుట్టడం ద్వారా వారిలోకి ప్రవేశపెడుతుంది. అందుకే ఇంట్లో ఒకరికి డెంగీ సోకితే మిగతా వారికి వచ్చే ప్రమాదం ఉంటుంది.

**అప్రమత్తతతోనే నియంత్రణ..**

డెంగీ వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడంకంటే ముందే అప్రమత్తంగా ఉండటం వల్ల దోమ కాటు నుంచి తప్పించుకోవచ్చునని హైదరాబాద్ జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. ముఖ్యంగా ఇంట్లో పూలకుండీలు, పెయింట్ డబ్బాలు, కొబ్బరి చిప్పలు, నీళ్ల డ్రమ్ములు ఎప్పటికప్పుడు ఖాళీ చేసుకొని నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలి. వారానికి ఒకసారి వీటిని పూర్తిగా ఎండబెట్టుకోవాలి. ఇంట్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తీసివేయాలి. ముఖ్యంగా పాత గొడుగులు, బ్యాగులు, దుస్తులులాంటివి తీసి వేయాలి. ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటా సర్వే చేసి..డైఫ్లూబెంజురాన్ పిచికారీ చేస్తున్నట్లు డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. ప్రజలు కూడా ఎవరికి వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగీ లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు.

**లక్షణాలు ఇవే..** తీవ్రమైన జ్వరం భరించలేని తలనొప్పి చర్మంపై దద్దుర్లు కళ్ల కింద నొప్పి కీళ్లు, ఒళ్లు నొప్పులు చిగుళ్ల నుంచి రక్తస్రావం

# ఉద్యాన పంటలకు ఊతం



వికారాబాద్ :ప్రభుత్వం ఉద్యాన పంటలకు రాయితీ ప్రకటించి ప్రోత్సహిస్తోంది. దీంతో జిల్లాలోని అన్నదాతలు వాటి సాగుకు సిద్ధమవుతున్నారు. అధికారులు సైతం రాయితీ వివరాలను వివరించి అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యాన పంటలపై దృష్టి సారించేలా కృషి చేస్తున్నారు. **ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం 3వేల ఎకరాలు..:** జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అధికారులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయ పంటల కంటే దీన్ని సాగు చేస్తే అధిక లాభాలు ఆర్జించొచ్చని అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వమూ ప్రోత్సహిస్తుండడంతో జిల్లా రైతులు ముందుకొస్తున్నారు. ఈసారి ఆయిల్‌పామ్ 3వేల ఎకరాల్లో సాగు చేయాలన్న లక్ష్యాన్ని నిర్ణయించారు. దాన్ని సాధించడానికి అధికారులు కృషి చేస్తున్నారు. 2,700 ఎకరాల్లో సాగు చేసేలా రైతులను ఒప్పించారు. కొందరు ఈ పాటికే సాగు చేస్తున్నారు. మరికొందరు కొత్తగా నాటుతున్నారు.

**బిందుసేద్యం పరికరాల పంపిణీ..:** ఆయిల్‌పామ్ పండించే రైతులకు ప్రభుత్వం రాయితీపై బిందుసేద్యం పరికరాలు అందిస్తోంది. దీంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో అంతర్గత పంటలకు నీరు అందించొచ్చు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం.. జనరల్, బీసీలకు 90 శాతం రాయితీపై పరికరాలు అందిస్తున్నారు. తోటలో సస్యరక్షణ కోసం రూ.2100, అంతర్గత పంటల సాగుకు మరో రూ.2100 ప్రభుత్వం నగదు ఇస్తోంది.

**పసుపు, ఉల్లి పంటలకు..**

పసుపు విషయంలో నూతన పద్ధతులు అవలంబిస్తున్నారు. సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా రైజ్డ్‌బెడ్ విధానంలో పసుపు సాగు చేస్తున్నారు. బిందుసేద్యం విధానంలో తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించనున్నారు. రైతుకు ప్రోత్సాహకంగా ఎకరాకు రూ.16వేల రాయితీని ఇస్తున్నారు. ఉద్యానవన మిషన్ పథకం కింద ఉల్లి సాగుచేసే రైతులకు ఎకరాకు రూ.8వేలు అందిస్తున్నారు. రాయితీ పొందాలనుకునే అన్నదాతలు వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద వివరాలు నమోదు చేయించాలి.

**6వేల హెక్టార్లలో పండ్ల తోటలు..**

ఉద్యాన పంటలను ప్రోత్సహించడానికి రైతులకు రాయితీ ఇస్తున్నాం. జిల్లాలో 6వేల హెక్టార్లలో పండ్ల తోటలున్నాయి. ఆయిల్‌పామ్, పండ్ల తోటలతో దీర్ఘకాలిక ప్రయోజనాలున్నాయి. సూచనలు, సలహాలను దగ్గర్లోని మండల ఉద్యాన అధికారిని అడిగి తెలుసుకోవచ్చు. మహ్మద్ అబ్దుల్ సత్తార్, జిల్లా ఉద్యానాధికారి

# చదువులో తడ‘బడి’

రాజపేట : రాష్ట్ర జాతీయ స్థాయి సగటుతో పోల్చితే యాదాద్రి భువనగిరి జిల్లాలో చదువులు మరింత మెరుగు పడాల్సిన అవసరం ఉందనే విషయం తెలుస్తోంది. తరగతికి తగిన అభ్యసన సామర్థ్యాలు సాధించడంలో విద్యార్థులు కొంతమేర వెనకపడ్డారు. మూడు, ఆరు, తొమ్మిది తరగతుల్లో మొత్తం తొమ్మిది సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించగా.. అన్నింటిలో జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయ సగటుకంటే తక్కువ మార్కులు సాధించడం కొంతమేర ఆందోళన కలిగిస్తోంది. దేశంలో ఆరో తరగతికి సంబంధించి వెనుకబడిన 50 జిల్లాల్లో యాదాద్రి భువనగిరి జిల్లా కూడా ఉండటం గమనార్హం. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఆర్‌టీ) ఇటీవల వెల్లడించిన ‘పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 నివేదిక.. జిల్లాలోని విద్యార్థుల పరిస్థితిని తేటతెల్లం చేస్తోంది.

**సర్వేలో కొన్ని అంశాలు ఇవీ..** జిల్లాలో 3, 6, 9 తరగతుల బాలురతో పోల్చితే బాలికల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గా ఉన్నట్లుగా సర్వే గుర్తించింది. తొమ్మిదో తరగతి గణితంలో మాత్రం బాలికలతో పోల్చితే బాలురు కొంత ముందంజలో ఉన్నారు.

3, 6 తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణాల్లో మెరుగ్గా ఉన్నాయి. తొమ్మిదో తరగతిలో మాతృభాష, గణితం, సైన్స్, సాంఘికశాస్త్రాల విషయంలో పట్టణాలతో పోల్చితే గ్రామీణ విద్యార్థులు మెరుగైన సామర్థ్యాలు కలిగి ఉండటం కనిపించింది.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు బడులతో పోల్చితే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ బడులు మూడో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధిస్తుండగా.. 6, 9 తరగతుల విషయంలో కొంతవరకు తగ్గడం గమనార్హం.

సామాజికవర్గాల వారీగా చూస్తే మూడు, ఆరు, తొమ్మిదో తరగతి ఎస్సీ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తక్కువగా ఉన్నాయి. ఓబీసీ విద్యార్థులు అభ్యసన సామర్థ్యాల్లో కొద్దిగ మెరుగ్గా ఉన్నారు.

**జిల్లాలో సర్వే చేపట్టిన వివరాలు..** పాఠశాలల సంఖ్య : 85 ఉపాధ్యాయులు : 310 విద్యార్థులు : 2240

# సిరుల పరవళ్లు

సూర్యాపేట : ప్రతి నీటిచుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఉమ్మడి పీఏపల్లి మండలంలో నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితుల్లోనూ నీటి పరవళ్లు అన్నదాతల మోముల్లో చిరునవ్వులు చిందిస్తున్నాయి. ప్రస్తుత గుడిపల్లి మండలం పోల్కంపల్లి దిగువన రెండేళ్ల క్రితం గుడిపల్లి వాగుపై రూ.1.85 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం పూర్తిస్థాయిలో నీటితో మినీ జలాశయాన్ని తలపిస్తూ రైతులకు సిరులు కురిపిస్తోంది. 75 మీటర్ల వెడల్పు, 2.85 మీటర్ల ఎత్తున నిర్మించిన డ్యాంలో నిత్యం పెద్దమొత్తంలో నీరు నిల్వ ఉంటూ సద్వినియోగపడుతోంది. పక్కన ఏఎమ్మార్పీ కాల్వల నీరందని భూముల్లో సైతం రైతులు ఈ నీటితో సమృద్ధిగా రెండు పంటలు పండించుకుంటున్నారు.

పోల్కంపల్లి, ఘనపురంలోని బోర్లు, బావుల్లో భూగర్భజలాలు పెద్దమొత్తంలో పెరిగి వందల ఎకరాల బీడు భూములు సాగులోకి వచ్చి సస్యశ్యామలమవుతున్నాయి. ప్రస్తుతం సరైన వర్షాలు లేనప్పటికీ ఈ చెక్‌డ్యాం పూర్తిస్థాయిలో నీటి పరవళ్లతో కళకళలాడుతోంది. ఈ నీటిలో మోటార్లు ఏర్పాటు చేసుకుని పరిసర ప్రాంత రైతులు నార్లు




పోసుకుని ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. మండు వేసవిలోనూ బోర్లు, బావుల్లో నీటి మట్టాలు పడిపోలేదు. సమీపంలోని ఏఎమ్మార్పీ ప్రాజెక్టు కాల్వలకు నీరు విడుదల చేయని సందర్భాల్లో ప్రత్యామ్నాయంగా రైతులు ఈ నీటిని వినియోగించుకుంటున్నారు. డ్యాంలోని నీరు వందల ఎకరాల బీడు భూములను సస్యశ్యామలం చేయడంతోపాటు భూగర్భజలాలు పెంపొందిస్తూ, పశువులు, గేదెలు మూగజీవాల దాహార్తిని తీర్చుతుండడంతో స్థానిక రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

బీడు భూములు సాగవుతున్నాయి: దోసపాటి మారయ్య, రైతు, పోల్కంపల్లిరెండేళ్ల క్రితం మా పొలాల వద్ద గుడిపల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం బాగా ఉపయోగపడుతోంది. డ్యాంలో నిత్యం నీరు నిల్వ ఉండడంతో బోర్లలో సమృద్ధిగా భూగర్భజలాలు పెరిగి బీడు భూములు సాగవుతున్నాయి. ఏఎమ్మార్పీ కాల్వలు రానప్పుడు ఈ నీటిని ఉపయోగించుకుంటున్నాం.

# సద్దుల చెరువు.. శుభ్రత కరవు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణ వాసులకు ఆహ్లాదం పంచాల్సిన సద్దుల చెరువు.. నీరు కలుషితమై దుర్వాసన వస్తుండగా, పరిసరాలు అధ్వానంగా తయారై సందర్శకులను బెంబేలెత్తిస్తోంది.. నీటిలో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. అవి అపరిశుభ్రంగా ఉండటంతో నడకదారులు, పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలు పేరుకుపోయినా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. కట్టపైకి ఉదయం, సాయంత్రం నడకదారులు వందల సంఖ్యలో వస్తుంటారు. సాయంత్రం పూట గాలికి దుర్వాసన రావడంతో పరిసర నివాసులు ఇళ్లలో ఉండలేని దుస్థితి నెలకొంది. నీటిలో పిచ్చిమొక్కల కారణంగా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గతేడాది వినాయక నిమజ్జనం రోజున విగ్రహాలను చెరువులోనే వేశారు. ప్రతిమలకు ఏర్పాటు చేసే కుర్చీలు, కర్రలు నీటిలోనే దర్శనమిస్తున్నాయి. మళ్లీ పండుగ వచ్చే వరకు అలాగే ఉండటంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సద్దుల చెరువు కట్టపై పెరిగిన గడ్డిని ఇటీవల పుర అధికారులు సిబ్బందితో తొలగించారు. వాటిని పక్కనే కుప్పగా వేశారు. ప్రస్తుతం ఎండిపోయి



గాలికి అపరిశుభ్రంగా మారుతోంది. వానాకాలం కావడంతో వర్షానికి తడిచి నానిపోతోంది. వీటితోడు దుర్వాసన వస్తోంది. రాత్రి 10 గంటల వరకు పట్టణ ప్రజలు నడకకు వస్తుంటారు. వాటిలో విషసర్పాలు చేరే అవకాశం ఉంది. ఎక్కడి నుంచి వచ్చి కాటేస్తాయోనని వారు భయాందోళన చెందుతున్నారు. వీటికితోడు గణేశ్‌నగర్ కాలనీపై వైపు దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు విషసర్పాలకు నెలవుగా మారింది. చెత్తకుప్పల్లోకి చేరే అవకాశం ఎక్కువగా ఉండటంతో పుర అధికారులు వెంటనే తొలగించాలి. **వెంటనే శుభ్రం చేయిస్తాం:** సీహెచ్ హనుమంతరెడ్డి, పుర కమిషనర్ సద్దులచెరువులో పిచ్చిమొక్కలను వెంటనే సిబ్బందితో తొలగించి శుభ్రం చేయిస్తాం. దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటాం. కట్టపై చెత్త కుప్పలు తొలగించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

# అమ్మకు కోత.. కాసుల మోత

భువనగిరి : సాధారణ ప్రసవాలకు ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఉన్నా.. ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ కాన్పులే ఎక్కువగా అవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య స్వల్పంగా పెరిగినా ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రం పెద్దగా మార్పులేదు. ప్రసవం కోసం వెళ్లే ప్రతి పదిమంది గర్భిణుల్లో ఎనిమిది మందికి సిజేరియన్లు(సి-సెక్షన్) చేస్తున్నారు. జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలో కాన్పులు పరిశీలిస్తే 87 శాతం శస్త్ర చికిత్స ప్రసవాలే ఉంటున్నాయి. కొందరు వైద్యులు కాన్పు అంటేనే ఆపరేషన్ అనే స్థాయికి తీసుకొచ్చారు. మొదటిసారి కాన్పు అయ్యేవారి రికార్డులను వైద్యాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. వైద్యాధికారుల తనిఖీలు, లేకపోవడంతో అడ్డూ అదుపులేకుండా పోయింది. జిల్లా వైద్యాఆరోగ్య శాఖ పరిధిలో ఉండే పరిశీలన బృందం ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ కాన్పులపై ప్రత్యేకంగా సమీక్షించాల్సి ఉంటుంది. సిజేరియన్ చేయాల్సిన ఆరోగ్య పరిస్థితి పూర్తిస్థాయి నివేదిక సంబంధిత ఆసుపత్రుల నుంచి తీసుకొని అనవసరంగా శస్త్రచికిత్స చేసినట్లు భావిస్తే సంజాయిషీ కోరి తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. జిల్లా సాధారణ ఆసుపత్రి, మూడు ప్రాంతీయ దవాఖానాల్లో సాధారణ ప్రసవాలతో పాటు, సిజేరియన్లు నిర్వహిస్తున్నారు. అన్ని పీహెచ్‌సీలలో సహజ ప్రసవాలు చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులతో పోల్చితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది.

తగ్గించేందుకు చర్యలు: డాక్టర్ యశోద, మాతాశిశు సంరక్షణ జిల్లా అధికారిణి

సిజేరియన్ కాన్పుల వివరాలు, రికార్డులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. అత్యవసరమైన సమయంలోనే సిజేరియన్లు చేయాలని సూచిస్తున్నాం. కాన్పులు అయిన వారి స్కానింగ్ రిపోర్టులు, గర్భిణి ఆర్యోగ పరిస్థితుల ఆధారంగా అవసరం లేకున్నా సిజేరియన్ చేసినట్లు తెలితే చర్యలు తీసుకుంటున్నాం.

# పల్లె ప్రకృతి వనం.. పట్టించుకుంటే ఆహ్లాదం

తాండూరు : జిల్లాలో పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలు వర్షాలకు జీవం పోసుకుంటున్నాయి. వనాల్లోని నేలలు తేమగా మారుతున్నాయి. వేసవిలో మోడువారిన వృక్షాలు, మొక్కలు ప్రస్తుతం పచ్చని పత్రాలు, కొమ్మలతో కళకళలాడుతున్నాయి. గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి వాటిల్లో సేదతీరేందుకు అనువుగా మారుతున్నాయి. గత భారాస ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు ఆయా పంచాయతీల పరిధిలో వినియోగంలో లేని ప్రభుత్వ స్థలాలను కేటాయించింది. ఆ స్థలాల్లో అధికారులు వేలల్లో మొక్కలు నాటారు.

**ఏడాదిన్నరగా నిర్వహణ కరవు..**

పల్లెల్లోని ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతలను అప్పట్లో గ్రామీణ ఉపాధిహామీ పథకం అధికారులు చూసుకున్నారు. దీనికిగాను ఒక్కో కూలీని ప్రత్యేకంగా నియమించారు. రోజువారీగా మొక్కలకు నీరు పట్టడం, పాదులు సరిచేయడం వంటి పనులు చేయించారు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. అయిదేళ్లపాటు నిర్వహణ సవ్యంగా




సాగడంతో గ్రామాల సమీపంలోని వనాలు పచ్చని లోగిళ్లుగా తయారయ్యాయి.ఏడాదిన్నరగా నిధుల మంజూరు నిలిచిపోవడంతో నిర్వహణ కరవైంది. పంచాయతీలే చూసుకోవాల్సి ఉండగా.. పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఎండాకాలంలో వనాల్లోని మొక్కలు మోడువారాయి. కొన్ని ఎండిపోయాయి. ప్రస్తుత వర్షాలకు మళ్లీ జీవం పోసుకున్నాయి. వర్షాకాలం తరవాత వనాలు పచ్చగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు. ఇందు కోసం పభుత్వం పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలంటున్నారు.

జిల్లాలో పంచాయతీలు: 566

ఒక్కో వనంలో నాటిన మొక్కలు: 100- 200

# ఏ డిగ్రీ చేస్తే.. ఎలాంటి ఉద్యోగావకాశాలు!

సంగారెడ్డి : ఇంటర్ తర్వాత బీటెక్, ఎంబీబీఎస్‌ల వైపు వెళ్లని వారికి డిగ్రీ చక్కటి ప్రత్యామ్నాయం. గతంతో పోలిస్తే.. విద్యార్థుల కోసం ప్రభుత్వం డిగ్రీలోనూ ఎన్నో కొత్త కోర్సులు తీసుకొచ్చింది. వాటిల్లో బీకాం ఇన్సూరెన్స్, బీబీఏ రిటైలింగ్, బీకాం హెచ్‌ఆర్, బీఎస్సీ (మత్స్య శాస్త్రం), బీఎస్సీ (డేటాసైన్స్) తదితరాలున్నాయి. కంపెనీల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వమే విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తూ.. ఉద్యోగావకాశాలు లభించేలా చేస్తోంది. స్వయం ఉపాధి అవకాశాలు



ఉండనే ఉన్నాయి. ఇప్పటికే ఉన్న పాత కోర్సులు చేస్తే ఎలాంటి ఉద్యోగావకాశాలు ఉంటాయి. కొత్త కోర్సుల చేస్తే ఎలాంటి అవకాశాలుంటాయి.. తదితర సందేహాల నివృత్తి కోసం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. సంగారెడ్డిలోని ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్, దోస్త్ కన్వీనర్ జగదీశ్వర్, అసిస్టెంట్ ప్రొఫెసర్(కామర్స్) కరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్(స్టాటిస్టికల్) నిర్మల ఫోన్లకు అందుబాటులో ఉంటారు. దిగువ పేర్కొన్న చరవాణుల నంబర్లకు కాల్ చేసి వారితో నేరుగా మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సూచన. ఫోన్‌ఇన్ నిర్వహించే తేదీ: ఈనెల 17న (మంగళవారం) కాల్ చేయాల్సిన సమయం: 11.30 నుంచి 12.30 వరకుసంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 80085 73233, 80085 73235

# పేదింటి కథ మారుతోంది!

సిరిసిల్ల : పేదల సొం తింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. మొదటి విడతలో 1,023 ఇళ్లు ఎంపిక కాగా, అధికారుల ఆధ్వర్యంలో 439 నిర్మాణాలకు ముగ్గులు పోయగా చాలావరకు పనులు ప్రారంభమయ్యాయి. 159 ఇళ్ల బేస్‌మెంట్‌లు పూర్తికాగా 150 ఇళ్ల లబ్ధిదారుల ఖాతాల్లో రూ.లక్ష చొప్పున జమ అయ్యాయి. మరో 200 నిర్మాణాలకు సంబంధించిన బేస్‌మెంట్ పనులు పురోగతిలో ఉన్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. రెండో విడతలో 6,798 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా వెయ్యికిపైగా ఇళ్లకు ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు.

ఎప్పటికప్పుడు ఫొటోలు తీస్తూ..

మొదటి విడతలో ప్రారంభించిన 1,028 ఇళ్లలో ఇప్పటి వరకు రూఫ్ లెవల్ వరకు 37 ఇళ్లు పూర్తయ్యాయి. మరో ఏడు ఇళ్లకు స్లాబ్‌లు పోశారు.

ఇల్లు మంజూరైనా నిర్మించుకోవడానికి ఆర్థిక స్తోమత లేనివారికి మహిళా సంఘాల నుంచి రూ.లక్ష రుణం మంజూరు చేస్తున్నారు. వీటిని విడతల వారీగా చెల్లించి రుణం తీర్చాల్సి ఉంటుంది.బేస్‌మెంట్‌తోపాటు ఇతర దశలు పనులు పూర్తి కాగానే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్నారు.

లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు చెల్లింపు చేస్తున్నారు. బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష, స్లాబ్ వరకు గోడల నిర్మాణానికి రూ.లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రూ.2 లక్షలు, మిగతా పనులు పూర్తి చేసిన తర్వాత రూ.లక్ష చెల్లిస్తారు.ఇంటి నిర్మాణానికి దాదాపు పది ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంటుందని, ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లి ఇసక తరలింపు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. ఆయా గ్రామాల వారీగా లబ్ధిదారులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఇళ్ల పురోగతి తెలియజేయాలని సూచించారు. దీంతో గ్రామాల వారీగా లబ్ధిదారులతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల పురోగతి ఫొటోలను గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారు.

# పంచాయతీలపై బకాయిల బండ



వికారాబాద్ : ట్రాక్టర్ల నిర్వహణ మాకొద్దని ఈనెల 12న ధారూర్ మండల పంచాయతీ కార్యదర్శులు తాళాలను ఎంపీడీవోకు అప్పగించారు. వచ్చే వేతనాలతో కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని, దీనికితోడు ట్రాక్టర్ల నిర్వహణ బాధ్యతలు చేపట్టలేమని విన్నవించారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లు పంచాయతీ కార్యదర్శులకు తలకు మించిన భారంగా పరిణమించాయి. సర్పంచులు ఉన్నప్పుడు పల్లెప్రగతి, కేంద్రం 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యేవి. వాటి మంజూరు ఆలస్యమైనా సర్పంచులు సొంత డబ్బులు వెచ్చించి ట్రాక్టర్ల నిర్వహణ చూసుకునేవారు. వారి పదవీకాలం గతేడాది ఫిబ్రవరి 1న ముగియడంతో అప్పట్నుంచి ఆ బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై పడింది. స్థానిక ఎన్నికలు నిర్వహించకపోవడంతో వివిధ మార్గాల్లో నెలకు వచ్చే రూ.10.4 కోట్ల నిధులు నిలిచిపోయాయి. దీంతో ట్రాక్టర్ల నిర్వహణ అటకెక్కింది. గ్రామాల్లో చెత్త సేకరణ, ఇతర అభివృద్ధి పనులు నిలిచి పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి.

**చిన్న పంచాయతీలకు చాలా కష్టం..**పంచాయతీలకు ట్రాక్టర్ల నిర్వహణ భారమవుతోంది. వాయిదాలు, రహదారి పన్నులు సకాలంలో చెల్లించకపోవడంతో రూ.3 కోట్ల వరకు బకాయిలు పేరుకున్నట్లు తెలిసింది. పంచాయతీ సేవలకే ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నందున పన్నులు రద్దు చేయించాలని అప్పట్లో కలెక్టర్లు ప్రభుత్వానికి విన్నవించినా ఉత్తర్వులు రాలేదు. దీంతో రహదారి పన్నుల భారం పంచాయతీలపైనే పడుతోంది. ఇన్నాళ్లు రోజూ డీజిల్, అప్పుడప్పుడు మరమ్మతులకు అయ్యే ఖర్చునూ పంచాయతీ కార్యదర్శులే సర్దుబాటు చేశారు. మేజర్ పంచాయతీల కార్యదర్శులు ఎలాగోలా నెట్టుకొస్తున్నా.. చిన్న పంచాయతీలకు ఎలాంటి నిధులు రాకపోవడంతో చాలాచోట్ల మూలన పడేశారు.

**సమస్యలు అధిగమిస్తాం..**

గ్రామాలకు క్రమం తప్పకుండా వచ్చే నిధుల మంజూరు నిలిచిపోవడంతోనే సమస్య ఏర్పడింది. డీజిల్‌కు సంబంధించి రూ.2 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక వనరులు, ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వసూలు చేసి ట్రాక్టర్ల నిర్వహణకు వాడుకోవాలని సూచించాం. ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలోనే సమస్యలను అధిగమిస్తాం.

జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి.

# భావితరాలకు నవోదయం




చొప్పదండి: కార్పొరేట్ పాఠశాలల దీటుగా అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య, ఉత్తమ విలువలు, దేశభక్తి, క్రీడలు ఇలా అన్ని రంగాల్లో విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దుతూ ఆదర్శంగా నిలుస్తోంది చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయం. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిన నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దేశవ్యాప్తంగా నోటిఫికేషన్ విడుదలైంది. ఆరోతరగతిలో ప్రవేశాలకుగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

**అంతర్జాలంలో దరఖాస్తుల ఆహ్వానం**

విద్యాలయంలో ప్రవేశానికి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో అంతర్జాలంలో దరఖాస్తులు సమర్పించాలి. పాఠశాలలో ఆరోతరగతిలో 80 సీట్లకుగాను ఉమ్మడి జిల్లా నుంచి గతేడాది 10 వేలకుపైగా దరఖాస్తులు రాగా ఈ ఏడాది 12 వేలకుపైగా వస్తాయని విద్యాలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దరఖాస్తు సమర్పణకు జులై 29వ తేదీ చివరి తేదీగా ప్రకటించారు. ఈ ఏడాది డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. జగిత్యాల జిల్లాకు నూతన నవోదయ విద్యాలయం మంజూరు కావడంతో 40 సీట్లు అదనంగా వచ్చే అవకాశముంది.

**అర్హతలు ఇలా..**

3,4,5 తరగతులు ప్రభుత్వం లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో చదవాలి.అయిదో తరగతి తప్పనిసరిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చదివి ఉండాలి.

ఆధార్‌కార్డు తప్పనిసరి. లేదా తహసీల్దార్ కార్యాలయం నుంచి నివాస ధ్రువీకరణపత్రం అవసరం.

అభ్యర్థి తల్లిదండ్రులు ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన వారై ఉండాలి. అభ్యర్థులు 01.05.2014 నుంచి 31.07.2016 మధ్య జన్మించిన వారు అర్హులు.

**సీబీఎస్‌ఈ సిలబస్.. నాణ్యమైన విద్య**

ఆరోతరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా బోధిస్తారు. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించేలా వలస(మైగ్రేషన్) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఏటా తొమ్మిదో తరగతి చిన్నారులను ఇతర రాష్ట్రాలకు పంపిస్తారు. ఇతర రాష్ట్రాల వారిని ఇక్కడికి తీసుకొస్తారు. ఆరోతరగతి నుంచే కంప్యూటర్ విద్య బోధిస్తారు. అధునాతన వసతులతో కూడిన సుమారు 50 వేలకుపైగా పుస్తకాలు కలిగిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఏటా శతశాతం ఉత్తీర్ణత సాధిస్తూ ప్రతిభ చాటుతున్నారు.

**రిజర్వేషన్లు ...**

విద్యాలయంలోని 80 సీట్లలో 75 శాతం (60 సీట్లు) గ్రామీణ ప్రాంత, 25 శాతం (20 సీట్లు) పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. అందులో 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ, 3 శాతం దివ్యాంగులు, బాలికలకు 1/3 వంతు రిజర్వేషన్ అమలు చేస్తారు. అభ్యర్థి ఫొటో, సంతకం, తల్లి/తండ్రి/సంరక్షకుడి సంతకంతో దరఖాస్తులు సమర్పించాలి.

**పారదర్శకంగా ఎంపిక ప్రకియ**

విద్యాలయంలో ప్రవేశాల పరీక్ష, ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉంటుంది. విద్యార్థుల మార్కుల ఆధారంగానే ప్రవేశాలు ఉంటాయి. దళారులను నమ్మొద్దు. దరఖాస్తు, ప్రవేశ పరీక్ష, ఎంపిక ప్రక్రియ పూర్తిగా అంతర్జాలంతోనే ఉంటుంది. ప్రవేశ పరీక్షపై భయం వీడి విద్యార్థులు కష్టపడి పడి చదివితే సులువుగా ప్రవేశం పొందవచ్చు.

- పి.మంగతాయారు, ప్రధానాచార్యులు

# అన్నదాతకు సేవలు.. మరింత చేరువ

మంథని : సాగులో ఆధునిక విధానాలపై అన్నదాతలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశం, వారి సందేహాలను నివృత్తి చేయాలనే సంకల్పంతో.. ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల్లో దృశ్య, శ్రవణ మాధ్యమాలను ఏర్పాటు చేసింది. ఇందులో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండనున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి ఒకటి, రెండో విడతలో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం మూడో దశలో జిల్లాలో 24 అమర్చారు. అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. రైతులకు సూచనలు, సలహాలు మరింతగా చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సేవలను విస్తరిస్తుంది.

**అధిక దిగుబడులకు ఆస్కారం**

వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశు సంవవర్ధక, నీటి పారుదలశాఖలకు సంబంధించిన విషయాలపై సలహాలు అందిస్తారు. ఆసక్తి గలవారు ఇందులో పాల్గొని శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు వీక్షించి సాగులో దిగుబడులు పొందే ఆస్కారం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

**38 మాధ్యమాలు**

జిల్లాలోని 14 మండలాల్లో మొత్తం 54 రైతు వేదికలున్నాయి. మొదటి విడతలో 3, రెండో విడతలో 11, మూడో విడతలో 24 కలిపి మొత్తంగా 38 దృశ్య శ్రవణ మాధ్యమాలు ఏర్పాటు చేశారు. అనుభవమున్న శాస్త్రవేత్తలు పంటల సాగు విధానాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, వ్యాపించే తెగుళ్ల నివారణలపై సూచనలు అందిస్తూ సందేహాలను నివృత్తి చేయనున్నారు.

**ఏఈవోలకు బాధ్యతలు**

జిల్లాలో చాలావరకు రైతు వేదికలకు రక్షణ కరవైంది. వీటిలో ఏర్పాటుచేసిన దృశ్య శ్రవణ మాధ్యమాల విలువ రూ.4 లక్షల వరకు ఉంటుంది. వీటి బాధ్యత ఏఈవోలకు అప్పగించారు. ఇప్పటికే రైతు వేదికల నిర్వహణ భారంతో సతమతమవుతున్న ఏఈవోలకు వీటి భద్రత చూసుకోవడం తలకు మించిన భారం కానుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని రైతు వేదికల్లో తలుపులు, కిటికీలు సరిగాలేక ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు.

**ప్రతి మంగళవారం కార్యక్రమాలు**

జిల్లాలో రైతులకు సూచనలు, సలహాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు వేదికల్లో దృశ్య శ్రవణ మాధ్యమాలను ఏర్పాటు చేస్తోంది. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యానవనశాఖ అధికారులతో వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలను తెలుసుకోవచ్చు. - ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

# తేలని భూసేకరణ.. ముందుకెళ్లని విస్తరణ

కరీంనగర్ : ఇటీవల గంగాధర మండలం ర్యాలపల్లికి చెందిన ఓ యువకుడు కొత్తపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ముందు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టడంతో మృతి చెందాడు.రాష్ట్ర రాజధానికి వెళ్లాలన్నా, వ్యాపార, పుణ్య క్షేత్రాల నిమిత్తం రైల్వే జంక్షన్‌కు చేరుకోవాలన్నా ఈ రహదారిపైనే ప్రయాణిస్తుంటారు. 40 ఏళ్ల కిందట వేసిన రెండు ప్రధాన జిల్లాలను కలిపే కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి-563 విస్తరణ జరగక ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి.

న్యూస్‌టుడే, గంగాధర: ఒకప్పటి ఉమ్మడి జిల్లా కేంద్రం కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్లే ప్రధాన రహదారి పెరిగిన వాహనాల రద్దీతో ఇరుకుగా మారింది. ఈ దారి వెంట వెళ్లే వాహనాల వరుస చూస్తే ఒక్కోసారి ర్యాలీని తలపిస్తుందంటే అతిశయోక్తి కాదు. కొండగట్టు, ధర్మపురి పుణ్యక్షేత్రాలు, జగిత్యాలలోని పొలాస, కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రకు ఇదే మార్గం కావడంతో నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఇక జగిత్యాల నుంచి



కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వెళ్లాలన్నా ఇదే మార్గం దిక్కు.

**జాప్యంతో ఇబ్బంది**

భారత్‌మాల పరియోజనలో భాగంగా జాతీయ రహదారిగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

వరంగల్ నుంచి హుజూరాబాద్, కేశవపట్నం వరకు రహదారి విస్తరణ పనులు జరుగుతుండగా కరీంనగర్ నుంచి జగిత్యాల రహదారికి మోక్షం కలగడం లేదు.

ఇప్పటికే సర్వే చేయగా భూ నిర్వాసితులకు పరిహారం విషయంలో ఎటూ తేలకపోవడంతో వారికి డబ్బులు ఇవ్వలేదు. భూసేకరణ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

జగిత్యాల జిల్లాలో మాత్రం భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. మొత్తం 245.94 హెక్టార్లు అవసరమని గుర్తించి అప్పట్లో 124 ఎకరాలు సేకరించారు.

ఆయా గ్రామాల వద్ద 14 చోట్ల ప్రయాణ ప్రాంగణాలు, 18 చోట్ల బస్సు షెల్టర్లు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించారు.

కరీంనగర్, వెదిర, గంగాధర, జగిత్యాల సమీపంలో 4 నుంచి 5 కి.మీ మేర బైపాస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ మార్గంలో ప్రమాదాలు నివారించడంలో రద్దీ సమస్యను అధిగమించడానికి మొత్తం 31.1 కి.మీపాటు బైపాస్ రోడ్డు నిర్మించనున్నారు.

# కమీషన్‌కు ఎదురుచూపులు


పెద్దపల్లి : అన్నదాతకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. స్వయం సహాయక సంఘాలు, సహకార, డీసీఎంఎస్, మార్కెటింగ్ శాఖలకు కొనుగోళ్ల బాధ్యతలు కట్టబెట్టింది. ఏడాదిలో వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యాన్ని సేకరిస్తున్నారు. అయితే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కమీషన్ చెల్లింపులో జాప్యం నెలకొంది. ముందుగా ఖర్చు చేస్తున్నప్పటికి కమీషన్ సకాలంలో రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదు. మరోవైపు రైతులకు హమాలీ ఛార్జీలు రైతులకు గుదిబండగా మారడంతో.. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

**క్వింటాల్‌కు రూ.31.25..**

కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు నిర్వాహకులకు క్వింటాల్ సాధారణ రకానికి రూ.31.25, 'ఏ' గ్రేడ్ రకానికి రూ.32 కమీషన్ చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీటి వసతి, విద్యుత్తు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడంతోపాటు.. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా పరదాలు కప్పుతున్నారు. తేమ శాతం వచ్చేందుకు తూర్పార పడుతున్నారు. బస్తాలకు కుట్లు వేయడం, ధాన్యం లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే సీజన్ ముగిసిన వెంటనే కమీషన్ విడుదల చేస్తామనే ప్రభుత్వ ప్రకటన మాత్రం ఆచరణ సాధ్యం కావడంలేదు.

**పేరుకుపోతున్న బకాయిలు**

ధాన్యం సేకరణలో స్వశక్తి సంఘాల మహిళలు, సహకార సంఘాల్లోని సిబ్బంది భాగస్వాములవుతున్నారు. 2024-25 వానాకాలంలో ఏ గ్రేడ్ 29,03,612 క్వింటాళ్లు, సాధారణ రకం 70,182 క్వింటాళు



, యాసంగిలో ఏ గ్రేడ్ 16,86,753 క్వింటాళ్లు, 23,24,328 క్వింటాళ్లు సాధారణ రకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

జిల్లాలో ప్రతి సీజన్‌లో సుమారు 320 కేంద్రాల్లో ధాన్యం సేకరిస్తున్నారు. రెండు సీజన్లలో రూ.22.16 కోట్ల కమీషన్ విడుదల కావాల్సి ఉంది. పలు రకాల కారణాలతో కమీషన్ బకాయిలు పేరుకుపోతున్నాయి.

ఏడాదిగా కమీషన్ డబ్బుల విడుదలకు నిరీక్షణ తప్పడంలేదు. ఆ సొమ్ముతోనే స్వశక్తి, సహకార సంఘాలు ఆర్థిక బలోపేతం అవుతున్నాయి. వాటి నిర్వహణకు తీసుకొచ్చిన అప్పులు భారమవుతున్నాయని వాపోతున్నారు.

**వచ్చిన వెంటనే జమ చేస్తాం**

స్వశక్తి, సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. రెండు సీజన్లకు సంబంధించి కమీషన్ సొమ్ము విడుదల కావాల్సి ఉంది. ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. సొమ్ము వచ్చిన వెంటనే వారి ఖాతాల్లో జమ చేసేలా చూస్తాం.- శ్రీకాంత్, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

# బాలల జీవితాల్లో నవోదయం



పామూరు : జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు వచ్చిందంటే తమ బిడ్డ భవిత బంగారుమయమని తల్లిదండ్రులు భావిస్తారు. ఇప్పుడా సువర్ణావకాశాన్ని సొంతం చేసుకునే తరుణమొచ్చింది. నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ పరీక్ష ప్రకటన విడుదలైంది. పేద, మధ్యతరగతి వర్గాలకు నాణ్యమైన విద్య అందించే 'జవహర్ నవోదయ విద్యాలయ'లో ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. జిల్లాలో ఒంగోలు, కలుజువ్వలపాడులో నవోదయ విద్యాలయాలున్నాయి.

**ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం**

నవోదయ విద్యాలయం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 3, 4 తరగతులు ఉత్తీర్ణత పొంది, ఏదైనా ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో అయిదో తరగతి చదువుతూ ఉండాలి. 01.05.2014 నుంచి 31.07.2016 జన్మించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకుని, ఇటీవల తీసుకున్న పాస్‌ఫొటో అతికించి అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకం చేయాలి. ఈ ఫారాన్ని సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా ధ్రువీకరించి తిరిగి దాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒంగోలు, కలుజువ్వలపాడులో ఒక్కో విద్యాలయంలో 80 చొప్పున అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 33 శాతం సీట్లు బాలికలకు కేటాయిస్తారు. విద్యార్థులకు 12వ తరగతి వరకు ఉచితంగా సీబీఎస్ఈ సిలబస్‌లో విద్య అందిస్తారు. బోధనతో పాటు అన్నీ ఉచితంగా కల్పిస్తారు. మొత్తం వంద మార్కులకు పరీక్ష ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ, గణితం, పేరాగ్రాఫ్స్ ఇలా మూడు విభాగాల్లో 80 ప్రశ్నలు ఉంటాయి. తగిన తర్ఫీదు పొంది సీటు సంపాదిస్తే మంచి భవిత సొంతమవుతుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎస్.పురం ఎంఈవో జగన్నాథం ప్రసాదరావు అన్నారు.

దరఖాస్తు గడువు జులై 29, 2025

పరీక్ష డిసెంబరు 13, 2025

# ధాన్యం సొమ్ములొచ్చాయ్

కాకినాడ : జిల్లాలో రబీ సీజన్‌లో సేకరించిన ధాన్యానికి బకాయి సొమ్ములను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. గత రెండు రోజులుగా 6 వేల మంది రైతుల ఖాతాలకు రూ.125 కోట్లు జమ చేసింది. దీంతో రైతు సేవా కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యానికి మొత్తం సొమ్ము చెల్లించినట్లయింది. రబీలో ఏప్రిల్ నుంచి జూన్ 30 వరకు 225 రైతు సేవా కేంద్రాలు ద్వారా 1,40,211 టన్నుల ధాన్యాన్ని 15,667 మంది రైతుల నుంచి జిల్లా పౌరసరఫరాల సంస్థ సేకరించింది. వీటి విలువ రూ.322.82 కోట్లు. దీనికి సంబంధించి మే 13 వరకు రూ.197.82 కోట్లు చెల్లించారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం బకాయిల చెల్లింపునకు రూ.1000 కోట్లు కేటాయించడంతో మిగిలిన సొమ్ము మంజూరైంది. జిల్లాలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యింది. ఈ నేపథ్యంలో ఖాతాల్లో సొమ్ము పడడంతో



పెట్టుబడికి ఎంతో ఉపయోగపడతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సేకరించిన ధాన్యాన్ని 116 సీఎంఆర్ రైస్ మిల్లులకు తరలించారు.

**ఇక్కడే లెక్క తప్పింది..**

గతేడాది రబీలో జిల్లాలో కేవలం 25వేల టన్నుల ధాన్యాన్ని మాత్రమే జిల్లా పౌరసరఫరాల సంస్థ సేకరించింది. దీని దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రబీలో 50వేల టన్నుల వరకు ధాన్యం రైతు సేవా కేంద్రాలు ద్వారా సేకరిస్తుందని అంచనా వేసింది. కానీ, ఈసారి రబీలో 70 శాతం వరకు బొండాలు రకం(బాయిల్డ్) సాగు జరిగింది. ఎకరాకు 45 నుంచి 60 బస్తాలు పండింది. ఈ బియ్యం దేశీయంగా, విదేశీయంగా ఎగుమతులు బాగా తగ్గిపోవడంతో ఇబ్బంది ఏర్పడింది. బహిరంగ మార్కెట్‌లో ఈ రకం ధాన్యానికి డిమాండ్ లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వం వీటిని సేకరించాల్సి వచ్చింది. దీంతో 50వేల టన్నుల అంచనా 1.40లక్షల టన్నులకు చేరింది. ప్రభుత్వం 50వేల టన్నుల ధాన్యానికి సరిపడా నిధులను సిద్ధం చేసుకుంది. సేకరణ రెండు రెట్లు పెరిగిపోవడంతో సొమ్ములు సర్దుబాటుకు సమయం పట్టింది. రైతులు ఈ ఖరీఫ్‌లో ఇబ్బంది పడకూడదని బకాయిలను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రెండు రోజుల వ్యవధిలోనే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసింది.

# సాగు చేస్తేనే.. యూరియా

చిత్తూరు : మోతాదుకు మించి యూరియా వినియోగిస్తున్న నేపథ్యంలో అన్నదాతలు కొరత ఎదుర్కొంటున్నారని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగానే సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం యూరియా సరఫరాలో పలు నిబంధనలు అమలుకు శ్రీకారం చుట్టింది.

ఈ ఏడాది ముందస్తు వర్షాలతో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో కూరగాయలు, ఉద్యాన పంటలు.. చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి, పూతలపట్టు నియోజకవర్గాల్లో వరి, కూరగాయల పంటలతో పాటు పశుగ్రాసం విస్తారంగా సాగవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో 10-15 రోజులుగా యూరియా కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు. చిత్తూరులోనే అందుబాటులో లేదంటే ఇక జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిస్థితి చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో ప్రైవేటు, హోల్‌సేల్ డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన వ్యవసాయ శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

**ఏవో ప్రతిపాదిస్తేనే..**

మా మండలంలో పంటలు సాగవుతున్నాయి.. యూరియా అవసరమని మండల వ్యవసాయాధికారులు జిల్లా శాఖకు ప్రతిపాదిస్తేనే సదరు మండలానికి యూరియా సరఫరా చేస్తారు. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు సాగు విస్తీర్ణాన్ని పరిశీలించి నివేదిస్తే ఎలాంటి సమస్య



రాదు. అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే ఆ మండల రైతులకు సమస్యలు తప్పవు.

**నష్టాలే అధికం..**

అవగాహన లోపంతో పరిమితికి మించి నత్రజని ఎరువు వాడుతుండటంతో అన్నదాతలకు పెట్టుబడుల భారం పెంచుతోంది. భూమి ఆరోగ్యాన్నీ దెబ్బతిస్తోంది. యూరియా అధికంగా వాడకంతో పంట విపరీతంగా పెరగడం, చీడపీడల సులభంగా సోకడం, దిగుబడులు తగ్గిపోతాయని అధికారులు పేర్కొంటున్నారు.

**కొరత రాకుండా చర్యలు..**

జిల్లాలో యూరియా కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. ఎప్పటికప్పుడు మండల వ్యవసాయాధికారులతో సమీక్షిస్తూ అవసరాలకు అనుగుణంగా నిల్వ చేస్తున్నాం.

మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

**జిల్లాలో యూరియా నిల్వ (టన్నుల్లో)..**

వంద రైతు సేవా కేంద్రాల్లో: 110

ప్రైవేటు డీలర్లు: 900

మార్క్‌ఫెడ్ వద్ద: 1,800

సహకార సంస్థల్లో: సున్నా

హోల్‌సేల్ దుకాణాల్లో: సున్నా

# మేలు రకం దూడలే లక్ష్యం



ఒంగోలు : జిల్లాలో పెయ్య దూడల సంఖ్య తగ్గడంతో పాల దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో పాడి రైతుల అభ్యున్నతికి ఎన్డీయే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో ఆడ పెయ్యి దూడ సంతతిని పెంచే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. మేలు జాతి పశుసంతతిని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళిక చేపట్టింది. సాధారణంగా 50 శాతం ఆడ, మరో 50 శాతం మగ దూడలు జన్మిస్తాయి. మేలుజాతి వీర్యంతో 90 శాతం పెయ్య దూడలు జన్మించే అవకాశం ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 81,800 ఇంజెక్షన్లు వేయాలన్నదే లక్ష్యంగా నిర్ణయించింది.

జిల్లాలో సుమారు 6 లక్షల చూడి, పాడి పశువులున్నట్లు అధికారుల అంచనా. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పాల దిగుబడిని ఏటా 15 శాతం వరకు పెంచాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. పశువులకు పరీక్షలు నిర్వహించి వీర్యాన్ని ఎక్కించేవిధంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రణాళిక చేస్తున్నారు. దీనిపై ఈ నెల నుంచే క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పించి, తద్వారా మేలుజాతి వీర్యం ఇంజెక్షన్లు వేయనున్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని పశు వైద్యశాలల్లో మేలుజాతి వీర్యాన్ని అందుబాటులో ఉంచి పశువులకు ఇంజెక్షన్లు చేసేవిధంగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. గతంలో మేలుజాతి వీర్యాన్ని రూ.500కు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెయ్య దూడల వృద్ధిని పెంచాలన్న ఉద్దేశంతో పశుపోషకులకు రూ.150కే అందజేస్తోంది. తద్వారా ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ధర తగ్గించడంతో ఎక్కువ మంది పాడి రైతులు ఇంజెక్షన్లకు ముందుకొచ్చే అవకాశం ఉంది.

**తొలివిడతగా 10 వేల డోసులు**

జిల్లాలోని పాడి రైతులు మేలుజాతి వీర్యాన్ని చూడి పశువులకు వేయించాలి. తొలి విడతగా మరో వారం రోజుల్లో సంధ్యాల నుంచి 10 వేల డోసులు తీసుకొస్తున్నాం. అన్ని పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉంచుతాం. మేలుజాతి వీర్యంపై క్షేత్రస్థాయిలో పశు పోషకులకు అవగాహన కల్పిస్తున్నాం. మేలు జాతి పెయ్య దూడలు జన్మిస్తే తద్వారా భవిష్యత్తులో పాల దిగుబడి పెరుగుతోంది.బి.రవి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

# వైద్యసేవ మాటున దోపిడీ

తిరుపతి : తిరుపతికి చెందిన ఓ న్యాయవాది విరిగిన ఎముకల శస్త్ర చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయించగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద చేర్చుకున్నారు. విరిగిన ఎముకను సరి చేసి అవసరమైన ఇంప్లాంట్స్, ఇతర వస్తువులతో పటిష్ఠంగా అమర్చాల్సి ఉంది. అయితే రూ.1.50 లక్షలు చెల్లించి శస్త్ర చికిత్స చేసుకున్నారు. తర్వాత ట్రస్టుకు ఫిర్యాదు చేయడంతో నగదు వసూళ్లపై కలెక్టర్ విచారణ చేపట్టారు.రామచంద్రాపురం మండలానికి చెందిన వ్యక్తి కుడి చేయి స్పందన తగ్గింది. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయించగా ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలో ఓపీ చూశారు. రూ.15 వేలు చెల్లించుకుని యాంజియోగ్రామ్, రక్త పరీక్షలు చేసి మెడ నరానికి స్టంట్ వేయాలని చెప్పారు. శస్త్రచికిత్సకు తగినంత డబ్బు ఎన్టీఆర్ వైద్య సేవల కింద మంజూరు చేయరని రూ.50 వేలు పైగా తీసుకున్నారు.ఆరోగ్యశ్రీతో ఎన్టీఆర్ వైద్యసేవల నెట్వర్క్ ఆస్పత్రులను సంప్రదించే పేదలను దోచుకుంటున్నారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ఉచిత శస్త్ర చికిత్సలకు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. వైద్యసేవలో అడ్మిట్ పొందాక పరీక్షలకు ఒప్పిస్తారు. సమస్య తీవ్రంగా ఉందని.. ట్రస్టు ఇచ్చే సొమ్ము సరిపోదని, అదనంగా కొంత పెట్టుకుంటే ఆపరేషన్ చేస్తామంటారు. అప్పటికప్పుడు ఇంకెక్కడికి వెళ్లలేక డబ్బు కట్టి ఆపరేషన్ చేయించుకుంటున్నారు. ట్రస్టుకు ఫిర్యాదు చేస్తారని వీడియో, రాత పూర్వక సమ్మతి తీసుకుంటారు. ఎన్టీఆర్ వైద్యసేవ




కింద ఆహారం, ఇళ్లు చేరేందుకు బస్సు ఛార్జీలు అందజేయాలని రోగుల కుటుంబాలకు తెలిసినా.. చెకప్‌లకు వచ్చినప్పుడు పట్టించుకోరని ఫిర్యాదు చేయడం లేదు.

**85 ఫిర్యాదులపై విచారణ:** ఎన్టీఆర్ వైద్యసేవ కింద చికిత్స పొందిన 240 మంది రోగులు 104, ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా గత మూడు నెలల్లో ఫిర్యాదులు చేశారు. విచారణకు 85 మంది మాత్రమే స్పందించారు. 85 ఫిర్యాదులను ఈ-ఆఫీసు ద్వారా కలెక్టర్‌కు పంపితే వసూళ్లను బట్టి రెండు, మూడింతల జరిమానా విధించారు. పదే పదేగా ఫిర్యాదులు వచ్చే ఆస్పత్రులను సస్పెండ్ చేస్తారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద 3,257 శస్త్ర చికిత్సలకు అనుమతులున్నా సుమారు వెయ్యి రకాల సర్జరీలు మాత్రమే జిల్లాలో చేస్తున్నట్లు సమాచారం. రూ.లక్షకు పైబడిన శస్త్ర చికిత్సలు ప్రైవేట్ ఆస్పత్రులు చేయడం లేదు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలోని శస్త్ర చికిత్సలకు అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. డబ్బులు అడిగితే బాధితులు 104కు డయల్ చేస్తే చర్యలు తీసుకుంటాం.డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా సమన్వయకర్త, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ట్రస్టు పరిధిలోని ఆస్పత్రులు

ప్రైవేట్ - 38

ప్రభుత్వ జిల్లా ఆస్పత్రులు - 2

ఏరియా - 2

పీహెచ్‌సీలు - 57

సీహెచ్‌సీలు - 10

తితిదే - 3

# అల్లుకున్న అవినీతి బంధం



నంద్యాల : ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తామని గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది. జగనన్న కాలనీలు అంటూ దోపిడీకి పాల్పడింది. భూసేకరణ మొదలు ఇసుక తరలింపు వరకు ఆ పార్టీ నేతలకు ఆదాయ వనరుగా మార్చారు. ఉమ్మడి జిల్లాలో 1,91,781 మందికి పట్టాలిచ్చారు.. 1,008 జగనన్న కాలనీల్లో 1,321,707 ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు మొదట ప్రకటించారు. ప్రకటించారు. నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకురాని లేదని కర్నూలు జిల్లాలో 303, నంద్యాలలో 205 కాలనీలకు పరిమితం చేశారు. ఒక్క ఇల్లు పూర్తికాకున్నా కాలనీల్లో విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు, తీగలు బిగించి ప్రజాధనం వృథా చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో 'పెద్ద' నాయకుడి బంధువుకు లబ్ధి కల్పించేందుకు ఇలా చేసినట్లు తేలింది.

**త్రీఫేజ్ పనులకు ఉపయోగించుకునేలా**

ఉమ్మడి జిల్లాలోని గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు రూ.1200 కోట్లతో పనులు చేపడుతున్నారు. పనుల్లో భాగంగా త్రీఫేజ్ విద్యుత్తు నియంత్రికలు అవసరం అవుతాయి. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో వృథాగా పడి ఉన్నా నియంత్రికలను వినియోగిస్తే ఎలా ఉంటుందని అధికారులు ఆలోచిస్తున్నారు. ఇదే సమయంలో కొత్త సర్వీసులు, ఇప్పటికే ఉన్నవాటిపై అదనపు లోడు కోసం దరఖాస్తులు వస్తున్నాయి. వీటికీ జగనన్న కాలనీల్లో వృథాగా ఉన్న సామగ్రిని వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

**చోరీకి గురవుతున్న సామగ్రి**

సింహభాగం కాలనీలు ఊరికి దూరంగా, కొండలు, గుట్ట ప్రాంతంలో ఉన్నాయి. ఏ ఒక్క కాలనీలో ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టలేదు. చిట్టడవిలా ఉన్న ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లడం లేదు.. అక్కడ బిగించిన విద్యుత్తు తీగలు, పరికరాలు, వస్తువులు చోరీకి గురవుతున్నాయి. బండిఆత్మకూరు, పాములపాడు, నందికొట్కూరు, పగిడ్యాల, చాగలమర్రి, ప్యాపిలి, గడివేముల, రుద్రవరం , మిడుతూరు, సంజామల, పత్తికొండ, తుగ్గలి, మంత్రాలయం, కోసిగి, దేవనకొండ, కౌతాళం, మద్దికెర, గూడూరు, సి.బెళగల్, ఆస్పరి, చిప్పగిరి, గోనెగండ్ల, నందవరం మండలాల్లోని పలు కాలనీల్లో విద్యుత్తు సామగ్రి పెద్ద ఎత్తున చోరీకి గురైనట్లు అధికారులు గుర్తించారు.

**ఒక కాలనీకి రూ.10 లక్షలు**

జగనన్న కాలనీలకు విద్యుత్తు పరికరాలు సరఫరా చేసే బాధ్యతను వైకాపా ప్రభుత్వంలో కీలకంగా ఉన్న 'పెద్ద' నాయకుడి బంధువుకు అప్పగించారు. తక్కువ మొత్తానికి టెండరు వేసి తర్వాత అంచనాలు పెంచి అనుకున్న మొత్తాన్ని రాబట్టుకుంటాడనే పేరున్న ఆయనకే బాధ్యతను అప్పగించారు. కర్నూలులో 3,450, నంద్యాలలో 3,550 ఇళ్లు పూర్తి అయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 706 కాలనీల్లో విద్యుదీకరణ కోసం రూ.450 కోట్ల వరకు ఖర్చు చేశారు.

ఒక జగనన్న కాలనీలో 100 కె.వి. విద్యుత్తు నియంత్రికలు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఒక్కోదానికి రూ.4 లక్షలు వెచ్చించారు. కాలనీలో ఏర్పాటు చేసే తీగలకు ప్రతి కి.మీ.కు రూ.84 వేలు, ఒక్కో స్తంభానికి రూ.4 వేలు.. ఇలా ప్రతి కి.మీ.కు 80 వేలు ఖర్చు అవుతుందని లెక్కలు వేశారు. కూలీల సొమ్ము అదనం. అన్నీ కలిపి విద్యుదీకరణకు ప్రతి కి.మీ.కు రూ.2.5 లక్షలు చొప్పున ఒక కాలనీకి కనిష్ఠంగా రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు.

# ఇసుక కావాలంటే... కానుక ఇవ్వాలంటే!

ఒంగోలు : సామాన్యులకు ఇసుక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఎన్నో సడలింపులిచ్చింది. క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇసుక కావాలంటే నగదు రూపంలో కానుక ఇవ్వాల్సిందేనని డిపో నిర్వాహకులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రధానంగా పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో నేతల అండదండలతో మితిమీరిన వసూళ్లు సాగుతున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే మా ఇష్టం.. మాదే రాజ్యం.. అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేనందున ప్రభుత్వం 12 నిల్వ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దూరం ఆధారంగా రవాణా ఖర్చులు కలుపుకొని టన్నుకు ధర నిర్ణయించి ఆ మేరకు వసూలు చేయాలని సూచించింది. వాగులు, వంకలు ఉన్నచోట ట్రాక్టర్లతో స్థానికులు ఎవరైనా సొంతంగా ఇసుక తెచ్చుకునేవిధంగా నిబంధనలు సడలించింది. తక్కువ ధరకు ఇసుక లభ్యమైనా గృహ యజమానులు తెచ్చుకునే అవకాశం కల్పించింది. నిల్వ కేంద్రం నిర్వాహకులు మాత్రం తమ దగ్గరే తాము చెప్పిన ధరకు కొనాల్సిందే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఒక వేళ ఎవరైనా సొంత వాహనాల్లో తెచ్చుకోవాలనుకున్నా వెంబడించి మరీ దాడులకు పాల్పడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రహదారులపై సిబ్బందిని కాపలా పెట్టడం గమనార్హం.యర్రగొండపాలెం నిల్వ కేంద్రంలో టన్ను ఇసుక



రూ.1,250కు విక్రయిస్తున్నారు. బయట రూ.900కే లభ్యమవుతున్నా డిపో నిర్వాహకులు అడ్డుకుంటున్నారు. గిద్దలూరు ప్రాంతంలోనూ అదే పరిస్థితి. బయట నుంచి ఇసుక తెచ్చుకుంటే ప్రత్యేకంగా కాపలా పెట్టిన సిబ్బంది వెంబడించి మరీ దాడులకు తెగబడుతున్నారు. టన్నుకు రూ.200 నుంచి రూ.300 వరకు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. మార్కాపురంలో డిపో నిర్వాహకుల దందా అంతా ఇంతా కాదు.. స్టాక్ పాయింట్ నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే వారి వాహనాల్లోనే తీసుకెళ్లాలి. తూకం వేయించుకునే ఛార్జీ గృహ యజమానే భరించాలి. ఇక్కడ టన్ను ధర రూ.1,200 నిర్ణయించగా, బయట నుంచి ఎవరైనా తక్కువ ధరకు ఇసుక తెచ్చుకుంటే టన్నుకు రూ.200 చొప్పున నిల్వ కేంద్రం వారికి కప్పం కట్టాల్సిందే. కాసులు ఇవ్వనిదే బండిని కదలనీయరు. ఇదే మాదిరి మిగిలినచోట్ల వసూళ్ల సాగిస్తుండటంపై జిల్లా కేంద్రానికి వచ్చి బాధితులు ఫిర్యాదులు చేస్తున్నారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బరితెగించి వ్యవహరిస్తున్నారు.

**కేసులు నమోదు చేస్తాం**

ఇసుక నిల్వ కేంద్రాలపై ఇప్పటికే ఫిర్యాదులొచ్చాయి. నిల్వ కేంద్ర నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. దాడులకు తెగబడటం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తాం. ఫిర్యాదులు వస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.టి.రాజశేఖర్, జిల్లా భూగర్భ గనులశాఖ అధికారి

# సోమశిలకు 'జల'సత్వాలు

ఆత్మకూరు : కృష్ణా జలాలు సోమశిలను చేరాయి. నమోదైన 1,131 క్యూసెక్కుల ప్రవాహం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. అధికారులు అంచనా కన్నా ముందే జలాలు సోమశిలకు చేరడం.. కర్నూలు జిల్లాలో కురుస్తున్న వర్షాలతో కుందు నది ద్వారానూ కలిసొచ్చే అవకాశం ఉండటం జిల్లా రైతుల్లో ఆనందం నెలకొంది. **ఆదినిమ్మాయపల్లి వద్ద..** ఈ ఏడాది జులై నెలలోనే కృష్ణాజలాలకు వరదలు ఉద్ధృతం వచ్చాయి. దాంతో శ్రీశైలం జలాశయం నిండి.. సాగర్‌కు నీటిని విడుదల చేశారు. అవి కాస్త పెన్నా ద్వారా సోమశిలను చేరాయి. 'శ్రీశైలం'లో ప్రస్తుతం 203.43 టీఎంసీలు ఉండగా.. జలాశయంలోకి 1,75,233 క్యూసెక్కులు వస్తోంది. దాంతో తెలుగుగంగకు విడుదలను మరింత పెంచే అవకాశం ఉండగా.. అదే స్థాయిలో సోమశిలకు రానున్నాయి. శుక్రవారం ఉదయం కడప జిల్లా ఆదినిమ్మాయపల్లి వద్ద పెన్నాలో 1800 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది.**28.66 టీఎంసీల నిల్వ** సోమశిలలో 28.66 టీఎంసీల నిల్వ ఉండగా.. గురువారం జలాశయంలోకి 165 క్యూసెక్కుల ప్రవాహమే ఉంది. శుక్రవారం కృష్ణా జలాలు జత కావడంతో 1,131 క్యూసెక్కులకు పెరిగింది. జులైలోనే ప్రవాహం రావడంపై జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టులో రెండో పంట సాగులో ఉంది. ప్రవాహం క్రమంగా పెరిగే పరిస్థితి ఉంది. తద్వారా తాగు, సాగునీటికి నిశ్చింత ఏర్పడింది.

**అపును.. తాకాయి:** సోమశిలకు కృష్ణాజలాల రాక మొదలైంది. జలాశయానికి వచ్చే ప్రవాహం పెరుగుదల ఆ విషయాన్ని స్పష్టం చేస్తోంది. అది క్రమంగా పెరిగే అవకాశం ఉంది. శ్రీనివాసకుమార్, ఈఈ, సోమశిల ప్రాజెక్టు

# పేదలకు అందుబాటులో ఖరీదైన వైద్యం

విశాఖపట్నం:: ఉత్తరాంధ్ర జిల్లాల్లో తలసీమియా వ్యాధితో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. దీనికి చికిత్స ఖరీదుతో కూడినది. బాధితులకు చికిత్స అందించడానికి కేజీహెచ్‌లో ప్రత్యేకంగా వార్డు ఉంది. రోగుల సంఖ్య పెరిగిపోవడంతో చికిత్సలో ఇబ్బందులు వస్తున్నాయి. ఆ ఆసుపత్రిపై భారం తగ్గించడానికి విమ్స్‌లో ఇటీవల తలసీమియా ప్రత్యేక వార్డును అందుబాటులోకి తెచ్చారు. ఈ రుగ్మత ఉన్నవారి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటుంది. నిర్లక్ష్యం వహిస్తే చివరికి మృత్యువాత పడతారు. తొలిదశలో గుర్తిస్తే నయం చేయడం సులువు అవుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఎలాంటి చికిత్స లభిస్తుందంటే: వార్డులో 50 పడకలు ఏర్పాటు చేశారు. ఈనెల 5వ తేదీ నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ ముగ్గురు వైద్యులు, 12 మంది వైద్య సిబ్బందిని నియమించారు. వ్యాధిగ్రస్తులకు రక్తం మార్పిడి చేయడం, రక్తంలో ఐరన్ నియంత్రణకు మందులు అందించటం, అవసరమైన వారికి ఎముక మజ్జ మార్పిడి చేయడం, జన్యు థెరపితోపాటు ఆహారం విషయంలో చేసుకోవాల్సిన మార్పులపై వైద్యులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తారు.

**వ్యాధి లక్షణాలు ఇవే...:** చిన్న శారీరక శ్రమకే అలసిపోవడం, రోజంతా నీరసంగా ఉండడం. ఆకలి లేకపోవటం, ఏ పనిపైన ఆసక్తి లేకపోవ



టం. నిత్యం నిద్రపోవాలని అనిపించటం, చర్మం పసుపురంగులోకి మారటం, పచ్చ కామెర్లతో బాధపడటం, పిల్లల్లో ఎదుగుదల లోపంతో పాటు బక్కగా ఉండి పొట్టబాగా పెరిగిపోయి ఉంటుంది. అంటువ్యాధుల బారిన పడడం, ఛాతిలో నొప్పి, ఊపిరి తీసుకోవటంలో ఇబ్బందులు. ముదురు పసుసు రంగులో మూత్రం రావటం, తరచూ జ్వరం బారిన పడడం వంటి లక్షణాలు వ్యాధిగ్రస్తుల్లో కనిపిస్తాయి. తల్లిదండ్రులలో ఎవరికైనా తలసీమియా ఉంటే వారికి పుట్టే పిల్లలకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.

**ఆధునిక పరికరాలతో:** ఉత్తరాంధ్రలో పౌష్టికాహార లోపంతో బాధపడేవారిలో రక్తహీనత అధికంగా ఉన్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా గిరిజనుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీరు తలసీమియా వ్యాధి బారిన పడుతున్నారు. దీనికి చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్నది. పేద కుటుంబాలకు తీవ్ర భారం అవుతోంది. విమ్స్ ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలు, వైద్య పరీక్షల ద్వారా వ్యాధి తీవ్రతను గుర్తిస్తాం. రక్తం మార్పిడి చేయడం, మందులు అందించటం, వ్యాధిని నియంత్రణలో పెట్టుకునేలా కౌన్సెలింగ్ ఇవ్వడానికి సౌకర్యాలు ఏర్పాటు చేశాం. డాక్టర్ రాంబాబు, విమ్స్ డైరెక్టర్

# సహకారానికి అపకారం చేసిందెవరు?

అనకాపల్లి : సహకార శాఖలో గత ప్రభుత్వంలో రూ.కోట్లాది అక్రమాలు జరిగాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్) నిధులు దారి మళ్లించి మరీ అధికారులు అందులో వాటాలు తీసుకున్నారు. అక్రమాలను బయటపెట్టేందుకు.. తాజాగా జిల్లా కేంద్రం సహకార బ్యాంక్ ఓ కమిటీ వేసింది. ప్రతి సొసైటీకి వెళ్లి నిధులు రికవరీ కాకపోవడానికి కారణాలు, ఖాతాదారులను స్వయంగా పిలిపించి అర్హులా కాదా అనేది తేల్చుతున్నారు. గత ప్రభుత్వంలో అధికార పార్టీకి వత్తాసు పలికి.. బినామీ రుణాలు వాడేసుకున్నవారి జాబితా త్వరలో బట్టబయలు కానుంది.

ఉమ్మడి జిల్లాలో 32 డీసీసీబీ శాఖలు ఉన్నాయి. వీటి పరిధిలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 98 సహకార సంఘాలు, 320 'బి' కేటగిరీ సొసైటీలున్నాయి. గత ప్రభుత్వ పాలనలో సుమారు రూ. 40 కోట్ల నిధులు దారిమళ్లాయని డీసీసీబీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సొసైటీల్లో ఖాతా ఉన్న వారికి అడ్డగోలుగా రుణాలు మంజూరు చేశారు. వీటితో ఏమైనా యూనిట్లు ఏర్పాటు చేశారా అంటే లేదు. వాయిదాల్లో రుణం చెల్లించాల్సి ఉన్నా.. స్థానిక నేతల సిఫార్సులతో వాయిదా వేస్తూ వచ్చారు. రుణాలు తీసుకుని.. ఎగవేసిన వారి లెక్కలు తేల్చేందుకు ఇదివరకే ఉత్తర్వులు వెలువడ్డాయి. ముగ్గురు అధికారులతో డీసీసీబీ కమిటీ వేసింది. వీరు బోగస్ రుణాలు, అర్హులు, అనర్హుల వివరాలు సేకరిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో తనిఖీలు




చేసి తుది నివేదిక తయారు చేస్తారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపైనా చర్యలు తీసుకోనున్నారు.

**ఈ కేంద్రాల్లోనే అవకతవకలు...**

రోలుగుంట మండలం జానకీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బినామీ రుణాల పేరుతో రూ.కోటికి పైగా అక్కడ ముఖ్య కార్యనిర్వహణాధికారి స్వాహా చేశారని రైతులు భారీగా ఫిర్యాదులు చేశారు. ఇక్కడ గతంలో ఎలమంచిలి డివిజనల్ సహకార శాఖ అధికారి ప్రాథమిక తనిఖీలోనూ.. రూ. 1.77 కోట్లకు లెక్క కుదరలేదు. మాకవరపాలెం సొసైటీలో బినామీల పేరిట గతంలో భారీగా రుణాలు మంజూరు చేశారు. అప్పట్లో కలెక్టర్‌కు కూడా నేరుగా ఆధారాలతో సహా రైతులు ఫిర్యాదు చేశారు. ఇవే కాదు.. నర్సీపట్నం, పాయకరావుపేట, మాడుగుల, ఎలమంచిలి, చోడవరం సంఘాల్లోనూ భారీగా అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు.

**విచారించి చర్యలు తీసుకుంటాం..**

వైకాపా ప్రభుత్వంలో సహకార సంఘాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించ్చా. దీనిపై జీఎం స్థాయి ఓ అధికారి, మరో ముగ్గురితో ఓ కమిటీ వేశాం. గతంలో ఫిర్యాదులు వచ్చిన సంఘాల్లో తనిఖీలు ముందు ప్రారంభించారు. అన్నింటిలోనూ తనిఖీలు చేస్తారు. బినామీ, అనర్హుల జాబితా తయారు చేస్తారు. దానికి అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.కోన తాతారావు, డీసీసీబీ ఛైర్మన్

# కుళాయి కనెక్షన్లు.. కాకిలెక్కలు



గుత్తి : గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల విషయంలో కాకిలెక్కలు నమోదు చేశారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద గ్రామాల్లో ప్రజలకు రక్షిత మంచినీటిని అందించి [illegible] వైకాపా ప్రభుత్వ

హయాంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల పేరుతో రూ.కోట్లు గుమ్మరించారు. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో పథకం అమలు అస్తవ్యస్తంగా మారింది. అప్పటి అధికారులు కుళాయి కనెక్షన్లు దాదాపు 70 శాతం పూర్తి చేసినట్లు రికార్డుల్లో నమోదు చేయడం గమనార్హం.

**సాగని రెండో విడత పనులు**

తొలి విడతలో అరకొరగా పనులు జరిగాయి. వైకాపా సర్పంచులే ఎక్కువ శాతం నామినేషన్‌పై చేశారు. పైపులైన్ల పనుల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. టెండర్లు నిర్వహించి నాణ్యమైన కంపెనీ పైపులను కొనుగోలు చేయలేకపోయారు. స్థానికంగా లభించే పైపులు సరిపెట్టారని తెలుస్తోంది.

**అన్నీ తామే ఏర్పాటు చేసినట్లుగా..**

ప్రతి గ్రామంలో 20 నుంచి 40 వరకు కనెక్షన్లు ఇచ్చి... స్థానికులే ఏర్పాటు చేసుకున్న అనధికారిక, ప్రైవేటు కుళాయిలను తామే ఏర్పాటు చేసినట్లు అధికారులు రికార్డులకు ఎక్కించారు. మూడు నియోజకవర్గాల్లో 72 వేల కనెక్షన్లు ఇచ్చినట్లు నమోదు చేశారు. అధికారిక లెక్కల ప్రకారం 86 వేల కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. గ్రామాల్లో కొన్నేళ్ల నుంచి ప్రజలు తాగునీటి కుళాయిలను అనధికారికంగా ఏర్పాటుచేసుకున్నారు. వాటిని తాము ఏర్పాటు చేసినట్లు అధికార యంత్రాంగం లెక్క చూపడం గమనార్హం.

**అక్రమాలు జరిగి ఉంటే చర్యలు తప్పవు**

–సురేశ్, ఎస్ఈ, అనంతపురం

కుళాయిల ఏర్పాటులో ఎలాంటి అక్రమాలు జరగలేదు. ఎక్కడైనా ప్రజలు వేసుకున్న కుళాయిలను తామే ఏర్పాటు చేసినట్లు కింది స్థాయి అధికారులు ఎవరైనా నమోదు చేసి ఉంటే విచారించి తగిన చర్యలు తీసుకుంటాం. బాధ్యులను వదిలిపెట్టం.

# దండుకుంటూరా.. ఇదంతా 'మామూలే'




విశాఖపట్నం: నగరంలో పోలీసుల తీరు విస్తుగొలుపుతోంది. పర్యాటకులకు రక్షణ కల్పించాలని పంపిస్తే.. వేధించి డబ్బులు దండుకుంటున్నారు. మద్యం సిండికేట్ల మామూళ్లకు సలాం కొడుతున్నారు. స్టేషన్ గడపతొక్కే సివిల్ పంచాయితీల్లోనూ తలదూర్చుతున్నారు. ఇటీవల విశాఖ కమిషనరేట్ పరిధిలో అవినీతి ఆరోపణలపై 8 మంది కానిస్టేబుళ్లు, హెూంగార్డులపై సీపీ శంఖబ్రత బాగ్చీ వేటు వేశారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల పీఎంపాలెం స్టేషన్ పరిధిలోని బీచ్ మొబైల్ కానిస్టేబుల్ ఒకరు పర్యాటకుల నుంచి వసూళ్లు చేసిన విషయం నిజమేనని తేలింది.

**డిమాండ్ చేసి..:** తీరంలో పర్యాటకులకు రక్షణ కల్పించడానికి ప్రత్యేక బృందాలను సీపీ నియమించారు. మొబైల్ సిబ్బందిలో కొందరు ప్రేమ జంటలను 'ఏ కళాశాల? మీ తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు ఇవ్వండి' అంటూ బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. మద్యం తాగుతున్న వారిని గుర్తించి స్టేషన్‌కు రావాలంటూ బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. సొమ్ములు నేరుగా తీసుకోకుండా వైన్, పాన్, ఇతర దుకాణాల్లో ఫోన్‌పేలు చేయిస్తున్నారు.

**అక్రమార్కులకు తోడుగా..**

కమిషనరేట్ పరిధిలో 142 మద్యం దుకాణాలు, వందకుపైగా బార్లు ఉన్నాయి. కొందరు పోలీసులు మద్యం సిండికేట్‌గా చక్రం తిప్పుతున్న వ్యాపారులతో కుమ్మక్కై.. ఇతర మద్యం దుకాణాల యజమానులను వేధింపులకు గురి చేస్తున్నారు. ఇటీవల సిండికేట్‌లో లేని ఓ మద్యం దుకాణ యజమాని అధికారికంగా మరో చోటుకు మార్పిడికి ఉత్తర్వులు తెచ్చుకున్నా సిండికేట్ అడ్డుకుంది. ఓ సీఐ ఈ సిండికేట్‌కు అనుకూలంగా వ్యవహరించినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల టౌన్ కొత్త రోడ్డులోని మద్యం దుకాణం వద్దకు వెళ్లి అక్రమ మద్యం అంటూ 120 బాటిళ్లు సీజ్ చేశారు. అందులో 60 సీసాలు సొంతానికి ఉపయోగించుకున్నారు. ఫిర్యాదులందగా ఒక కానిస్టేబుల్, ఇద్దరు హెూంగార్డులపై వేటు పడింది.

**అంతా వారిష్టం** భర్త తనను వదిలి వెళ్లిపోయాడని ఓ స్టేషన్ పరిధిలో మహిళ ఫిర్యాదు చేశారు. అయితే పారిపోయిన భర్తకు పోలీసు అధికారి ఒకరు సహకరిస్తున్నారంటూ మహిళ కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు.తన వీడియోలు తీసి మోసం చేశారని, దీనిపై పోలీసులు కేసు నమోదు చేయడం లేదంటూ ఓ యువతి సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టు వైరల్‌గా మారింది.కొన్ని చోట్ల భూవివాదాల్లో తలదూర్చుతూ, ఓ వర్గానికి కొమ్ముకాస్తున్నారన్న విమర్శలున్నాయి. సీపీ పదేపదే హెచ్చరిస్తున్నా వీరిలో మార్పు రావడం లేదు.

# అదిగో.. కొత్త రోప్‌వే!



విశాఖపట్నం: విశాఖ నగర అందాలను వీక్షించేందుకు కైలాసగిరి వద్ద కొత్త పర్యాటక సౌకర్యాలు కల్పించేలా విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే కొండపై జిప్‌లైనర్, స్కై సైక్లింగ్ నిర్వహిస్తున్నారు. త్వరలో 'గ్లాస్ బ్రిడ్జి' అందుబాటులోకి రానుంది.ప్రస్తుతం: ప్రస్తుతమున్న రోప్‌వేను పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ కంపెనీ నిర్వహిస్తోంది. లీజు ముగియడంతో లైసెన్సు రద్దు చేసి అక్కడ కొత్తది నిర్మించనున్నారు. ప్రస్తుతమున్న రోప్‌వే క్యాబిన్లు పాత తరహాలో ఉన్నాయి. కింది నుంచి కేవలం 400 మీటర్లే ప్రయాణిస్తుంది. దీంతో పర్యాటకులకు ఇందులో ప్రయాణించిన అనుభూతి కలగడం లేదు.

**ఇదీ ఆలోచన:** కొత్తగా నిర్మించే రోప్‌వే కొండ కింద సముద్రం సమీపంగా తెలుగు మ్యూజియం వరకు వెళ్లేలా మార్గం నిర్ణయించారు. నిర్మించు, నిర్వహించు, అప్పగించు (బీవోటీ) ప్రాతిపదికన ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఆసక్తి ఉన్న సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించారు. ఈ నెల 22న ప్రీబిడ్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఆగస్టు అయిదో తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

కైలాసగిరి కేంద్రంగా: 'ముఖ్యమంత్రి చంద్రబాబు కైలాసగిరి కేంద్రంగా విశాఖలో పర్యాటక సౌకర్యాల కల్పన పెంచాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు కొత్త వసతుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. 'గ్లాస్ బ్రిడ్జి' ఆగస్టుకు అందుబాటులోకి వస్తుంది. అత్యాధునిక రోప్‌వే ప్రజలకు గొప్ప అనుభూతి కలిగిస్తుంది' అని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు.

**మధ్యలో 4 స్టేషన్లు..**

తెన్నేటిపార్క్ వద్ద ప్రారంభమయ్యే రోప్‌వే కైలాసగిరి కొండ మీదుగా ప్రయాణిస్తూ తెలుగు మ్యూజియం వద్దకు చేరుకోవడంతో ముగుస్తుంది. తిరిగి అక్కడే ఎక్కి కిందికి చేరుకోవచ్చు.

కిలోమీటరున్నర మేర నిర్మించనున్న కొత్త మార్గంలో నాలుగు స్టేషన్లు ఉంటాయి. పర్యాటకులు వారికి నచ్చిన చోట దిగొచ్చు. అలాగే నచ్చిన చోట మళ్లీ ప్రారంభమవ్వొచ్చు.

ఒక్కో క్యాబిన్లో ఎంత మంది ప్రయాణించొచ్చనే దానిపై చర్చిస్తున్నారు. కొన్ని 6 నుంచి 8 మందికి, కొన్ని 20 మందికి సరిపోయేలా ఆకృతులు పరిశీలిస్తున్నారు.

ప్రతి రోప్‌వే స్టేషన్లో రెండు లిఫ్టులు, నిరీక్షణ గది, ఫుడ్ స్టాల్, ఫొటోబూత్, నీటి సదుపాయం ఉంటుంది.

తెన్నేటిపార్క్ వద్ద 90 కార్లు, వంద ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తారు.

# ఒక కూడలి.. 111 ఆక్రమణలు

అమలాపురం : జిల్లాలోని రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలతో ముఖ్యకూడలిగా ఉన్న తాటిపాక కూడలిలో ఆక్రమణలు పెరిగిపోయాయి. ఒకటి రెండు కాదు దాదాపు 111 అక్రమణలు.. 216 జాతీయ రహదారి కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైనుతో అనుసంధానమవడం.. కత్తిపూడి నుంచి కాకినాడ, అమలాపురం మీదుగా పాలకొల్లు, భీమవరం, ఒంగోలు వరకు విస్తరించి ఉండి రద్దీ పెరగడంతో ఆ ప్రభావం తాటిపాకపై పడుతోంది. గెద్దాడ నుంచి జగ్గన్నపేటకు వచ్చే వాహనాల తాకిడి పెరిగింది. అమలాపురం, పాలకొల్లు, నర్సాపురం, ఓడలరేవు నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో వందల సంఖ్యలో పాఠశాల, ప్రైవేటు బస్సుల తాకిడి కారణంగా గంటలకొద్దీ ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొంటున్నాయి. నాలుగు రోడ్ల ముఖ్యకూడలిలో రహదారి, గట్టు పొడవునా అక్రమంగా వందల సంఖ్యలో దుకాణాలు, నిర్మాణాలు చేపట్టడంతో ఈ పరిస్థితి నెలకొంది.

**ఇవీ ఆక్రమణలు...:** తాటిపాకలో ఇటీవల సర్వే చేసి ఆక్రమణలు గుర్తించారు.నగరం రోడ్డులో ఆర్‌అండ్‌బీ రహదారిపై సర్వే నం.234లో 19 అక్రమ నిర్మాణాలున్నాయి. వీటిలో 8 రేకుల షెడ్లు, డాబాలు..

**మూడు పక్కా భవన నిర్మాణాలు.** : కడలి రోడ్డులో సర్వే నంబరు



230లోని కాలువ గట్టుపై ఏడు ప్రాంతాల్లో అక్రమంగా అయిదు రేకుల షెడ్లు, రెండు డాబా ఇళ్లు ఉన్నాయి.


పి.గన్నవరం మార్గంలో సర్వే నం 230, 200లో కడలి కాలువపై 20 ఆక్రమణలుండగా వాటిలో 14 రేకుల షెడ్లు, అయిదు దుకాణాలు.. మామిడికుదురు మండలం మొగిలికుదురులోని ర.భ రహదారిపై పంచాయతీ స్థలాలు 65 చోట్ల ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. సర్వే నం.169, 168, 161, 160లో 11 చోట్ల ఇంటి నిర్మాణాలు, ఒక షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు బియ్యం, ఇనుము, ఇతర చిన్నచిన్న దుకాణాలు నిర్వహిస్తున్నారు. కూడలిలోని ప్రధాన వంతెననూ ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండటం గమనార్హం.

సుందరీకరణతో పరిష్కారం..: తాటిపాక కూడలిలో రహదారి విస్తరించి సుందరీకరణ పనులు చేయడంతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులకు పరిష్కారం చూపనున్నారు. కొన్ని విగ్రహాలను తొలగించి కూడలిలో ప్రత్యేక నిర్మాణం చేసి అక్కడ ఏర్పాటుచేస్తారు. ఈ ప్రాంతాన్ని వివిధ ఆకర్షణీయ కళారూపాలు, విద్యుద్దీపాలతో తీర్చిదిద్దుతారు. త్వరలో ఆక్రమణల తొలగింపు పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు.

# ప్రోత్సాహం.. ముందే సాకారం..!

తిరుపతి: కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి కృతనిశ్చయంతో ఉంది. గత నెలలో ధరలు పతనమవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. తోతాపురికి కిలోకు రూ.4 అదనంగా చెల్లిస్తామని ప్రకటించారు. తాజాగా రైతుల బ్యాంకుల ఖాతాల్లో నగదు జమ చేయాలని నిర్ణయించారు. ఈ నెల 9న జరిగిన కేబినెట్ సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని అన్నదాతలకు రూ.260 కోట్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో దాదాపు 5 లక్షల టన్నుల మామిడి దిగుబడి వచ్చింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో రెండేళ్లుగా పరిశ్రమల్లో ఆడించిన గుజ్జు నిల్వలు ఉన్నాయి. సీజన్ ప్రారంభానికి ముందు సుమారు 2 లక్షల టన్నుల సరకు పేరుకుపోయింది. రాష్ట్ర ప్రభు త్వం బహుళ జాతి సంస్థలతో సంప్రదింపులు జరిపినా వారు కూడా నిల్వలు తీసుకోవడానికి అంగీకరించలేదు. చివరకు ఎగుమతుల పరంగా సర్కార్ సహకరించడంతో దాదాపు 1.60 లక్షల టన్నులు అమ్ముడుపోయింది.

**కలెక్టర్ల చొరవ..** చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్.. పారిశ్రామికవేత్తలపై ఒత్తిడి తేవడంతో 90 శాతం కర్మాగారాలు ఉత్పత్తి ప్రారంభించాయి. రైతులకు నష్టం వాటిల్లకూడదని



కిలో తోతాపురికి రూ.12 కనీస ధర చెల్లించాలని స్పష్టం చేశారు. ఇందులో ప్రభుత్వం రూ.4, కంపెనీలు రూ.8 ఇవ్వాలని ఆదేశించారు.

**ఐదేళ్లు ఒక్క పైసా ఇవ్వని వైకాపా ..** గతంలోనూ తెదేపా ప్రభుత్వం కిలోకు రూ.2.50 చెల్లించి అన్నదాతలను ఆదుకుంది. ఇప్పుడు కూడా ఎవరూ అడగకుండానే రూ.4 ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఐదేళ్ల వైకాపా హయాంలో రెండుసార్లు ధరలు తగ్గినా అప్పటి సీఎం జగన్ కనీసం ఈ అంశంపై సమీక్షించలేదు. 'పెద్దాయన' ఆదేశాలతో పరిశ్రమలు సిండికేట్ అయినా మందలించిన పాపాన పోలేదు. ఈ నెల 9న బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వచ్చిన జగన్.. రోడ్ షోగా వచ్చి విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతుల వద్దకు వెళ్లి కష్టం తెలుసుకోలేదు.

**ఆగస్టులో ఇవ్వాలని అనుకున్నా..**

తొలుత ప్రభుత్వం మామిడి సీజన్ ముగిసిన తర్వాత రైతులకు అదనంగా ప్రకటించిన ధర మేరకు డబ్బులు ఇవ్వాలని భావించింది. ఇప్పటివరకు వచ్చిన వివరాలను పునఃపరిశీలించి జులైలోనే సొమ్ములు ఇవ్వనున్నారు. అదే విధంగా పరిశ్రమల యాజమాన్యాలు కూడా త్వరగా నగదు ఇస్తే రైతాంగానికి ఎంతో ఉపశమనం లభిస్తుంది.

చురకలు



# ‘పోషక్’ భూముల్లో కబ్జాల కంచె

కర్నూలు: కోసిగి మండలం ‘పోషక్ ఫార్మింగ్ ఫారెస్ట్రీ అండ్ ఫైనాన్స్ లిమిటెడ్’ భూములను వైకాపా నేతలు కొందరు పప్పు బెల్లాల్లా పంచేసుకున్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే బావమరిది మురళీమోహన్‌రెడ్డి ఆక్రమించుకొన్న విషయం కొద్ది రోజుల కిందట వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.. తాజాగా మరికొందరు వైకాపా నేతల పేర్లు బయటకొచ్చాయి. కందుకూరులో 16, 18, 20, 25, 139, 190, 161, 164, 189, 192, 241, 242, 100ఎ, 201, 261, 267 సర్వే నంబర్లు, కర్రదొడ్డిలో 13, 14, 15 సర్వే నంబర్లు, బొమ్మలాపురంలో 61, 71, 77, 52 సర్వే నంబర్లలోని భూములను భూములను పోషక్ సంస్థ గతంలో కొనుగోలు చేసింది. ఆయా సర్వే నంబర్లలో ఆన్‌లైన్‌లో ఇతరుల పేర్లు కనిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారుల సహకారంతో ఆన్‌లైన్‌లో పేర్లు మార్చుకొన్నట్లు తెలుస్తోంది. కొందరికి వారసత్వంగా వచ్చినట్లు చూపించారు. అక్రమార్కుల పేర్లతో పాస్ పుస్తకాలను జారీ చేశారు.

**ఎమ్మెల్యే బావమరిది ఆగడాలు**

మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి బావమరిది మురళీమోహన్‌రెడ్డి కందుకూరులోని సర్వే నంబరు 324–2లో 6.52 ఎకరాలు, సర్వే నంబరు–312లో 4.6 ఎకరాలు స్వాధీనం చేసుకొన్నారు. 11.12 ఎకరాల గ్రామ సర్వీసు ఇనాం భూమి ఆయనకు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. అదే గ్రామంలో సర్వే నంబరు 328–2లోని రెండెకరాలు ఆయనకు అనువంశికంగా వచ్చినట్లు దస్త్రాల్లో చూపారు. మురళీమోహన్‌రెడ్డి మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామం కాగా, ఆ ప్రాంతానికి 10 కి.మీ. దూరంలోని కోసిగి మండలం



కందుకూరు గ్రామంలో అనువంశికంగా వచ్చినట్లు భూములు ఉండటం గమనార్హం.

**వీరికీ రాసిచ్చేశారు**

గంగాధరస్వామి మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన పేరుతో కోసిగి మండలం కందుకూరు గ్రామంలో సర్వే నంబరు 324–1లో 5.89 ఎకరాలు, సర్వే నంబరు 312లో 4.6 ఎకరాల గ్రామ సర్వీస్ ఇనాం భూమి ఉంది. అతని కుటుంబం గ్రామానికి ఎలాంటి సేవలు అందించలేదని, ఆయనకు గ్రామ సర్వీస్ ఇనాం భూమిని ఎలా కేటాయించారో అధికారులకే తెలియాలి. ఆ రెండు సర్వే నంబర్లలోని భూమిని 2023లో ఫ్రీహోల్డ్ చేశారు.గంగాధర స్వామికి కందుకూరు గ్రామంలోని సర్వే నంబరు 49–1లో 4.28 ఎకరాలు, 49–ఎ సర్వే నంబరులో 0.78 ఎకరాలు, 328–1 సర్వే నంబరులో 3 ఎకరాలు అనువంశికంగా వచ్చినట్లు చూపారు. 269–బిలో ఒక ఎకరం భూమి డీపట్టా ఉన్నట్లు రికార్డులో నమోదు చేశారు. గంగాధర స్వామికి అనువంశికంగా వచ్చిన భూములను, సర్వీసు ఇనాం భూములు అన్నింటికీ కలిపి 2023 ఫిబ్రవరి 21న మ్యూటేషన్ జరగడం గమనార్హం.

కందకూరు గ్రామంలో కోసిగి మండల వైకాపా కన్వీనర్ బెట్టన గౌడ పేరుతో సర్వే నంబరు 16/1లో 9.15 ఎకరాలు, 100ఎలో 3 ఎకరాలు, 201లో ఒక ఎకరం భూమి వారసత్వంగా వచ్చినట్లు చూపారు. ఆయా సర్వే నంబర్లు పోషక్ సంస్థకు చెందిన సర్వే నంబర్లలో ఉన్నాయని విశ్రాంత డీఎస్పీ భాస్కర్‌నాయుడు ఆరోపిస్తున్నారు.

# అరణ్యం వదిలిన చిరుతలు

ఆత్మకూరు : నల్లమలలో పెద్ద పులులు, చిరుతల సంఖ్య పెరిగింది.. ఒక మగ పులి 100 చదరపు కి.మీ. మేర తన సామ్రాజ్యంగా హద్దుల్ని నిర్దేశించుకొంటుంది. ఆ పరిధిలో చిరుతలు తిరగడానికి ఇష్టపడవు.. నల్లమల ప్రాంతంలో ప్రస్తుతం 90 వరకు పెద్ద పులులు ఉన్నాయి.. వీటి సంఖ్య పెరగడంతో బతుకుజీవుడా అంటూ చిరుతలు అరణ్యం వదిలి.. ఆరుబయటకొచ్చేస్తున్నాయి. పశ్చిమ ప్రాంతంలో ఎక్కువగా కొండలు, గుట్టలు ఉన్నాయి. చిరుతల ఆవాసానికి అనువుగా ఉండటంతో ఇక్కడికి వలస బాట పట్టాయి. నల్లమలను వీడిన చిరుత పులులు శ్రీశైలం, సున్నిపెంట, బైర్లూటి, సంజీవనగర్‌తండా, మహానంది, బనకచర్ల, కోసిగి ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. గుట్టల్లో దాగి ఉంటూ పశువులు, కుక్కలు, జింకలను వేటాడుతున్నాయి. అడ్డొచ్చిన రైతులపై దాడులకు దిగుతున్నాయి. వీటి నుంచి ప్రాణాలు కాపాడుకోవడం రైతులకు సవాలుగా మారింది. కొన్ని జాగ్రత్తలు తీసుకొని సమాచారం ఇవ్వాలని ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా సూచిస్తున్నారు.

**వీధి కుక్కలంటే ఇష్టం**



చిరుత పిల్లి జాతికి చెందింది. వేగంగా కదిలే జంతువు. దీని జీవిత కాలం 21–23 ఏళ్లు.. కానీ చాలావరకు 12–17 ఏళ్లే జీవిస్తాయి. ఇది మహా సిగ్గరి. మనుషుల కంట పడేందుకు ఇష్టపడదు. ఒంటరిగా నివాసం ఉండాలని చూస్తుంది. జనావాసాల్లోకొస్తే అలజడి సృష్టిస్తుంది. ఇవి గొర్రెలు, జింకలు, మేకలు, అడవి పందులు, కుక్కలను వేటాడుతుంటాయి. వీధి కుక్కల మాంసాన్ని ఇష్టంగా తింటాయి. చిరుతలు 2–3 పిల్లలకు జన్మనిస్తాయి. జీవన పోరాటంలో ఇతర జంతువులు వాటి పిల్లల్ని చంపేస్తాయి.

**చేతులు పైకెత్తి వెనక్కి నడవాలి**

మనుషులు ఎదురైనా దూరాన్ని బట్టి చిరుత దాడికి దిగుతుంది. చిరుత కనిపిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తిరిగి పరుగెత్తవద్దు.. పొదల చాటున దాక్కోవడం వంటివి చేయకూడదు. అలాంటప్పుడే మనుషులపై దాడికి దిగుతుంది.ఆకారంలో తనకంటే పెద్దగా ఉన్న జంతువులపై చిరుతలు దాడి చేయవు. దీన్ని దృష్టిలో పెట్టుకొని చిరుత ఎదురైనప్పుడు చేతులు పైకి పెట్టి అరుస్తూ నెమ్మదిగా వెనక్కి నడవాలి. చిరుతలు సాధారణంగా జంతువుల వీపు భాగాన దాడులు చేస్తాయి. వీపుపై ఫేస్‌మాస్క్ (మనిషి ముఖం లేదా తలను పోలిన ముసుగు) ధరిస్తే దాడి నుంచి బయటపడొచ్చు.

# మారనున్న ‘వీధి’రాత




నర్సీపట్నం : వీధి వ్యాపారులకు శాశ్వత చిరునామా చూపడంలో పురపాలక సంఘాలు వెనుకబడ్డాయి. వీధి వ్యాపారుల విక్రయ కేంద్రాలు (హాకర్స్ జోన్స్) ప్రతిపాదనలకే పరిమితయ్యాయి. పోలీసులు, ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక తదితర విభాగాల సిబ్బంది అదిలింపులు, బెదిరింపులకు తలొగ్గుతూ రహదారులకు ఇరువైపులా కాయగూరలు, పండ్లు, పూలు, తినుబండారాలు విక్రయిస్తూ జీవనం సాగించే వారంతా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రముఖుల పర్యటనలున్నా, భారీ సభలు ఏర్పాటవుతున్నా తొలువ మూతపడేది వీరి వ్యాపారాలే. తమకు శాశ్వత చిరునామా చూపాలని పలుమార్లు విన్నవించడంతో కూటమి ప్రభుత్వం స్పందించింది. వీధి వ్యాపారులు ఎందరున్నారో లెక్క తేల్చేందుకు పురపాలక సంఘాల్లో సర్వే జరుగుతోంది. నర్సీపట్నంలో నిర్వహించిన సర్వేలో ఇప్పటివరకు 1,043 మందిని గుర్తించారు. గతంలో 670 మంది ప్రభుత్వం నుంచి రుణాలు పొందారు. తమకు వ్యాపారమే జీవనాధారమని 705 మంది సచివాలయాల సిబ్బందికి తెలిపారు. వీరికి గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాలు అందించేందుకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. 2014–19 మధ్య తెదేపా అధికారంలో ఉన్నప్పుడు వీధి వ్యాపారుల కోసం సర్వే జరిగింది. వ్యాపారాలు చేసుకోవడానికి వీలుగా గ్రీన్‌జోన్ల ఎంపిక జరిగినా వ్యాపారులను ఆ ప్రాంతాలకు పంపడంలో శ్రద్ధ చూపలేదు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే పూర్తయిన తర్వాత జోన్ల ఏర్పాటుపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించనున్నారు. నెలాఖరు లోగా సర్వే పూర్తయ్యే ఆస్కారముంది.

ఎలమంచిలిలో గతంలో 600 మంది వీధి వ్యాపారులకు ప్రభుత్వం రుణాలు ఇప్పించింది. తాజా సర్వేలో మరో 814 మంది వీధి వ్యాపారులను గుర్తించారు. వీరందరికీ కొత్తగా గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారు. ఇప్పటికే 70 మంది కార్డులు పొందేందుకు రుసుం చెల్లించారు. ఎలమంచిలి పరిసర మండలాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండటంతో కొంతమంది చిరు వ్యాపారులు పరిశ్రమల్లో పనులకు వెళ్తున్నారు. గతంలో వ్యాపారాలకు వీలుగా జోన్లు గుర్తించినప్పటికీ అక్కడకు వెళ్లేందుకు చాలామంది ఆసక్తి చూపలేదు. ఇప్పటికీ ఎక్కువమంది రహదారులపైనే వ్యాపారాలు చేసుకుంటున్నారు. **ఏ జోన్ ఎందుకంటే..**

గ్రీన్ జోన్‌గా అధికారులు గుర్తించిన ప్రాంతాల్లో వీధి విక్రయ కేంద్రాలను వ్యాపారులు నడుపుకోవచ్చు. యాంబర్ జోన్లలో నిర్ణీత సమయాల్లో మాత్రమే వ్యాపారాలకు అనుమతిస్తారు. రెడ్ జోన్లలో వీధి వ్యాపారాలు నిషిద్ధం. కూరగాయలు, పండ్లు, తినుబండారాలు, పూలు తదితరాలు అమ్ముకునే వారు జనం ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఉండాలని కోరుకోవడం సహజం. రోడ్లు ఇరుకుగా మారడంతో చిరు వ్యాపారులకు ఇబ్బందిగా మారింది. వీరి వ్యాపారాలు సజావుగా సాగేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

# రూ.కోట్లు కొల్లగొట్టి.. అనర్హులకు కట్టబెట్టి..



కాకినాడ : వైకాపా హయాంలో పేదల ఇళ్ల పేరుతో పెద్దలు స్థిరాస్తి వ్యాపారం చేసుకున్నారు. ప్రభుత్వానికి, లబ్ధిదారులకు మధ్య దళారులుగా అవతారమెత్తి రూ.వందల కోట్లు దోచుకున్నారు. భూముల కొనుగోలు నుంచి మెరక పనుల వరకు అందినకాడికి వెనకేసుకున్నారు. ఇళ్ల స్థలాలను అనుయాయులకు కట్టబెట్టుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జగనన్న కాలనీల పేరిట జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. కూటమి సర్కారు ఈ అడ్డగోలు వ్యవహారాలపై సాగించిన ప్రాథమిక విచారణలో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.

**అక్రమాల విలువ దాదాపు రూ.652 కోట్లు**

ఉమ్మడి జిల్లాలో ‘పేదలందరికీ ఇళ్లు’ పథకంలో భాగంగా 2.54 లక్షల మందికి ప్రభుత్వ భూములతో పాటు 6,967 ఎకరాల ప్రైవేటు భూములు అప్పట్లో సేకరించారు. వీటి కొనుగోలులో నేతలు అక్రమాలకు తెరలేపారు. మార్కెట్ విలువకు మించి, రేట్లు పెంచి అధికారుల నుంచి నేతల వరకు వాటాలు పంచుకున్నారు. సుమారు రూ.652 కోట్ల వరకు అదనపు లబ్ధి పొందినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మరోవైపు ముంపు ప్రాంతాల్లోని కాలనీలను గ్రావెల్‌తో చదును చేసే పనుల పేరిట రూ.వందల కోట్లు కొల్లగొట్టేశారు. దీనిపైనా విచారణ సాగుతోంది. మరో వైపు ఎన్నికల్లో లబ్ధికి అర్హత లేకున్నా వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం గమనార్హం. కొన్నిచోట్ల స్థానిక నేతలు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూళ్లు చేశారు.

కాకినాడ జిల్లాలోనే అయిదు వేల మందికి పైగా అనర్హులున్నట్లు తేలింది. తూర్పుగోదావరి జిల్లాలో 991 మందికి అర్హతలు లేకున్నా ఇళ్ల పట్టాలిచ్చారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అనర్హుల వివరాలు బయటపెట్టకుండా గోప్యత పాటిస్తున్నారు.

**కాకినాడలోనే అనర్హులు అధికం..**

గత ప్రభుత్వంలో 2020 నుంచి 2024 ఎన్నికల ముందు వరకు పట్టాల పంపిణీ ప్రహసనంలా సాగింది. ఓట్ల కోసం ఆరు దశల పరిశీలన (సిక్స్ స్టెప్ వెరిఫికేషన్) చేయకుండానే తమ పార్టీ కార్యకర్తలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. అలాంటి వారిలో చాలామంది గృహాలు నిర్మించుకోకుండా వాటిని ఇతరులకు అమ్మి సొమ్ముచేసుకున్నారు.

కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో అత్యధికంగా 1,208 మంది అనర్హులున్నట్లు గుర్తించారు. జగ్గంపేట మండలంలో 940, పెదపూడి మండలంలో 416, తాళ్లరేవు మండలంలో 392, కాకినాడ గ్రామీణంలో 313, రౌతులపూడిలో 240 మంది అర్హతలు లేకున్నా పట్టాలు పొందారు.

తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలో 292, సీతానగరం మండలం 195, రాజమహేంద్రవరం పట్టణంలో 124, దేవరపల్లి మండలంలో 107 మందికి అనర్హుల చేతిలో ఇళ్ల స్థలాలున్నట్లు గుర్తించారు.

గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలపై సచివాలయ సిబ్బందితో గతంలోనే ప్రాథమిక విచారణ చేశాం. అర్హులు..అనర్హుల జాబితాతో కూడిన నివేదికలు ప్రస్తుతం తహసీల్దారు లాగిన్‌లో ఉన్నాయి. మరోసారి తనిఖీలు చేపట్టి పూర్తిస్థాయిలో విచారణ నివేదికను ప్రభుత్వానికి పంపిస్తాం.

అని కాకినాడ డీఆర్వో వెంకటరావు అన్నారు.

# కోకో రైతుకు ఆ‘ధర’వు

రాజమహేంద్రవరం: సరైన ధర లేక ఇబ్బంది పడుతున్న కోకో రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రైతుల నుంచి కిలో రూ.450కు ప్రైవేటు సంస్థలు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అదనంగా రూ.50 చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. జిల్లాలో దాదాపు 12 వేల ఎకరాల్లో కోకో సాగవుతుండగా సుమారు 4వేల మెట్రిక్ టన్నుల గింజల దిగుబడి వస్తుందని అంచనా. ఇంకా విక్రయించని రైతుల వివరాలను మూడు రోజులపాటు అధికారుల బృందం క్షేత్రంలో పర్యటించి సేకరించారు. 530 మెట్రిక్ టన్నుల మేర రైతుల వద్ద నిల్వలున్నాయని గుర్తించి వాటిని తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

**200 మెట్రిక్ టన్నుల సేకరణ..**

తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వం అదనపు ధర నిర్ణయించిన తరువాత 392 మంది రైతులకు చెందిన 200 మెట్రిక్ టన్నుల నిల్వలను కొనుగోలు చేయించారు. 1,024 మంది రైతులకు చెందిన మరో 331 మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారిణి బి.సుజాతకుమారి, ఏపీఎంఐపీడీసీ జిల్లా అధికారి దుర్గేశ్ తదితరులకు కలెక్టర్ ప్రశాంతి సోమవారం ఆదేశించారు. ఒకటి రెండ్రోజుల్లో మొత్తం నిల్వల సేకరణ పూర్తవాలన్నారు. ప్రభుత్వం కిలో గింజలకు చెల్లించే రూ.50 అదనపు మొత్తం వల్ల జిల్లాలో 1,416 మంది రైతులకు రూ.2.65 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. వర్షాలు కురిసేలోగా సేకరణ పూర్తి చేస్తామని జిల్లా ఉద్యానశాఖాధికారిణి తెలిపారు. ఇక కాకినాడ జిల్లాలో 80 టన్నుల



మేర కొనుగోలుకు చర్యలు చేపట్టారు.

**కోనసీమలో 70 మెట్రిక్ టన్నులు**

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో దాదాపు 2,500 ఎకరాల్లో కోకో సాగు చేస్తుండగా సుమారు 800 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతుందని అంచనా. ప్రభుత్వం కిలోకు రూ.50 అదనంగా చెల్లిస్తామని ప్రకటించగా.. ఆ సమయానికి 226 మంది రైతుల నుంచి 70 కిలోలు సేకరించాలని అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట, అయినవిల్లి, రావులపాలెం, కె.గంగవరం మండలాల పరిధిలో 168 మంది రైతుల నుంచి 43 మెట్రిక్ టన్నుల గింజలు తీసుకున్నారు. రెండ్రోజుల్లో కొత్తపేట, అయినవిల్లి, రావులపాలెంలో సేకరిస్తామని జిల్లా ఉద్యానశాఖాధికారి బి.వి.రమణ తెలిపారు. ప్రభుత్వం కిలోకు చెల్లించే అదనపు ధర వల్ల రైతులకు రూ.35 లక్షల మేర లబ్ధి చేకూరనుంది.

# పోనీ.. అడగరులే కానీ

పాలకొల్లు : జిల్లాలో రవాణాశాఖ తనిఖీలు పడకేశాయనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో రవాణశాఖ కార్యాలయాలున్నాయి. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు లెర్నింగ్ లైసెన్సులు, వాహన సామర్థ్య పరీక్షలు నిర్వహించేందుకే పరిమితమవుతున్నారు. అక్రమంగా చలామణి అవుతున్న వాహనాలను, సరైన కాగితాలు లేకుండా తిప్పుతు న్న లారీలను నియంత్రించడంలో విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. రోడ్లపై మట్టి, ఇసుకతో దూసుకుపోతున్న ట్రాక్టర్లు నడిపేవారిలో 50శాతం మందికి కూడా లైసెన్సులు ఉండటం లేదు. ఆటోల విషయమైతే చెప్పనవసరం లేదు. ప్రయాణికులు వెళ్లే ఆటోలో లోడు రవాణా చేస్తుంటారు. లోడు తీసుకెళ్లేవాటిలో జనాన్ని తీసుకెళ్తుంటారు. ఇది 216వ జాతీయ రహదారిపై రొయ్యల ఎగుమతి కోసం వెళ్తున్న లారీ. రవాణా నిమిత్తం లారీకి శీతల గది ఉన్నా వెనుక భాగంలో ఖాళీ ట్రేలను కట్టి మరీ నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్తున్నారు.



ట్రేలకు కట్టిన తాడు తెగినా, కుదుపుల్లో ట్రే పైకి ఎగిరి కిందపడినా వెనుక వచ్చే వాహనదారులకు ఎంత ప్రమాదమో ఊహించవచ్చు. జిల్లాలో నిత్యం ఇటువంటి లారీలు వందల సంఖ్యలో తిరుగుతున్నా ఒక్కటీ పట్టుకున్న దాఖలాలు లేవు.

ఆకివీడులో ఈ నెల 15న మద్యం మత్తులో ఒక యువకుడు కారుతో వీరంగం సృష్టించాడు. జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని, మరో మహిళను ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రగాయాల పాలయ్యారు. నరసాపురంలోను ఇటీవల కాలంలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. తనిఖీలు నిర్వహించి మందుబాబుల అరాచకాలను అరికట్టిన సందర్భాలు లేవు.

**భయపెడుతున్న టిప్పర్లు..** రహదారిపై టిప్పర్ కనిపించిందంటే ప్రజలు ఆందోళనకు గురయ్యే పరిస్థితులున్నాయి. యలమంచిలి మండలం అడవిపాలెంలో మే 28న అతివేగంగా దూసుకొచ్చిన ఇసుక లోడు టిప్పర్ రోడ్డు పక్కన నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రక్కుతో సహా తిరగబడింది. డ్రైవర్ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ప్రమాదం దూసుకొస్తే తప్ప రవాణా, పోలీసు సిబ్బంది అటువైపు కూడా చూడటం లేదు. కార్యాలయాల నుంచి బయటకు వచ్చి తనిఖీలు ముమ్మరం చేస్తే తప్ప ప్రమాదాలను, నిబంధనల ఉల్లంఘనను నియంత్రించలేరని పలువురు వాపోతున్నారు. దీనిపై భీమవరం రవాణా శాఖాధికారి ఉమామహేశ్వరరావును సంప్రదించగా లక్ష్యసాధనకు కృషి చేస్తున్నామన్నారు. తనిఖీలను ముమ్మరం చేస్తామని చెప్పారు.

# ఆ మూడు.. అభివృద్ధి తోడు

ఏలూరు: జిల్లాలో మూడు రాష్ట్ర రహదారులను ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో అభివృద్ధి చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వాటి స్థితిగతులపై సర్వే పూర్తయింది. సవివర ప్రణాళికలు(డీపీఆర్) తయారుచేసే బాధ్యతను ఓ కన్సల్టెన్సీకి అప్పగించారు. అవి అందగానే ప్రభుత్వ ఆమోదానికి పంపి రహదారుల నిర్మాణం, నిర్వహణకు టెండర్లు పిలవాలని యోచనలో రహదారులు, భవనాలశాఖ అధికారులు ఉన్నారు.

జాతీయ రహదారుల ప్రమాణాలను అనుసరించి వాటికి దీటుగా జిల్లాలో 3 రహదారులు అభివృద్ధి చేసి వాటిల్లో టోల్ రుసుములు విధానం పెట్టాలనేది ప్రభుత్వ యోచనగా ఉంది. పనులు దక్కించుకున్న గుత్తేదారే నిర్మాణం చేపట్టి కొన్నాళ్లపాటు నిర్వహిస్తారు. ఆ కాలంలో టోల్ రుసుములను నిర్మాణ సంస్థ వసూలు చేసుకుంటుంది. వ్యవధి పూర్తయ్యాక ప్రభుత్వ అధీనంలోకి రాగానే టోల్ భారం తీసేస్తామని ఆర్ అండ్ బీ వర్గాలు తెలిపాయి. నిర్మాణ వ్యయాలన్నీ గుత్తేదారే భరిస్తారు. రి ఇవి అభివృద్ధి చెందితే జిల్లా నుంచి ఆయా ప్రాంతాలకు తక్కువ వ్యవధిలో చేరుకుంటారు. మార్గంలో ప్రధాన పట్టణాల వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్లు, నిఘా కెమెరాలతో పాటు వేగాన్ని నిరోధించే కెమెరాలు ఏర్పాటు చేస్తారు.

ప్రయాణ దూరాభారం తగ్గుతుంది. ఒక వైపు హైదరాబాద్, మరోవైపు విశాఖ, ఇంకోవైపు చెన్నై వైపు వెళ్లటానికి వీలుగా ఈ రహదారులను జిల్లా నుంచి ప్రతిపాదించారు. ఇవి అందుబాటులోకి వస్తే రాకపోకలు పెరిగి వ్యాపార లావాదేవీలతో జిల్లాకు ఆదాయం సమకూరుతుందని అంచనా.

ఇప్పటికే నిర్వహించిన సర్వేలో దారి పొడవునా ఎన్ని మలుపులు, ఎత్తుపల్లాలు ఉన్నాయో గుర్తించారు. గతంలో ఎక్కడెక్కడ బ్లాక్ స్పాట్లు గుర్తించారో ఆ ప్రదేశాల్లో మరిన్ని జాగ్రత్తలు తీసుకుని నిర్మాణం చేపట్టేలా సర్వే సాగినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రస్తుత 7 మీటర్ల వెడల్పు కలిగి రెండు వరుసల రహదారులుగా అధ్వానంగా ఉన్న వీటిని 10 మీటర్లకు పెంచి వెడల్పు చేసేలా ప్రతిపాదించారు. రహదారి వెడల్పు కావటంతో ఇటుగా ప్రయాణించే వాహనాలు బాగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

ఆ మూడు రహదారులివీ.. వాటి పరిధి ఇలా

1. ఏలూరు–మేడిశెట్టివారిపాలెం 70.98 కి.మీ
2. ఏలూరు–జంగారెడ్డిగూడెం 52 కి.మీ
3. నరసాపురం–అశ్వారావుపేట 118 కి.మీ

# తరగని.. తోతాపూరి కష్టాలు

పాకాల : ప్రభుత్వం పెట్టుబడి రాయితీ ఇచ్చి సహకరిస్తున్నా మామిడి రైతుల కష్టాలు తీరడం లేదు. కోత కూలీలు రాక, మార్కెట్‌కు కాయలు తరలించేందుకు ట్రాక్టర్లు దొరక్క తంటాలు పడుతున్నారు. ముందస్తు బుకింగ్ టోకెన్ దక్కించుకుని గుజ్జు పరిశ్రమలకు కాయలు తరలించినా వాటిని దింపే పరిస్థితి కనిపించడం లేదు. మ్యాంగోనగర్ పరిసరాల్లోని ర్యాంపుల వద్ద సైతం వందలాదిగా ట్రాక్టర్లు నిలిచిపోయాయి.

**పెట్టుబడి రాయితీకి అడ్డదారులు**

ఒకరోజు ముందు అనుమతి పొందిన వారికి ఓ వ్యాపారి టన్ను తోతాపురి కాయలను రూ.4 వేలకు కొంటున్నారు. మిగతాచోట్ల రూ.3 వేలతోనే సరిపెడుతున్నారు. ప్రభుత్వం అందించే పెట్టుబడి రాయితీ కోసం 1బి, ఇతర వివరాలు తెస్తున్నా రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో రైతులు వాటిని ర్యాంపు యజమానుల చేతికిస్తున్నారు. వారు వాటిని పక్కనపడేసి రాయితీ కాజేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు.

# జల్‌జీవన్‌కు గ్రహణం

గుత్తి : జల్‌జీవన్ పథకం అమలు కోసం గ్రామీణులు ఎదురుచూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పథకానికి నిధులు ఇచ్చినా గత వైకాపా సర్కారు తన వాటా నిధులు ఇవ్వకుండా పథకం పనులను నిలిపివేసింది. తొలి, మలిదశల్లో మంజూరైన పనులు చాలా గ్రామాల్లో పడకేశాయి. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో ప్రధానంగా రెండో విడత పనుల కోసం ప్రజలు నిరీక్షిస్తున్నారు. అనేక గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం నానాపాట్లు పడుతున్నారు. మూడు నియోజకవర్గాల్లో రూ.156.55 కోట్లతో పనులను చేపట్టాల్సి ఉంది. 2022 లోనే పనులు మంజూరు చేశారు. ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వలేకపోయింది. కేంద్రం ఇచ్చిన నిధులను ఇతర అవసరాలకు వాడుకుంది.



**సమగ్ర నివేదిక ఇలా...**

గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాలకు గార్లదిన్నెలోని ఎంపీఆర్ డ్యాం నుంచి నీరు ఇవ్వనున్నారు. డ్యాం నుంచి గ్రామాలకు పైపులైన్లను విస్తరించాల్సి ఉంది. తాడిపత్రి నియోజకవర్గానికి గండికోట నుంచి నీరు ఇవ్వడానికి ప్రణాళిక రూపొందించారు. ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు పీఏబీఆర్ నుంచి నీరు ఇవ్వాలని సమగ్ర నివేదిక రూపొందించారు.

**స్వయం సహాయ సంఘాలతో..**

గత ప్రభుత్వం నిధులు ఇవ్వకుండానే పనులు చేయించడానికి స్వయం సహాయ సంఘాల మహిళలకు కాంట్రాక్టు విధానంపై శిక్షణ ఇప్పించింది. గ్రామాల్లోని నీటి పథకాలను బలోపేతం చేసి.. పైపులైన్లు వేసి ప్రతి ఇంటికి కుళాయిలను ఇవ్వాల్సి ఉంది. తొలివిడతలో సైతం పెద్దగా పనులు జరగలేదు. రెండో విడతలో జరిగితే గ్రామీణులకు ప్రయోజనం చేకూరుతుంది.దీనిపై గుత్తి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రెహెనా వాసీం మాట్లాడుతూ పాత పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా మంజూరు ఉత్తర్వులు ఇచ్చి.. టెండర్లు పిలవాల్సి ఉంది. టెండర్లు పూర్తవ్వగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

# రూపు మారే.. కలత తీరే..


ముమ్మిడివరం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ వసతి గృహాల్లో ఉండేవారిలో ఇంచుమించు అందరూ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే. మండల కేంద్రాలు, పట్టణల్లో పేద విద్యార్థులు మెరుగైన విద్యావకాశాలు పొందేలా ఏర్పాటు చేసిన వీటిని గత వైకాపా పాలకులు విస్మరించారు. కూటమి అధికారంలోకి వచ్చాక అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతో నిధులు విడుదల చేసింది. వసతి గృహాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో పిల్లల్ని చేర్పించాలని సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు.

**జిల్లాలో పరిస్థితి ఇదీ..**

జిల్లాలో అయిదో తరగతి నుంచి పదో తరగతి వరకు 23 ఎస్సీ, 9 బీసీ వసతి గృహాలు ఉన్నాయి. ఎస్సీ వసతి గృహాలు ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. బీసీ వసతి గృహాల్లో నాలుగు ప్రభుత్వ భవనాల్లో, అయిదు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

**గత సర్కారు నిర్వాకంతో ముందుకు రాని గుత్తేదారులు**

ప్రస్తుతం జిల్లాలోని 22 ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.4.93 కోట్లు విడుదల చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో



ఎదురైన పరిణామాల కారణంగా గుత్తేదారులు కొన్ని పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. గతంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో 21 చోట్ల టెండర్లు ఖరారు కావడానికి చాలా సమయం పట్టింది. ఒకటి నుంచి మూడు సార్లు టెండర్లు పిలిస్తేగాని గుత్తేదారులు స్పందించలేదు. రావులపాలెం వసతి గృహంలో రూ.15 లక్షలతో మరమ్మతు పనులకు ఏడు సార్లు టెండర్లు పిలిచినా నేటికీ ఖరారు కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. టెండర్లు పూర్తయిన అన్ని వసతి గృహాల్లో 90 శాతం పనులు పూర్తయ్యాయి.

**మౌలిక వసతులు కల్పిస్తూ..**

అమలాపురం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, రాజోలు మండలాల్లోని 13 వసతి గృహాల్లో పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. గదుల మరమ్మతులు, పంకాలు, దోమలు రాకుండా కిటికీలకు మెస్‌లు, గుమ్మాలు, కిటికీలు, తలుపుల ఏర్పాటు వంటి పనులు చేపట్టారు. గచ్చులను టైల్స్‌తో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన వాటికి మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికే పాఠశాలలు తెరిచిన నేపథ్యంలో వసతి గృహాలకు ఈనెలాఖరు నాటికి విద్యార్థులు చేరుకునే అవకాశం ఉంది.

**వేగంగా పూర్తి చేశాం..-సుబ్బరాజు, ఈఈ, ఏపీఎస్‌డబ్ల్యూఐడీసీ**

పాఠశాలలు తెరిచేనాటికి వసతి గృహాల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేశాం. టెండర్లు ఆలస్యమైనా గుత్తేదారులతో వేగంగా పనులు చేయించాం. ఇప్పటికే 13 వసతి గృహాల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన వాటిలో 10 శాతం పనులు మిగిలి ఉన్నాయి. మూడునాలుగు రోజుల్లో పనులు పూర్తి చేస్తాం.

# పరిశ్రమల్లో భద్రతకు పాతర!



హిందూపురం : ఉమ్మడి అనంత జిల్లాలో స్టీలు పరిశ్రమలకు ప్రసిద్ధి చెందిన హిందూపురంలోని తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడల్లో కార్మికులకు భద్రత కరవైంది. వారికి హెల్మెట్, బూట్లు, బ్లౌజ్, మాస్కు, మంచినీరు అందుబాటులో ఉంచాలి. పలుచోట్ల ఎలాంటి రక్షణ లేకుండానే విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఆ సమయంలో ప్రమాదాలు చోటు చేసుకొంటే ప్రాణాలకే ముప్పు. పర్యవేక్షణకు సేఫ్టీ అధికారిని నియమించుకోవాలి.. చాలాచోట్ల అధికారి కనిపించటం లేదు.

**తనిఖీలు ఏవి?..** స్టీలు, రసాయన పరిశ్రమలను తరచూ తనిఖీ చేస్తూ భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా ? అనేది పరిశీలించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులు ఇచ్చి విచారించాలి. తనిఖీలు లేవు, తాఖీదులు కనపడవు.

**వలసదారులే అధికం**

ఇక్కడ పని చేయడానికి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఎక్కువగా వస్తుంటారు. ప్రమాదాల బారిన పడుతున్నారు. కార్మికులు మృతి చెందినా వెలుగుచూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వలసకార్మికుల చట్టం అమలు చేయాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

**కొన్ని ఘటనలు ఇలా..**

ఈనలె 10న తూముకుంట పారిశ్రామిక వాడలోని మీనాక్షి స్టీల్ పరిశ్రమ రోలింగ్ విభాగంలో ప్రమాదం చోటు చేసుకొని బిహార్ కార్మికుడు చోటుయాదవ్ మృతి చెందాడు.

గతేడాది మార్చిలో ఫ్లోకిమ్ రసాయన పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు హనుమంతప్ప చేతిపై రసాయనాలు పడి తీవ్రంగా గాయపడ్డాడు.తూముకుంట పారిశ్రామిక వాడలో రొల్వేల్ కన్వేయర్స్ పరిశ్రమలో రామాంజనేయులు కుడిచెయ్యి యంత్రంలో చిక్కుకొని రెండు వేళ్లు దెబ్బతిన్నాయి.

2023, మార్చిలో శ్యాంఫెరస్ అలైస్ స్టీలు పరిశ్రమలో గౌరిబిదనూరుకు చెందిన కార్మికుడు వెల్డింగ్ పనిచేస్తుండగా విద్యుదాఘాతం చోటు చేసుకొని చనిపోయాడు.

**భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు - రాధాకృష్ణ, పరిశ్రమల సేఫ్టీ జిల్లా అధికారి**

పరిశ్రమల యజమానులు తప్పని సరిగా భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకొంటాం. అధిక ఉష్ణోగ్రత విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు తప్పని సరిగా రక్షణ చర్యలు కల్పించాలి. సేఫ్టీ అధికారిని ప్రతి పరిశ్రమ నియమించుకొనేలా ఆదేశాలు జారీ చేస్తాం.

# కృష్ణదేవరాయా.. ప్రవేశాలు పెరిగేనా?



గుంతకల్లు :శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 33 పీజీ కోర్సులున్నాయి. గతేడాది అప్లయిడ్ మ్యాథమాటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, వ్యాయామ విద్య విభాగాల్లో కనీసం ఒక్క విద్యార్థి చేరలేదు.

పాలిమర్ సైన్స్‌లో ఒకరు, వయోజనవిద్య విభాగంలో ఇద్దరు, తెలుగు, హిందీ, గ్రామీణాభివృద్ధి విభాగంలో ముగ్గురు చొప్పున విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరారు. ఐదేళ్ల క్రితం ఆయా విభాగాల్లో ప్రవేశాలు లభించడమే కష్టంగా ఉండేది. ర్యాంకులు వచ్చిన వారికే సీట్లు దక్కేవి. కొన్నేళ్లుగా సగం సీట్లు కూడా భర్తీకాని దుస్థితి.

విశ్వవిద్యాలయ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గుతున్నాయి. వర్సిటీలో 33 గ్రూపులు, 1064 పీజీ సీట్లు ఉన్నాయి. గతేడాది 296 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ఆర్ట్స్‌లోనే కాదు.. సైన్స్ కోర్సుల్లో ఇదే పరిస్థితి. సైన్స్ గ్రూపుల్లో 18 విభాగాలకు 454 సీట్లు ఉండగా 206 భర్తీ అయ్యాయి. ఆర్ట్స్ గ్రూపుల్లో 610 సీట్లకుగాను కేవలం 90 భర్తీ కాకపోవడంతో వర్సిటీ వెలవెలబోతోంది. 2023లో కేవలం 306 మంది ప్రవేశాలు పొందారు. ఈ ఏడాది పీజీసెట్ ఇటీవల ముగిసింది ఈసారైనా పెరుగుతాయో.. లేదో చూడాలి.

**వైకాపా ప్రభుత్వ నిర్ణయాలతో..**

గతంలో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎస్కేయూలోనే ప్రవేశపరీక్ష నిర్వహించేవారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపేవారు. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశపరీక్ష పేరుతో పీజీసెట్ నిర్వహిస్తూ వచ్చింది. దీంతో సీటు ఏ విశ్వవిద్యాలయంలో వస్తుందో తెలియని పరిస్థితి. దూరంగా ఉన్న జిల్లాల విద్యార్థులు ఎస్కేయూకి రావడానికి ఇబ్బందిగా మారింది. గత తెదేపా పాలనలో విద్యార్థులకు అందించే బోధన ఫీజులు, ఉపకారవేతనాలు.. వర్సిటీ ఖాతాలో జమ చేసేవారు. వైకాపా ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేసేది. సక్రమంగా జమ చేయకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి భారంగా మారింది.

**ఆచార్యుల కొరత..**

తగిన సంఖ్యలో ఆచార్యులు, సహాయ ఆచార్యులు లేక బోధన కుంటుపడుతోంది. ఇది కూడా ప్రవేశాలపై ప్రభావం చూపుతోంది. వివిధ విభాగాల్లో 300 పైగా ఖాళీలు ఉండగా.. ప్రస్తుతం రెగ్యులర్ ఆచార్యులు 45 మంది, కాంట్రాక్టు ప్రాతిపదికన 110 మంది పని చేస్తున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయలేదు. కూటమి ప్రభుత్వమైనా వర్సిటీకి పూర్వవైభవం తీసుకొచ్చి.. బోధన ఉద్యోగాలు భర్తీ చేస్తుందని విద్యార్థులు, విద్యావేత్తలు ఆశిస్తున్నారు.

# పుష్కరం... విస్త‘రణం’



రాజమహేంద్రవరం : రానున్న పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో రోడ్లు విస్తరణ చేయాలని నగరపాలక సంస్థ నిర్ణయించింది. దీంతో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు భావించి ఆక్రమణలపై దృష్టి సారించారు. మూడు నెలల కిందట రోడ్డు, కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రణాళిక రూపొందించారు. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

**ఇలాగైతే ఎలా..**

నగరంలో తొలుతగా రెండు దశల్లో రోడ్ల విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. ఫేజ్ -1లో తూర్పురైల్వే స్టేషన్ రోడ్డు, మోరంపూడి రోడ్డు, గుండువారి వీధి, కోరుకొండ, గాదాలమ్మ రోడ్లపై దృష్టిసారించారు. హడావుడిగా పనులు చేపట్టి కాలువలపై కొంత మేర తొలగించి వదిలేశారు. ఇక ఫేజ్-2లో కోటిలింగాలపేట రోడ్డు, కాతేరు రోడ్డు, జెండాపంజా రోడ్డు, బైపాస్ రోడ్డు, స్టేడియం రోడ్డు, మూలగొయ్యి రోడ్డు, శేషయ్యమెట్ల రోడ్లను ప్రతిపాదించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు అనువుగా ఉండే విధంగా ఈ మార్గాలను గుర్తించారు. ఇప్పటికీ ఫేజ్-1 కొలిక్కి రాకపోగా, ఫేజ్-2 పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రోడ్ల విస్తరణ అధికారులకు కత్తి మీద సాములా మారింది.

**ఒత్తిళ్లతో వెనకడుగు**

నగర అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాల్సిన యంత్రాంగం ఒత్తిళ్లకు తలొగ్గుతోంది. నేతలు కూడా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా అధికారులను వెనక్కి లాగేస్తున్నారు. పూర్తిగా కాలువలను ఆక్రమిస్తే, ఏదో చేశామనే రీతిన ఒక మెట్టు కొట్టేసి వదిలేస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాలకు ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న రాజమహేంద్రవరంలో మెయిన్ రోడ్డు, ఎస్వీజీ మార్కెట్, తాడితోట సెంటర్లలో విస్తరణ పనులను పూర్తిగా పక్కన పెట్టారు. ఇక్కడ అధికార యంత్రాంగం అడుగుపెట్టాలంటే రాజకీయ నేతలను కలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా గోదావరి బండ్ రోడ్డును ఆనుకొని ఉన్న మెయిన్ రోడ్డు, కోటగుమ్మం మధ్యలో వీధులన్నీ పాత నగరంలో ముడిపడి ఉన్నాయి. కనీసం ఇక్కడకు అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. గత పుష్కరాలకు ఈ మార్గాల మీదుగా అనేక మంది గోదావరి గట్టుపైకి స్నానాల కోసం వెళ్లారు. రానున్న పుష్కరాలకూ ఇవే కీలకంగా మారనున్నాయి. కచ్చితంగా ఈ వీధులను విస్తరించాల్సి ఉంది. ఇక్కడే ప్రధాన మార్కెటు ఉండడంతో రాజకీయం మొత్తం మెయిన్ రోడ్డు చుట్టూ తిరుగుతుంది. గతంలో భారీ అపార్టుమెంటు కూలిపోయినప్పుడు, దుకాణాల్లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక వాహనం ఇక్కడకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా నేతలు జోక్యం తగ్గించి, రోడ్ల విస్తరణకు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కొండలను కొట్టేయ్.. ఆక్రమించేయ్..!

కార్వేటినగరం : ప్రభుత్వం మారి ఏడాదైనా కబ్జాదారుల తీరు మారలేదు.. కొండలు, గుట్టలు, కుంటలు, చెరువులు, పంట కాలువలను సైతం ఆక్రమించుకుంటున్నారు.. గత ప్రభుత్వం అనర్హులైన వారికి కూడా డీకేటీ పట్టాలు మంజూరు చేయడంతో వాటి ముసుగులో మిగిలిన ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు.

కార్వేటినగరం మండలం కేవీపురం గ్రామానికి సమీపంలో కొందరు కబ్జాదారులు రోడ్డు పక్కనే కొండలను యంత్రాలతో చదును చేసి



ఆక్రమణకు పాల్పడుతున్నారు. వైకాపా హయాంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న ఆ పార్టీ నేతలు.. ప్రస్తుతం ద్వితీయ శ్రేణి కూటమి నాయకుల సహకారంతో వాటిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కేవీపురం సమీపంలోని కొండ ప్రాంతంలో గతంలో ఎవరికైనా డీకేటీ పట్టాలు ఇచ్చారా లేదా విచారణ చేపడతాం. ప్రభుత్వ భూమి కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు యంత్రాలు సీజ్ చేస్తాం.

– నాగరాజు, తహసీల్దారు

# అన్నదాత సుఖీభవకు కసరత్తు

తిరుపతి : సూపర్ సిక్స్‌లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం అమలుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.. ఈ నెల 20న తొలి విడత నగదు జమ చేస్తామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు.. తదనుగుణంగా చిత్తూరు జిల్లాలో 1,45,255 మందిని ఎంపిక చేశారు.. ఈ మేరకు రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా తుది జాబితా విడుదల చేశారు.. రైతు సేవా కేంద్రాల్లో ఎంపికైన లబ్ధిదారులతో చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియ వేగవంతమైంది. ఇప్పటి వరకు 1,39,969 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు.

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని కూటమి ప్రభుత్వం



ప్రకటించింది. అందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు అందించనున్నాయి. కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో రూ.2 వేలు చొప్పున రూ.6 వేలు జమ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తొలి రెండు విడతల్లో రూ.5 వేలు చొప్పున, మూడో విడత రూ.4 వేలు చొప్పున సాయం అందించనుంది. తొలి విడత ఈ నెల 20న పీఎం కిసాన్ రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.7 వేలు ఎంపిక చేసిన రైతులకు నగదు జమ చేయనున్నారు.

# పిలిచినా రాలేను.. వచ్చినా మోయలేను

భీమవరం : అత్యవసర సమయంలో ప్రాణాలు నిలిపే 108 అంబులెన్సులు అనారోగ్యానికి గురవుతున్నాయి. గత ప్రభుత్వం రాష్ట్రంలో వేల సంఖ్యలో 108 వాహనాలు కొనుగోలు చేసి జిల్లాలకు కేటాయించింది. అప్పట్లో రహదారులు అధ్వానంగా ఉండటంతో మరమ్మతులకు గురయ్యాయి.వాటి నిర్వహణ బాధ్యతలు చూసే అరబిందో సంస్థ పట్టించుకోకపోవడంతో దెబ్బతిన్న వాహనాల్లోనే రోగులకు సేవలు అందిస్తున్నారు. ఆపదలో ఉన్న వారు ఫోన్ చేసిన 15 నుంచి 20 నిమిషాల్లో రావాల్సి ఉండగా ఆలస్యంగా వచ్చిన సందర్భాలు ఉన్నాయి. వాటి లోపల సీట్లు పాడవడం, లైట్లు, బ్యాటరీలు సరిగా పనిచేయకపోవడం, అదనపు టైర్లు లేక నడిరోడ్డుపై వాహనాలు నిలిపివేసిన ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 20 వాహనాలు కేటాయించారు. ఒకటి అదనంగా ఉంది. వీరవాసరం, మొగల్తూరు, ఆచంట తదితర మండలాల్లోని వాహనాలు నెలల తరబడి మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. ఇటీవల ఆచంట వాహనాన్ని బాగు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు.

**వేతనాల కోసం ఎదురుచూపులు..** జిల్లాలో 108 అంబులెన్సుల్లో వివిధ కేటగిరీలో 104 మంది పని చేస్తున్నారు. వీరికి రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వీరికి నిర్వహణ సంస్థ నుంచి గ్రాట్యుటీ, సెలవులకు సంబంధించిన బకాయిలు రావాల్సి ఉంది.ఒక్కో ఉద్యోగికి వేతనాల రూపంలో రూ.60 వేల నుంచి రూ.90 వేల వరకు రావాల్సి ఉండగా, గ్రాట్యుటీ, సెలవులకు సంబంధించిన బకాయిలు మరో రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఉందని సిబ్బంది చెబుతున్నారు.

**కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వ్యవస్థలన్నింటినీ గాడిలో పెడుతోంది. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు 108 సర్వీసు ప్రొవైడర్‌గా ఉన్న అరబిందోను ఆ బాధ్యతల నుంచి తొలగించి భవ్య సంస్థకు అప్పగించిందని 108 వాహనాల పర్యవేక్షణ జిల్లా మేనేజర్ డి.రాజు తెలిపారు. వచ్చే నెల నుంచి ఈ సంస్థ బాధ్యతలు తీసుకుంటుందన్నారు. సిబ్బంది వేతన బకాయిలు, మరమ్మతుల విషయమై ఉన్నతాధికారులతో చర్చించామని, మొగల్తూరు, వీరవాసరం వాహనాలను వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు.

## ఆడిషన్ ఇవ్వడానికి రెడీ.. తరువాత మీ ఇష్టం అంటున్న జెనీలియా

'బొమ్మరిల్లు' సినిమాతో 'హహ హాసిని' అంటూ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నటి జెనీలియా. దాదాపు పదమూడేళ్లుగా సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చింది. తాజాగా మళ్లీ వెండితెరపై కనిపించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. రానా హీరోగా ప్రకాష్ తోలేటి డైరెక్ట్ చేసిన నా ఇష్టం తరువాత తెలుగు సినిమాలకు గుడ్‌బై చెప్పేసిన జెనీలియా పదమూడేళ్ల విరామం తరువాత మళ్లీ తెలుగులో నటించడానికి రెడీ అయిపోయింది. రీసెంట్‌గా బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ ఆమీర్‌ఖాన్ నటించిన సితారే జమీన్‌పర్‌లో ప్రాముఖ్యత ఉన్న పాత్రలో మెరిసిన జెనీలియా అదే తరహా పాత్రల కోసం ఇప్పుడు అన్వేషణ మొదలు పెట్టింది. ఇందు కోసం ఆడిషన్‌కు కూడా తాను సిద్ధమేనంటూ సంకేతాల్ని అందిస్తోంది. ప్రస్తుతం కన్నడ, తెలుగు భాషల్లో రిలీజ్ కాబోతున్న జూనియర్‌లో నటిస్తున్న జెనీలియా ఇకపై టైలర్ మేడ్ క్యారెక్టర్‌లకు మాత్రమే ప్రాధాన్యత నివ్వాలని నిర్ణయించుకుందట. అలాంటి పాత్రలకే ప్రాముఖ్యతనిస్తానని, వాటి ఎంపిక కోసం ఆడిషన్‌లకు కూడా తాను సిద్ధమేనని డైరెక్టర్లకు ఓపెన్




ఆఫర్ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. రీసెంట్‌గా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో జెనీలియా పలు ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించింది. నేను చాలా ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. సీనియర్ నటిగా పేరు తెచ్చుకున్నాను. అలాంటి సీనియర్ నటిని అయిన నేను ఇప్పుడు ఆడిషన్‌లు ఇవ్వడం అవసరమా? అని కొంత మంది నన్ను ప్రశ్నిస్తున్నారు. నేను మాత్రం ఆడిషన్ ఇవ్వడం కరెక్టేనని భావిస్తున్నాను. ఎందుకంటే ఆడిషన్ ఇవ్వడం వల్ల సరైన క్యారెక్టర్లని ఎంచుకోనే మార్గం సులువు అవుతుంది. తద్వారా బలమైన పాత్రలు పోషించే అవకాశం లభిస్తుంది. కాబట్టి మంచి క్యారెక్టర్ల కోసం ఆడిషన్స్ ఇవ్వడంలో తప్పులేదని నాఫీలింగ్. ఈ విషయంలో నేను సంతోషంగా ఉన్నాను అని తెలిపింది. జెనీలియా సమాధాన్ని బట్టి ఆమెకు కళ పట్ల ఉన్న నిబద్ధత, ప్రేమ తెలుస్తోందని అంతా తనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తను ఇలా నిర్ణయించుకుంది కాబట్టే రీఎంట్రీలో సితార జమీన్‌పర్ వంటి సినిమాలని ఎంచుకుందని అంతా అంటున్నారు. జెనీలియా నటించిన జూనియర్ ఈ నెల 18న రిలీజ్ కాబోతోంది. ఇందులో తను కీలక పాత్రలో నటించింది. ఈ మూవీతో తనకు తెలుగులో భారీ ఆఫర్లు లభిస్తాయనే నమ్మకంతో ఉంది.

## రొమాంటిక్ బ్యూటీకి ఇదే చివరి అవకాశం..!

రొమాంటిక్ బ్యూటీ కెతిక శర్మ టాలెంట్ అందరికీ తెలిసిందే. తన డబ్ స్మాష్ వీడియోలతో అలరించిన ఈ బ్యూటీ పూరీ నిర్మించిన రొమాంటిక్ సినిమా ఛాన్స్ అందుకుంది. ఆ సినిమాతో ఎంట్రీ బాగానే దొరికినా ప్రాజెక్ట్ అంతగా సక్సెస్ అవ్వలేదు. ఐతే కెతిక గ్లామర్ షోకి కుర్రాళ్లు ఫిదా అయ్యారు. రొమాంటిక్ తర్వాత నాగ శౌర్యతో ఒక సినిమా చేసిన కెతిక ఆ సినిమాతో కూడా ఫెయిల్యూర్ ఫేస్ చేసింది. రెండు ఫ్లాపులు పడగానే టాలీవుడ్ లో ఛాన్స్ లు రావడం కొద్దిగా కష్టమే. అందుకే కెతిక శర్మ కాస్త వెనకపడింది. వైష్ణవ్ తేజ్ తో రంగ రంగ వైభవంగా కూడా మెప్పించలేదు. తర్వాత సాయి తేజ్ తో బ్రో సినిమా చేసిన ఈ అమ్మడు లేటెస్ట్ గా శ్రీవిష్ణు తో సింగిల్ సినిమాలో నటించింది. ఈ సినిమాలో ఇవానా కూడా మరో హీరోయిన్ గా చేసింది. ఓ పక్క తాను ఎంత



గ్లామర్ షో చేసి యూత్ ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తున్నా కూడా కెతికకు సరైన ఛాన్స్ లు రావట్లేదు. ఐతే శ్రీవిష్ణు సింగిల్ సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకుంది అమ్మడు. శ్రీవిష్ణు సినిమాలు అన్నీ ఆడియన్స్ కి మంచి ఎంటర్టైన్మెంట్ అందిస్తాయి. అలాంటి సినిమాలో కెతిక కూడా భాగమైంది. రీసెంట్ గా నితిన్ చేసిన రాబిన్ హుడ్ సినిమాలో కెతిక స్పెషల్ సాంగ్ చేసింది. అదిదా సర్ ప్రైజు అంటూ సాంగ్ తో అలరించింది కెతిక శర్మ. హీరోయిన్ గానే కాదు ఎలాంటి ఛాన్స్ వచ్చినా వదలకూడదని ఫిక్స్ అయ్యింది అమ్మడు. కెతిక శర్మ లోని గ్లామర్ ని పర్ఫెక్ట్ గా వాడుకుంటే సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది. కానీ ఎందుకో ఆ అటెంప్ట్ ఎవరు చేయట్లేదు. కెతిక లాంటి అందాల భామలు చేస్తున్న ప్రయత్నాలు సక్సెస్ అయితేనే తెర మీద గ్లామర్ షోని చూసే ఛాన్స్ ఉంటుంది. రొమాంటిక్ సినిమాతో కెరీర్ మొదలు పెట్టిన కెతిక ఇప్పటివరకు సూపర్ హిట్ కొట్టిన సినిమా లేదు. అయినా సరే మళ్లీ మళ్లీ ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఒక స్టార్ హీరోయిన్ అవ్వాల్సిన మెటీరియల్ అయినా కూడా కెతిక ఇప్పటికీ ఇంకా ఒక స్టార్ ఇమేజ్ తెచ్చుకోవడం కోసం ప్రయత్నిస్తుంది. ఐతే రాబోయే రోజుల్లో అయినా అమ్మడికి అలాంటి సూపర్ హిట్ సినిమా పడాలని ఆడియన్స్ కోరుతున్నారు.




## పవన్ కు పోటీగా అల్లు మూవీ?





టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటించిన హరిహర వీరమల్లు మూవీ రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఆ సినిమాను ఏఎం రత్నం నిర్మిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన చిత్రం.. ఇప్పుడు జులై 24వ తేదీన వరల్డ్ వైడ్ గా రిలీజ్ అవ్వనుంది. దీంతో ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు మేకర్స్. ప్రీ రిలీజ్ ఈవెంట్ కు ఏర్పాట్లు చేస్తున్నారు. స్పెషల్ ప్లాన్ వేస్తున్నారట. ఇప్పటికే టీజర్ తో ఆడియన్స్ తో పాటు సినీ ప్రియుల్లో మంచి బజ్ క్రియేట్ చేసిన మేకర్స్.. వాటిని ఇంకా పెంచాలని చూస్తున్నారు. ఔరంగజేబ్ నాటి చరిత్ర ఆధారంగా చేసుకుని సినిమా తెరకెక్కినట్లు ఇప్పటికే అర్థమవుతోంది. బందిపోటు వీరమల్లుగా పవన్ కళ్యాణ్ కనిపిస్తారని తెలుస్తోంది. ఏదేమైనా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం అయ్యాక పవన్ కాంపౌండ్ నుంచి వస్తున్న తొలి సినిమా హరిహర వీరమల్లు మంచి హిట్ అవ్వాలని అంతా భావిస్తున్నారు. అయితే ఇప్పుడు ఆ సినిమాకు పోటీగా మరో మూవీ రిలీజ్ కానుంది. అది కూడా డబ్బింగ్ చిత్రం కావడం గమనార్హం. వీరమల్లు వచ్చిన ఒకరోజు తర్వాత థియేటర్స్ లో సందడి చేయనుండగా.. దాన్ని ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ రిలీజ్ చేస్తున్నారు. కన్నడ బడా ప్రొడక్షన్ హౌస్ హొంబలే ఫిల్మ్స్ నిర్మించిన మహావతార్ నరసింహ చిత్రాన్ని ఆయన తెలుగులో విడుదల చేస్తున్నారు. అల్లు అరవింద్ కు చెందిన గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ తీసుకువస్తోంది. యానిమేషన్ ప్రధానంగా రూపొందిన మహావతార్ నరసింహా.. విష్ణువు దశావతారాల్లో ఒకటైన నరసింహ అవతారం ఆధారంగా తెరకెక్కుతోంది. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించిన ఆ ప్రాజెక్ట్.. యానిమేషన్ మూవీగానే రూపొందుతోంది. త్రీడీ వెర్షన్ లో తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో సందడి చేయనుంది. అయితే పవన్ హరిహర వీరమల్లుకు పోటీగా రిలీజ్ అవ్వడం గమనార్హం. అది కూడా అల్లు అరవింద్ తెలుగులో విడుదల చేయడం ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇది.. మెగా, అల్లు ఫ్యాన్స్ మధ్య ఈ క్లాష్ ఎలాంటి వాతావరణం క్రియేట్ చేస్తుందో అనేలా మరికొన్ని కామెంట్స్ కూడా వస్తున్నాయి.

దీంతో ఇప్పుడు మెగా హీరో పవన్ నటిస్తున్న సినిమాకు పోటీగా అల్లు అరవింద్ డబ్బింగ్ మూవీ రిలీజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే హొంబలే ఫిల్మ్స్ కాంపౌండ్ నుంచి వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ కాంతారను అప్పుడు తెలుగులో అల్లు అరవింద్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఓ రేంజ్ లో ఆ సినిమా తెలుగులో ఆకట్టుకుంది. భారీ హిట్ గా నిలవడమే కాకుండా.. వసూళ్ల వర్షం కురిపించింది. దీంతో హొంబలే వాళ్లు నిర్మించిన మహావతార్ నరసింహను అందుకే ఇప్పుడు అల్లు అరవింద్ రిలీజ్ చేస్తున్నారేమో. అయితే ఆయన వేరే సినిమాల విడుదల సమయంలో తీసుకొస్తే ఎలాంటి విశేషం ఉండేది కాదు. కానీ మెగా హీరో సినిమా టైమ్ లో రిలీజ్ చేస్తుండడంతో అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. మరి ఏ సినిమా ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## దసరాకి వాళ్లు రెడీ అవుతున్నారా?







దసరా సీజన్ అంటే స్టార్ హీరోల సినిమాలు సహజం. ఇప్పటికే నటసింహ బాలకృష్ణ- మెగాస్టార్ చిరంజీవి దసరా బరిలో ఉన్నట్లు కనిపిస్తుంది. బాలయ్య 'అఖండ 2 శివతాండవం'తో విధ్వంసం సృష్టించడానికి రెడీ అవుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆ సీజీన్ మిస్ కాకూడదని స్ట్రాంగ్ గా ఫిక్సై పని చేస్తుంది టీమ్. సరిగ్గా ఇదే సమయంలో చిరు 'విశ్వంభర' కూడా అదే సీజన్ ఎన్ క్యాష్ చేసుకోవాలని చూస్తుంది.

ఎలాగూ ఆలస్యమైంది. కొన్ని నెలలు అగితే మంచి సీజన్ దొరుకుతుందని దసరా కోసం వెయిట్ చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. వీళ్లిద్దరితో పాటు తాజాగా మరో ముగ్గురు స్టార్ హీరోలు కూడా పోటీగా బరిలోకి దిగడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శతకత్వంలో రాజాసాబ్ షూటింగ్ నత్తనడకన సాగు తున్న సంగతి తెలిసిందే. చిత్రీకరణ ముగింపు దశకు చేరుకన్న నేపథ్యంలో దసరా వరకూ పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి రిలీజ్ చేస్తే బాగుంటుందనే ఆలోచనలో ఉన్నారుట యూవీ నిర్మాతలు.

1అలాగే కోలీవుడ్ స్టార్ ధనుష్ నటిస్తోన్న ఇడ్లీ కడై ఇప్పటికే రిలీజ్ అవ్వాలి. కానీ అనివార్య కారణాలతో వాయిదా పడటంతో ధనుష్ కూడా దసరా అయితే బాగుంటుందని టీంతో డిస్కషన్స్ చేస్తున్నాడుట. అక్టోబర్ 1న రిలీజ్ చేస్తే బాగుంటుందని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. అలాగే కన్నడ స్టార్ రిషబ్ శెట్టి స్వీయా దర్శకత్వంలో కాంతార చాప్టర్ 1- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని కూడా దసరాకే రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యారట. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న రిలీజ్ చేయాలని ఆ తేదీని పరిశీలిస్తున్నారుట.

బాలయ్య సినిమా తొలుత సెప్టెంబర్ అను కున్నారు. కానీ దసరా ముందు పెట్టుకుని సెప్టెంబర్ ఎందుకని పున పరిశీలించి దసరాకి ఫిక్సైనట్లు తెలుస్తోంది.

## శ్రీలీలను మీ కార్ట్‌లో చేర్చుకోండి

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తున్న శ్రీలీల మరో వైపు కోలీవుడ్, బాలీవుడ్‌లో తన అదృష్టంను పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ఇదే సమయంలో కన్నడంలో 'జూనియర్' సినిమాలో కొత్త హీరోతో స్క్రీన్ షేర్ చేసుకుంది. ఆ సినిమా విడుదలకు సిద్ధం అయింది. జూనియర్ సినిమా ఈ వారంలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. కన్నడంలో రూపొందిన జూనియర్ సినిమాను తెలుగులో భారీ ఎత్తున విడుదల చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కేవలం శ్రీలీల నటించిన కారణంగా జూనియర్ సినిమాకు తెలుగు మార్కెట్‌లో మంచి బజ్ క్రియేట్ అయింది. ఇక శ్రీలీల రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎప్పటికప్పుడు తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉండే శ్రీలీల తాజాగా సరదా పిక్స్ ను షేర్ చేసింది. షాపింగ్ మాల్‌లో ఉండే కార్ట్‌లో కూర్చుని ఉన్న ఫోటోలను షేర్ చేసి సరదాగా 'నన్ను మీ కార్ట్ లో యాడ్' చేసుకోండి అంటూ కామెంట్ జోడించింది. శ్రీలీల అందమైన స్టైలిష్ లుక్‌లో ఉ



న్న ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. శ్రీలీల అలా కార్ట్‌లో కూర్చుని ఫోటోలకు ఫోజ్ ఇస్తే చాలా క్యూట్‌గా అనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. శ్రీలీలను ఇప్పటికే చాలా మంది తమ కార్ట్‌లో యాడ్ చేసుకుని అభిమానించడం మొదలు పెట్టారు. ఇప్పుడు ఆమె చేస్తున్న సినిమాలతో మరింత మందికి ఆమె చేరువ కావడం ఖాయం. హిందీలో ఈమె నటిస్తున్న కార్తీక్ ఆర్యన్ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. మొన్నటి వరకు ఈ సినిమాకు ఆషికీ 3 అనే టైటిల్‌ను అనుకున్నారు. దర్శకుడు కూడా అదే టైటిల్‌తో విడుదల చేయాలని భావించాడు. కానీ ఆషికి అనగానే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ అనే అభిప్రాయం అందరికీ కలుగుతుంది. అందుకే ఈ సినిమాపై అలాంటి ఉద్దేశం కలుగకూడదు అనే ఉద్దేశంతో మరో టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం అందుతోంది. కార్తీక్ ఆర్యన్ ప్రస్తుతం బాలీవుడ్‌లో మోస్ట్ హ్యాపెనింగ్ హీరో. ఆయన నటించిన పలు సినిమాలు ఈ మధ్య కాలంలో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకున్నాయి. అందుకే ఈ సినిమాపై అంచనాలు ఉన్నాయి. టాలీవుడ్‌లోనూ శ్రీలీల ఫుల్ బిజీగా ఉంది. రవితేజతో కలిసి మాస్ జాతర సినిమాలో నటిస్తోంది. ధమాకా సినిమా తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో మాస్ జాతర సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుంది అనే విశ్వాసం ను అంతా వ్యక్తం చేస్తున్నారు. శ్రీలీల అందాల ఔట్ ఫిట్‌లో క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఫోటోలు షేర్ చేస్తే ఎప్పటికప్పుడు ఆ ఫోటోలు వైరల్ అవుతూనే ఉంటాయి. ఇప్పుడు ఇలా సరదాగా కార్ట్ లో కూర్చుని ఫోటోలకు ఫోజ్ ఇచ్చిన ఫోటోలు కూడా భలే ఉన్నాయి అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అందంగా ముద్దుగా ఉన్న శ్రీలీలను మీరు మీ కార్ట్‌లో యాడ్ చేసుకున్నారా..!

## ముద్దుగుమ్మకు యుద్ధ భయం..!

బాలీవుడ్ హీరోయిన్ వాణి కపూర్ తాజాగా 'రైడ్ 2' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అజయ్ దేవగన్‌తో కలిసి నటించిన రైడ్ 2 బాక్సాఫీస్ డీసెంట్ ఓపెనింగ్స్‌ను దక్కించుకుంది. ఇతర స్టార్ హీరోల సినిమాలతో పోల్చితే రైడ్ 2 సినిమా పర్వాలేదు అన్నట్లుగా మంచి వసూళ్లు సొంతం చేసుకుంటుంది. ఈ సినిమా లాంగ్ రన్‌లో రూ.100 కోట్ల వసూళ్లు దక్కించుకోవడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వాణి కపూర్ కెరీర్‌లో చాలా కాలం తర్వాత ఒక హిట్ పడ్డట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తెలుగులో కెరీర్ ఆరంభించి దశాబ్ద కాలం దాటింది. అయినా కూడా ఇప్పటి వరకు ఆఫర్ల కోసం ఈమె ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. సౌత్ లో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపించని ఈమె బాలీవుడ్‌లో మాత్రం వచ్చిన ప్రతి ఆఫర్‌ను సద్వినియోగం చేసుకునేందుకు సాధ్యం అయినంత వరకు ప్రయత్నాలు చేస్తుంది. హృతిక్ రోషన్‌తో కలిసి నటించిన వార్ సినిమా భారీ విజయాన్ని



సొంతం చేసుకున్న కారణంగా బాలీవుడ్‌లో ఈమె బిజీ అవుతుందని అంతా భావించారు. కానీ ఈమెకు ఆశించిన స్థాయిలో ఆఫర్లు దక్కలేదు. ముందు ముందు అయినా వరుసగా సినిమా ఆఫర్లు వస్తాయని ఈ అమ్మడు ఆశతో ఎదురు చూస్తుంది. రైడ్ 2 తో పాటు ఈమె నటించిన అబీర్ గులాల్ సినిమా విడుదలకు రెడీ అవుతుంది. అయితే ఆ సినిమా విడుదల విషయంలో అనుమానాలు నెలకొన్నాయి.మే 9న అబీర్ గులాల్ సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. ఇప్పటికి సినిమా విడుదల వాయిదా వేయలేదు. కానీ సినిమా విషయంలో తీవ్రమైన వివాదం నెలకొంది. ఇండియన్ సినిమా అయినప్పటికీ పాకిస్తాన్ నటుడు పవాద్ ఖాన్ నటించిన సినిమా కావడంతో బ్యాన్ చేయాలంటూ చాలా మంది డిమాండ్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో ప్రస్తుతం ఈ విషయమై ప్రముఖంగా చర్చ జరుగుతోంది. కొందరు ఈ సినిమాకు మద్దతు తెలుపుతున్నారు. ప్రకాష్ రాజ్ ఈ సినిమా కు మద్దతుగా మాట్లాడిన విషయం తెల్సిందే. సినిమా విడుదలను అడ్డుకోవద్దు. ప్రేక్షకులు సినిమాను చూడాలా? వద్దా? అనేది నిర్ణయించుకుంటారు అన్నాడు. రైడ్ 2 సినిమా హిట్ కావడంతో అబీర్ గులాల్ సినిమా కూడా హిట్ అయితే వాణీ కపూర్ బాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. కానీ పాకిస్తాన్ నటుడు సినిమాలో ఉండటం ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. ఇండియా పాకిస్తాన్ మధ్య యుద్ద వాతావరణం నెలకొంది. యుద్ధం జరగడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. దీంతో పాకిస్తాన్ నటుడు నటించిన సినిమాను కచ్చితంగా విడుదల కానివ్వరు. ఒకవేళ విడుదల చేసినా కూడా కచ్చితంగా సినిమాకు తిరస్కరణ తప్పదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇప్పుడు ఇదే విషయం వాణీ కపూర్‌ను టెన్షన్ పెడుతుంది అంటూ ఆమె సన్నిహితులు చెబుతున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536